www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 11-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 342

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి ఉ.8.14 తదుపరి త్రయోదశి; నక్షత్రం: ఆశ్లేష రా.2.15 తదుపరి మఖ; వర్జ్యం: మ.2.23-4.05; అమృతఘడియలు: రా.12.33-2.15; దుర్ముహూర్తం: ఉ.8.51-9.39, రా.10.19-11.06; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.29; సూర్యాస్తమయం: 6.20 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మేడమ్ సార్.. మేడమ్ అంతే!

ఏపీలో అవినీతి కొత్తపుంతలు.. కొందరు ఉన్నతాధికారుల అక్రమాలకు తోడుగా భార్యలు

సార్ అపాయింట్‌మెంట్, సంతకం కావాలంటే మేడమ్‌ను కలవాల్సిందే

పనిని బట్టి రేటు నిర్ణయం

స్టార్ హోటళ్లలో మీటింగ్‌లు

కొందరు ఆఫీసులే పెట్టేశారు

13

సారుతో ఏదైనా పని కావాలంటే మొదట మేడమ్‌ను కలవాలి. సారు అపాయింట్‌మెంట్‌కు ఒక రేటు, పని చేయించడానికి ఒక రేటు ఉంటుంది. పనిని బట్టి మేడమ్ రేటు ఎంతన్నది నిర్ణయిస్తారు. మేడమ్ ఓకే చెబితేనే పని జరుగుతుంది. లేకుంటే అంతే. కూటమి ప్రభుత్వంలో కొందరు ఉన్నతాధికారుల అవినీతి బాగోతం ఇదీ.


ప్రణయ్, అమృత (ఫైల్)


సుభాష్‌శర్మ (ఫైల్)

ప్రణయ్ హంతకుడికి
మరణ శిక్ష



నరికి చంపిన సుభాష్‌శర్మకు ఉరి ఖరారు

అమృత బాబాయి శ్రవణ్‌కుమార్ సహా ఆరుగురికి యావజ్జీవ కారాగారం

సంచలన తీర్పు వెలువరించిన నల్లగొండ అదనపు జిల్లా కోర్టు

శిక్ష తగ్గించాలని నిందితుల వేడుకోలు

విచారణ దశలో అమృత తండ్రి, ప్రధాన నిందితుడు మారుతీరావు ఆత్మహత్య

కేసును సవాల్‌గా తీసుకున్న అప్పటి ఎస్పీ రంగనాథ్.. ఏడేళ్లు విచారణ

ఈ తీర్పు కులోన్మాదులకు చెంపపెట్టు

నిందితులూ సర్వం కోల్పోయారు

ప్రణయ్ తండ్రి పెరుమాళ్ల బాలస్వామి

నల్లగొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ప్రణయ్ హత్యకేసులో.. నల్లగొండ రెండో అదనపు జిల్లా కోర్టు, ఎస్సీఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం సోమవారం సంచలన తీర్పునిచ్చింది. ఈ కేసులో ప్రధాన నిందితుడు మారుతీరావు(ఏ1) 2020లో ఆత్మహత్య చేసుకోగా.. ఏ2 సుభాష్‌శర్మకు మరణ శిక్ష, మిగతా ఆరుగురికి యావజ్జీవ కారాగార శిక్షను విధిస్తూ.. జడ్జి రోజారమణి తీర్పునిచ్చారు. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. మిర్యాలగూడకు చెందిన తిరునగరు మారుతీరావు కుమార్తె అమృతవర్షిణి, పెరుమాళ్ల ప్రణయ్ తొమ్మిదో తరగతి నుంచి కలిసి చదువుకున్నారు. ఆ స్నేహం ప్రేమగా మారింది. కులాలు వేరుకావడంతో పెద్దలు తమ ప్రేమను అంగీకరించరని గ్రహించి.. వారిద్దరూ 2018 జనవరి 31న హైదరాబాద్ ఆర్యసమాజ్‌లో పెళ్లి చేసుకున్నారు. తన కూతురు అమృత ఒక ఎస్సీ(మాల)ను వివాహం చేసుకోవడాన్ని జీర్ణించుకోలేని మారుతీరావు(ఆర్యవైశ్య సామాజికవర్గం) ఆ పెళ్లిని పెటాకులు చేసేందుకు ప్రయత్నించారు. ఓ దశలో తన కుమార్తెను వదిలేస్తే.. రూ.1.50 కోట్లు ఇస్తానంటూ ప్రణయ్ తల్లిదండ్రులను మభ్యపెట్టారు. అయితే తమకు మారుతీరావు, ఆయన సోదరుడు శ్రవణ్‌కుమార్ నుంచి ముప్పు పొంచి ఉందంటూ

మిగతా 10వ పేజీలో...

తీసుకున్నది ఎంత..
ఇచ్చింది ఎంత?

పదేళ్లలో తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులపై చర్చకు సిద్ధం

కేంద్రానికి చెల్లించిన పన్నుల కంటే ఎక్కువ నిధులిస్తే కిషన్‌రెడ్డికి సన్మానం చేస్తా.. గండపెండేరం తొడుగుతా

కులగణన సర్వే వల్లే బడుగు నేతలకు ఎమ్మెల్సీ సీట్లు

పట్టభద్రుల ఓట్లను బీజేపీకి మళ్లించిన బీఆర్ఎస్

రాష్ట్ర ప్రయోజనాల కోసం 99 సార్లయినా ఢిల్లీకి వెళతా

జీతభత్యాలు తీసుకుంటూ పనిచేయనిది కేసీఆర్ ఒక్కరే

స్టేచర్ అంటే రోజూ మందు తాగితేనే వస్తుందా?

రైతు బాధపడుతుంటే పైశాచికానందం పొందుతారా?

గత నోటిఫికేషన్లకు వర్గీకరణ రిజర్వేషన్ వర్తించదు

మీడియాతో ఇష్టాగోష్ఠిలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు


అసెంబ్లీలో ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రం ఇస్తున్న విజయశాంతి. చిత్రంలో సీఎం రేవంత్

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): "తెలంగాణ రాష్ట్రం 2014 జూన్ 2 నుంచి ఇప్పటివరకు కేంద్రానికి చెల్లించిన పన్నులు ఎన్ని? అందులో కేంద్రం తిరిగి తెలంగాణకు ఇచ్చింది ఎంత? ఏ రూపంలో ఇచ్చిన నిధులైనా.. లెక్కల ప్రాతిపదికన మాట్లాడుకుందాం. అన్నింటిపైనా చిత్తశుద్ధితో చర్చ చేద్దాం" అంటూ సీఎం రేవంత్‌రెడ్డి.. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సవాల్ విసిరారు. చర్చకు తాను, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కలిసి వస్తామని, తెలంగాణ చెల్లించిన పన్నుల కంటే కేంద్ర ప్రభుత్వం అదనంగా నిధులు ఇస్తే అక్కడికక్కడే కిషన్‌రెడ్డికి సన్మానం చేస్తామని అన్నారు. తెలంగాణకు కేంద్రం రూ.10 లక్షల కోట్ల నిధులు ఇచ్చిందంటూ కిషన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సీఎం ఈ మేరకు

మిగతా 13వ పేజీలో...

ఐదు ఎమ్మెల్సీ సీట్లకు ఐదుగురు

12

ఏకగ్రీవ ఎన్నిక లాంఛనమే

కాంగ్రెస్, సీపీఐ అభ్యర్థుల నామినేషన్ల దాఖలుకు హాజరైన సీఎం, మంత్రులు

కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ అభ్యర్థి దాసోజు శ్రవణ్ నామినేషన్

రేపటి నుంచి అసెంబ్లీ

13

బడ్జెట్ సమావేశాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమీక్ష

అసెంబ్లీ ఆవరణలో నిరసనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలంతా క్రమం తప్పకుండా సమావేశాలకు హాజరు కావాలి: గుత్తా

గ్రూప్-1 ఫలితాలు విడుదల

రీకౌంటింగ్‌కు 15 రోజుల గడువు

పలువురికి 60% దాటిన మార్కులు

నేడు గ్రూప్-2 జనరల్ ర్యాంకింగ్ జాబితా విడుదల

14



నాణ్యమైన విద్య..
మిథ్యే

ప్రాథమిక పాఠశాలల్లో పరిస్థితులు దారుణం

13,930 ప్రభుత్వ ప్రాథమిక బడుల్లో 50 లోపే విద్యార్థులు

4,235 ప్రభుత్వ పాఠశాలల్లో ఏకోపాధ్యాయుడు

నర్సరీ నుంచి ఇంటర్ వరకు 'తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు'

మండలానికి మూడు చొప్పున ఏర్పాటు చేయాలి

నర్సరీ నుంచి 2వ తరగతి వరకు ఫౌండేషనల్ స్కూళ్లు

మండలానికి నాలుగు చొప్పున ఏర్పాటు చేయాలి

632 మండలాల్లో ఏర్పాటుకు రూ. 22,752 కోట్ల ఖర్చు

ప్రభుత్వ బడులకు మినీ బస్సుల సౌకర్యం కల్పించాలి

ప్రభుత్వానికి తెలంగాణ విద్యా కమిషన్ నివేదిక

హైదరాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలపై భారీగా ఖర్చు చేస్తున్నా విద్యార్థులకు కలుగుతున్న ప్రయోజనం అంతంత మాత్రమేనని తెలంగాణ విద్యా కమిషన్ తెలిపింది. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య.. మిథ్యగానే ఉందని స్పష్టం చేసింది. నాణ్యమైన విద్య అందించాలంటే ప్రస్తుతమున్న పాఠశాల వ్యవస్థను సమూలంగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. దీని కోసం నర్సరీ నుంచి ఇంటర్ వరకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ (టీపీఎస్), పూర్వ ప్రాథమిక తరగతుల కోసం నర్సరీ నుంచి 2వ తరగతి వరకు తెలంగాణ ఫౌండేషనల్ స్కూల్స్ (టీఎఫ్ఎస్) ఏర్పాటు చేయాలని సూచించింది. తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, సభ్యులు

మిగతా 14వ పేజీలో...


ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న కాంగ్రెస్ ఎంపీలు

కేటీఆర్ మతి భ్రమించి మాట్లాడుతున్నారు!

12

సీఎంపై వ్యాఖ్యలు ఆయన మానసిక స్థితికి నిదర్శనం

ఇకనైనా మారకపోతే ప్రజలు తరిమికొడతారు

రాష్ట్ర పెండింగ్ ప్రాజెక్టులపై అన్ని పార్టీల ఎంపీలతో వెళ్లి ప్రధాని, కేంద్ర మంత్రుల్ని కలుస్తాం: కాంగ్రెస్ ఎంపీలు



టీడీఆర్ స్కామ్‌కు రేవంత్ కుట్ర

ఆయన చుట్టూ నలుగురు 'రియల్' బ్రోకర్లు

టీడీఆర్‌లపై శ్వేతపత్రం విడుదల చేయాలి

బీసీ రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలో సీఎం చచ్చేదాకా దీక్ష చేయాలి

కేసీఆర్ అసెంబ్లీకి వస్తారు.. ఆయన స్థాయికి రేవంత్ సరిపోరు

14

మళ్లీ తెరపైకి ఫార్ములా-ఈ రేసు కేసు

చిట్‌చాట్‌లో బీఆర్ఎస్ నేత కేటీఆర్

పంటతడి.. కంటతడి!

సాగునీరు లేక పొట్టదశలో ఎండిపోతున్న వరి

అడుగంటిన భూగర్భజలాలు.. వట్టిపోయిన బోర్లు

ఆయకట్టు రైతులకూ కన్నీరే.. ప్రాజెక్టుల నుంచి నీళ్లేవి?

పూడిక, పిచ్చిమొక్కలతో అధ్వానంగా మారిన కాల్వలు

మరమ్మతులు లేక చివరి భూములకు అందని నీరు

ఏమాత్రం ఆశల్లేక వరి పొలాల్లోకి పశువుల వదిలివేత

కొన్నిచోట్ల ట్యాంకర్లతో నీరు తెచ్చి పోస్తున్న రైతులు

వెంటనే సాగునీరు విడుదల చేయాలంటూ ఎస్సారెస్పీ నాగార్జున సాగర్ ఆయకట్టు రైతుల ఆందోళన

యాదాద్రి భువనగిరి జిల్లాలో కౌలురైతు ఆత్మహత్య

సిరిసిల్ల గంభీరావుపేటలో గొర్రెలకు మేతగా..



(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

యాసంగి రైతు ఆలోచనల్లో పడ్డాడు. పంట చేతికొచ్చేనా? లేదంటే పెట్టుబడంతా మట్టిపాలేనా? అనే ఆశనిరాశల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. జోరుగా వరినాట్లు వేసి.. కలుపు తీయించి.. ఎరువులు చల్లితే తీరా పొట్టదశకొచ్చాక వరిపైరు వాడుముఖం పడుతోంది. కొన్నిచోట్లయితే పొలం నెర్రలు తేలింది. ఎండలు మొదలయ్యాయో లేదో

మిగతా 9వ పేజీలో...

థాయ్‌లాండ్ సైబర్ నేరగాళ్ల వలలో భారత యువత

కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవతో స్వదేశానికి..

13

మొత్తం 540 మందికి విముక్తి

వారిలో తెలుగు రాష్ట్రాలకు చెందిన 42 మంది.. 2 విమానాల్లో తరలింపు

ఆర్థిక ఇబ్బందులకు
కుటుంబం బలి

పిల్లలకు విషమిచ్చి చంపి.. ఉరేసుకొని దంపతుల ఆత్మహత్య

హబ్సిగూడ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆరు నెలలుగా ఖాళీగా ఉండటం.. కుటుంబ పోషణకూ ఇబ్బందులు ఎదురవడంతో ఆ ఇంటిపెద్ద, భార్యాపిల్లలతో కలిసి చనిపోవాలనుకున్నాడు. ఇందుకు భార్యను ఒప్పించాడు. ఇద్దరు పిల్లలకు విషమిచ్చి చంపిన తర్వాత ఆ దంపతులు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. హబ్సిగూడలో ఈ విషాదం జరిగింది. మహబూబ్‌నగర్ జిల్లా కల్వకుర్తికి చెందిన కె.చంద్రశేఖర్‌రెడ్డి(40)కి భార్య కవిత(35), పిల్లలు శ్రీతా(15), విశ్వంత్(10) ఉన్నారు. కవిత గృహిణి. శ్రీతా తొమ్మిదో తరగతి, విశ్వంత్ ఐదో తరగతి చదువుతున్నారు. ఏడాదిగా ఈ కుటుంబం హబ్సిగూడలోని మహేశ్వరినగర్‌లో ఉంటోంది.. సోమవారం రాత్రి పిల్లలకు విషమిచ్చి చంపి.. చంద్రశేఖర్, కవిత ఆత్మహత్య చేసుకున్నారు. అతను రాసిన సూసైడ్ నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందులో ఏముందనేది వెల్లడించలేదు.

సగం మందికి కంటి నిండా నిద్ర కరవు!

- 59% మంది భారతీయులకు 6 గంటలకన్నా తక్కువ సేపే..
- దోమలు, సెల్‌ఫోన్లు కారణం



న్యూఢిల్లీ, మార్చి 10: గాఢంగా నిద్రపడితే చాలు.. చాలా రోగాలు దరి చేరవు. రోజుకు ఎనిమిది గంటల పాటు ఎలాంటి అంతరాయాలు లేకుండా నిద్ర ఉండాలని చాలా మంది ఆశిస్తారు. అయితే దేశంలో 59% మందికి ఆ అదృష్టం లేదు. అంతరాయాలు లేని ఆరు గంటల నిద్ర వారికి కరవయింది. ఈ నెల 14న జరిపే 'ప్రపంచ నిద్ర దినం' సందర్భంగా లోకల్ సర్కిల్ సంస్థ దేశ వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో ఈ విషయం వెల్లడైంది. సర్వేలో భాగంగా 343 జిల్లాల్లోని 40వేల మంది అభిప్రాయాలను సేకరించారు. వీరిలో 61% మంది పురుషులు, 59% మంది మహిళలు ఉన్నారు. సర్వే ప్రకారం.. 39% మంది 6-8గంటల పాటు నిద్ర పోతున్నారు. మరో 39 శాతం మంది 4-6 గంటల పాటు పడుకుంటున్నారు. కేవలం 2% మంది మాత్రమే 8-10 గంటలపాటు నిద్రపోతున్నారు. 20% మంది నాలుగు గంటల కన్నా తక్కువ సమయంపాటే పడకుంటున్నారు. మొత్తంగా 59% మందికి ఆటంకాలు లేని ఆరు గంటల నిద్ర కరవయిందని తేలింది. ఆలస్యంగా నిద్రపోవడం, త్వరగా లేవాల్సి రావడం, దోమల బెడద, సెల్‌ఫోన్‌లు, బయట శబ్దాలు, చిన్న పిల్లల అల్లరి తదితర కారణాల వల్ల సక్రమంగా నిద్ర పట్టడం లేదని పలువురు తెలిపారు. నిద్రలేమి ఆరోగ్య సమస్యలకు దారి తీస్తుందని లోకల్ సర్కిల్స్ వ్యవస్థాపకుడు సచిన్ తపారియా చెప్పారు. నిద్రలేని సమస్య భారత్‌లోనే అధికంగా ఉందని అన్నారు.

జపాన్ వీధుల్లో డ్రైవర్ రహిత కారు రయ్ రయ్!

- డ్రైవర్ లెస్ వాహనాన్ని పరీక్షించిన నిస్సాన్ సంస్థ



యొకొహామా, మార్చి 10: అది జపాన్‌లోని యొకొహామా నగరం.. నిత్యం రద్దీగా ఉండే ఆ నగరంలో డ్రైవర్ లేకుండానే ఒక కారు రోడ్డుపై వెళుతోంది. డ్రైవింగ్ సీటులో ఎవరూ లేకున్నా తనంతట తానే స్టీరింగ్‌ని కంట్రోల్ చేసుకుంటూ.. సందులు, మలుపులు వచ్చినప్పుడు బ్రేకులు వేస్తూ జాగ్రత్తగా ముందుకు సాగుతోంది. సడెన్‌గా ఎవరైనా అడ్డొస్తే తనంతట తనే ఆగిపోతుంది. జపాన్‌కు చెందిన ప్రముఖ కార్ల కంపెనీ నిస్సాన్.. సోమవారం ట్రాఫిక్, జనంతో నిండిన రోడ్లపై ఈ మానవ రహిత కారుని విజయవంతంగా పరీక్షించింది. 14 కెమెరాలు, 9 రాడార్లు, 6 లైడార్ సెన్సర్లను ఉపయోగించి అధునాతన టెక్నాలజీతో నిస్సాన్ ఈ డ్రైవర్ లెస్ కారుని అభివృద్ధి చేసింది. ఇప్పటికే అమెరికాలో గూగుల్ సంస్థ అభివృద్ధి చేసిన డ్రైవర్ రహిత 'వేమో' కార్లకు ఇది పోటీ ఇవ్వనుందని భావిస్తున్నారు. ప్రపంచంలోని అగ్రశ్రేణి ఆటోమొబైల్ కంపెనీలకు నిలయమైన జపాన్‌లో ఈ ఏడాది 'వేమో' అడుగుపెట్టనుంది. ఈ నేపథ్యంలో నిస్సాన్ తన డ్రైవర్ లెస్ కారుని పరీక్షించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. పరీక్షలో నిస్సాన్ డ్రైవర్‌లెస్ కారు గంటకు 40 కిలోమీటర్ల వేగంతో నడిచింది.



ఎక్స్ సేవలకు తీవ్ర అంతరాయం

- భారీ సైబర్ దాడి జరిగిందన్న మస్క్
- ఏదైనా దేశం హస్తం ఉండొచ్చని వ్యాఖ్య



న్యూఢిల్లీ, మార్చి 10: సామాజిక మధ్యమం ఎక్స్ సేవలు సోమవారం పలుమార్లు స్తంభించాయి. భారత్‌తో సహా ప్రపంచంలోని పలు దేశాల్లో ఎక్స్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. 'డౌన్ డిటెక్టర్' నివేదిక ప్రకారం సోమవారం మూడు దఫాలుగా (ప్రతిసారి గంట చొప్పున) ఎక్స్ సేవలకు అంతరాయం ఏర్పడింది. మధ్యాహ్నం 3గంటలకు తీవ్ర ప్రతిష్టంభన నెలకొంది. ఆ తర్వాత రాత్రి 7.30 సమయంలో, రాత్రి 9 గంటల ప్రాంతంలో కూడా ఎక్స్ అందుబాటులోకి రాలేదంటూ వినియోగదారులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుల్లో 52% వెబ్‌సైట్‌కు సంబంధించినవి కాగా 41% యాప్‌కు చెందినవి. 8 శాతం సర్వర్ కనెక్షన్‌కు సంబంధించినవి. ఎక్స్ భారీ సైబర్ దాడికి గురైందని ఎలాన్ మస్క్ ప్రకటించారు. దీని వెనక సమన్వయంతో పనిచేస్తున్న పెద్ద ముఠా కానీ ఏదైనా దేశం హస్తం కానీ ఉండొచ్చని ఎక్స్ వేదికగా అనుమానం వ్యక్తం చేశారు. సైబర్ దాడి కారణంగా రోజంతా మూడు సార్లు (ప్రతిసారి దాదాపు గంట పాటు) అంతరాయాలు ఏర్పడ్డాయన్నారు. 'ఎక్స్‌పై భారీ సైబర్ దాడి జరిగింది. ఇప్పటికీ కొనసాగుతోంది. ప్రతిరోజూ సైబర్ దాడులను ఎదుర్కొంటున్నాం. కానీ ఈసారి చాలా పెద్ద ఎత్తున జరిగింది. సమన్వయంతో కూడిన ఓ పెద్ద ముఠా కానీ లేదా ఏదైనా దేశం కానీ దీని వెనక ఉండొచ్చు. వారిని గుర్తించే పనిలో ఉన్నాం..' అని వెల్లడించారు.

జర్మనీలో విమానాశ్రయ ఉద్యోగుల ఒకరోజు సమ్మె..

నిలిచిపోయిన వేలాది విమానాలు

బెర్లిన్, మార్చి 10: వేతనాలు పెంచాలని, భద్రతా సిబ్బంది కాంట్రాక్టు నిబంధనలు మార్చాలని డిమాండు చేస్తూ జర్మనీలో విమానాశ్రయాల ఉద్యోగులు సోమవారం ఒక రోజు సమ్మె చేశారు. చిన్న, పెద్ద అన్ని విమానాశ్రయాల సిబ్బంది ఇందులో పాల్గొన్నారు. అర్ధరాత్రి నుంచే 24 గంటల వాకౌట్‌ను అమలు చేశారు. దీంతో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. దేశవ్యాప్తంగా వేలాది విమాన సర్వీసులు రద్దయ్యాయి. ఒక్క ఫ్రాంక్‌ఫర్ట్ విమానాశ్రయంలోనే రోజుకు 1,116 టేకాఫ్‌లు, ల్యాండింగ్‌లు జరగాల్సి ఉండగా వాటిలో 1,054 రద్దయ్యాయి. చాలా చోట్ల విమానాల ల్యాండింగ్‌లు జరిగినా టేకాఫ్‌లు నిలిచిపోయాయి. ఉద్యోగుల జీతాల పెంపుపై శుక్రవారం మళ్లీ చర్చలు జరగనున్నాయి. భద్రతా సిబ్బంది కాంట్రాక్టు నిబంధనలకు సంబంధించి ఈ నెల 26న సంప్రదింపులు జరుగుతాయి.

90% తగ్గనున్న మధుమేహ ఔషధ ధరలు!

న్యూఢిల్లీ, మార్చి 10: మధుమేహ చికిత్సలో వాడే కీలక డ్రగ్ ఎంపాగ్లిఫ్లోజిన్ ఔషధం ధరలు త్వరలోనే గణనీయంగా తగ్గనున్నాయి. ప్రస్తుతం ఎంపాగ్లిఫ్లోజిన్ ఔషధాన్ని తయారుచేస్తున్న బోహ్రింగర్ ఇంగెల్‌హీమ్ పేటెంట్ గడువు ఈ నెల 11వ తేదీ (మంగళవారం)తో ముగియబోతోంది. ఈ నేపథ్యంలోనే ఆ కంపెనీ ఫార్ములాతో జనరిక్ మందులను అత్యంత తక్కువ ధరకు అందించేందుకు దేశీయ ఫార్మా సంస్థలు టొరెంట్, మ్యాన్‌కైండ్ ఫార్మా, అల్కెమ్, డాక్టర్ రెడ్డీస్, లుపిన్ సిద్ధమవుతున్నాయి. దీంతో దేశంలో మధుమేహంతో బాధపడుతున్న 10.1 కోట్ల మందికి ఊరట కలగనుంది. మ్యాన్‌కైండ్ ఫార్మా మేరకు.. ఎంపాగ్లిఫ్లోజిన్ డ్రగ్‌కు సంబంధించిన ట్యాబ్లెట్ ధర రూ.60గా ఉంది. దీన్ని జనరిక్ వెర్షన్‌లో పదో వంతుకు తగ్గించి ఇవ్వాలని ఆ సంస్థ భావిస్తోంది. ఇటు చాలా జనరిక్ వెర్షన్ల ఒక్కో ట్యాబ్లెట్ ధర మార్కెట్‌లో రూ.9 నుంచి రూ.14 లోపే మార్కెట్‌లో లభిస్తాయని అంచనా.

తుపాకీ గురిపెట్టి రూ.25 కోట్ల నగల చోరీ

- బిహార్ తనిష్క్ షోరూమ్‌లో ఘటన

పట్నా, మార్చి 10: బిహార్‌లో పట్టపగలే దొంగలు రెచ్చిపోయారు. ఆరాలోని తనిష్క్ నగల షోరూమ్‌లోకి ప్రవేశించి అక్కడున్న సిబ్బందికి, కస్టమర్లకు తుపాకులు గురిపెట్టి రూ.25 కోట్ల విలువైన నగలతో ఉడాయించారు. ఆరాలో ఉన్న తనిష్క్ షోరూమ్‌ను రోజూ మాదిరి సోమవారం ఉదయం 10:30 గంటలకు తెరిచారు. కాసేపటికి ఐదారుగురు వ్యక్తులు తుపాకులతో షోరూమ్‌లోకి ప్రవేశించారు. వారిలో పలువురు మాస్కులు, హెల్మెట్‌లు ధరించారు. సెక్యూరిటీ గార్డు వద్ద ఉన్న తుపాకీని లాక్కుని, అక్కడున్న సిబ్బందిని, కస్టమర్లను వారి వద్ద ఉన్న ఆయుధాలతో బెదిరించి షో కేసు బాక్సుల్లో భద్రపరిచిన రూ.25 కోట్ల విలువైన నగలను దోచుకుళ్లారు. ఈ ఘటన మొత్తం సీసీటీవీ కెమెరాల్లో రికార్డయింది. పోలీసులు వారిని వెంబడించి కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు దొంగలు గాయపడ్డారు. అయినా తప్పించుకున్నారు.

తృణమూల్‌లో చేరిన బీజేపీ మహిళా ఎమ్మెల్యే

కోల్‌కతా, మార్చి 10: పశ్చిమ బెంగాల్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే తపసీ మండల్ సోమవారం తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. ఆమె తూర్పు మిద్నాపూర్ జిల్లా హల్దియా (ఎస్సీ) నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బీజేపీ అనుసరిస్తున్న విభజన రాజకీయాలను ఇంకెంతమాత్రం ఆమోదించలేనని ప్రకటించారు 2016లో సీపీఎం తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన ఆమె 2020లో బీజేపీలో చేరారు. 2021లో బీజేపీ తరఫున పోటీ చేసి విజయం సాధించారు. తాజాగా రాష్ట్ర మంత్రి అనూప్ బిశ్వాస్ నుంచి తృణమూల్ జెండాను అందుకొని ఆ పార్టీలో చేరారు. ఆ జిల్లాకు చెందిన బీజేపీ నాయకుడు శ్యామల్ మెయిటీ కూడా తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు.

ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ బఘేల్ నివాసంలో ఈడీ సోదాలు

- రూ.33 లక్షలు స్వాధీనం, భూపేశ్ తనయుడికి సమన్లు

రాయ్‌పూర్, మార్చి10: ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ బఘేల్, ఆయన తనయుడు చైతన్య బఘేల్ నివాసాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. మద్యం కుంభకోణానికి సంబంధించిన మనీ లాండరింగ్ కేసులో భాగంగా దుర్గ్ జిల్లా భిలాయ్‌లోని చైతన్య బఘేల్ సన్నిహితులకు సంబంధించి మొత్తం 15 చోట్ల సోదాలు జరిగాయి. రూ.33 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. సోదాలతో ఆగ్రహించిన కాంగ్రెస్ కార్యకర్తలు ఈడీ అధికారులపై దాడికి పాల్పడ్డారు. మరోవైపు ఈడీ అధికారులు చైతన్య బఘేల్‌కు సమన్లు జారీ చేశారు. మంగళవారం విచారణకు రావాలని ఆదేశించారు. 2019-2022 మధ్య కాలంలో భూపేశ్ బఘేల్ సీఎంగా ఉన్న సమయంలో జరిగిన మద్యం కుంభకోణం వల్ల మద్యం సిండికేట్‌కు రూ.2100 కోట్ల లబ్ధి చేకూరిందని ఈడీ ఆరోపించింది. ఈ కేసులో ఇప్పటికే ఛత్తీస్‌గఢ్ మాజీ మంత్రి కవాసి లఖ్మాతో పాటు పలువురిని అరెస్ట్ చేశారు.

కశ్మీర్‌లో ఫ్యాషన్ షోపై తీవ్ర దుమారం

న్యూఢిల్లీ, మార్చి 10: ప్రముఖ ఫ్యాషన్ డిజైనర్లు శివన్, నరేశ్ ఈ నెల 7న జమ్మూకశ్మీర్‌లో నిర్వహించిన ఫ్యాషన్ షో తీవ్ర వివాదాస్పదమైంది. పవిత్ర రంజాన్ మాసంలో కశ్మీర్‌లో ముస్లింల మనోభావాలను దెబ్బతీసేలా ఈ ఫ్యాషన్ షోను నిర్వహించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో, శివన్, నరేశ్ క్షమాపణలు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఎక్స్‌లో పోస్టు చేశారు. ప్రజల మనోభావాలు దెబ్బతీయడం తమ ఉద్దేశం కాదని, మంచు పర్వతాల్లోని వస్త్రధారణను, జీవనవిధానాన్ని ప్రతిబింబేందుకే ఈ ఫ్యాషన్ షో నిర్వహించామని చెప్పారు. తాము అన్ని సంస్కృతులను గౌరవిస్తామన్నారు. అంతకుముందు కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా.. "గుల్‌మార్గ్‌లో ఫ్యాషన్ షో పట్ల ప్రజల అభ్యంతరాలు, ఆగ్రహం సరైనవే. ఆ వీడియో స్థానిక ప్రజల మనోభావాలకు ఇబ్బంది కలిగించేలా ఉంది" అని ఎక్స్‌లో పోస్టు చేశారు.

హిందీపై మాటల యుద్ధం

లోక్‌సభలో డీఎంకే నిరసన.. బయట ప్రదర్శన

- విద్యార్థులను నాశనం చేస్తున్న తమిళనాడు ప్రభుత్వం
- కేంద్ర విద్యా శాఖ మంత్రి ప్రధాన్
- మంత్రిది అహంకారపూరిత ధోరణి
- తమిళనాడు సీఎం స్టాలిన్ విమర్శ


ప్రధాన్, స్టాలిన్

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): జాతీయ విద్యా విధానంపై సోమవారం లోక్‌సభతో పాటు, బయట కూడా మాటల యుద్ధం కొనసాగింది. త్రిభాషా సూత్రం పేరుతో కేంద్రం బలవంతంగా హిందీని రుద్దుతోందని తమిళనాడుకు చెందిన డీఎంకే ఆరోపించగా, తమిళనాడు ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తోందని కేంద్రం ప్రత్యారోపణ చేసింది. ఈ సందర్భంగా కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఆయన నోరును అదుపులో పెట్టుకోవాల్సి ఉంటుందని తమిళనాడు సీఎం ఎం.కె.స్టాలిన్ వ్యాఖ్యానించారు.

కావాలనే రాజకీయం చేస్తున్నారు: ప్రధాన్

తొలుత లోక్‌సభలో డీఎంకే ఎంపీలు జాతీయ విద్యా విధానం అంశాన్ని లేవనెత్తి కేంద్రం తీరుపై నిరసన వ్యక్తం చేశారు. దీంతో స్పీకర్ ఓం బిర్లా సభను అరగంట పాటు వాయిదా వేశారు. ఆ తర్వాత మళ్లీ సభను ప్రారంభించినప్పటికీ పరిస్థితిలో ఎటువంటి మార్పు లేదు. డీఎంకే ఎంపీలు మరోసారి నిరసన తెలుపుతుండగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఎం శ్రీ (పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకంపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. తమిళనాడు విద్యార్థుల భవిష్యత్తును డీఎంకే నాశనం చేస్తోందని మండిపడ్డారు. హిందీ భాష అమలు అంశంలో తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రజలను తప్పుతోవపట్టిస్తున్నారని ఆరోపించారు. తమిళనాడు ప్రభుత్వం ఈ అంశాన్ని ఉద్దేశ పూర్వకంగానే రాజకీయం చేస్తోందని, విద్యార్థుల భవిష్యత్తును గందరగోళంలోకి నెట్టాలని చూస్తోందని ఆరోపించారు. డీఎంకే అనాగరికంగా, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. తమిళనాడు ప్రభుత్వం మొదట్లో నూతన విద్యా విధానం అమలుపై సంతకం చేయడానికి అంగీకరించిందని, కానీ ఇప్పుడు అనవసరంగా రాద్ధాంతం చేస్తోందని విమర్శించారు. డీఎంకేలో ఉన్న అంతర్గత విభేదాల కారణంగానే త్రిభాషా సూత్రాన్ని వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. ఈ సందర్భంగా మంత్రి ఉపయోగించిన మాటలపై డీఎంకే సభ్యులు అభ్యంతరం చెప్పగా స్పీకర్ వాటిని రికార్డుల నుంచి తొలగించారు. డీఎంకే సభ్యురాలు కనిమొళి.. మంత్రి ప్రధాన్‌పై సభా హక్కుల తీర్మానం ప్రవేశపెడుతామంటూ స్పీకర్‌కు నోటీసు అందజేశారు.

మేం ఎప్పుడూ ఒప్పుకోలేదు

డీఎంకే సభ్యులు కనిమొళి, దయానిధి మారన్‌లు మాట్లాడుతూ నూతన విద్యా విధానం, త్రిభాషా సూత్రాన్ని డీఎంకే ఎప్పుడూ అంగీకరించలేదని తెలిపారు. ఉత్తరాది విద్యార్థులు కేవలం ఒక్క భాషను నేర్చుకుంటుండగా, తమిళనాడులో మూడు భాషలు ఎందుకు నేర్చుకోవాలని ప్రశ్నించారు. తాము హిందీకి వ్యతిరేకం కాదని చెప్పారు. ఆసక్తి ఉంటే విద్యార్థులు స్వచ్ఛందంగా నేర్చుకోవచ్చని, బలవంతంగా రుద్ద కూడదని స్పష్టం చేశారు. మంత్రి ప్రధాన్ వైఖరికి నిరసనగా డీఎంకే ఎంపీలు పార్లమెంటు బయట నిరసన తెలిపారు. తమిళనాడులో కూడా పలు చోట్ల నిరసనలు తెలిపారు.

కేంద్ర మంత్రి.. రాజునని భావిస్తున్నారు: స్టాలిన్

లోక్‌సభలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వ్యాఖ్యలపై స్టాలిన్ మండిపడ్డారు. ఎక్స్‌లో పోస్టు పెడుతూ "కేంద్ర విద్యా మంత్రి రాజునని అనుకుంటున్నారు. అహంకారంతో మాట్లాడుతున్నారు. క్రమశిక్షణలో ఉంచాల్సిన అవసరం ఉంది" అని వ్యాఖ్యానించారు. ఆయన తమిళనాడు ప్రజలను అవమానపరుస్తున్నారని విమర్శించారు. ప్రధాని మోదీ ఇందుకు అంగీకరిస్తున్నారా? అని ప్రశ్నించారు. త్రిభాషా సూత్రాన్ని అంగీకరించకపోతే తమిళనాడు విద్యా రంగానికి ఇవ్వాల్సిన నిధులను నిలిపివేస్తామంటూ బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ఆరోపించారు. "తమిళనాడు విద్యార్థుల కోసం ఉద్దేశించిన, మా నుంచి వసూలు చేసిన పన్నుల్లో భాగమైన నిధులను విడుదల చేస్తారా? లేదా? ఈ ఒక్కదానికి సమాధానం ఇవ్వండి" అని ప్రశ్నించారు. కేంద్రం ప్రతిపాదించిన త్రిభాషా విధానం ఆరెస్సెస్ అజెండాయే తప్ప విద్యావిధానం కాదని తమిళనాడు విద్యా శాఖ మంత్రి అన్బిల్ అన్నారు.

పసిబిడ్డ దగ్గర చాక్లెట్ లాక్కున్నట్లు..

బైడెన్ నుంచి జెలెన్‌స్కీ సొమ్ములు

- ఉక్రెయిన్ అధ్యక్షుడికి కృతజ్ఞత లేదు: ట్రంప్



వాషింగ్టన్, మార్చి 10: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి విరుచుకుపడ్డారు. తమ దేశం నుంచి వందల బిలియన్ల డాలర్లు తీసుకున్నా ఆయనకు కనీసం కృతజ్ఞత లేదని విమర్శించారు. పసిబిడ్డ నుంచి చాక్లెట్ లాక్కొన్నంత సులువుగా బైడెన్ ప్రభుత్వం నుంచి జెలెన్‌స్కీ నిధులు తీసుకున్నారని ఆరోపించారు. ఆదివారం ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ మేరకు ట్రంప్ వ్యాఖ్యానించారు. జెలెన్‌స్కీ ఓ తెలివైన, కఠినమైన వ్యక్తి అని అభివర్ణించారు. రష్యాతో ఉక్రెయిన్ యుద్ధం చేయడానికి ఇప్పటి వరకు 350 బిలియన్ డాలర్ల మేర సాయం చేశామని అయినా జెలెన్‌స్కీకి కృతజ్ఞత లేదని మండిపడ్డారు. ఇక రష్యా విషయంలో అత్యంత కఠినంగా వ్యవహరించిన అధ్యక్షుడిని తానేనని ట్రంప్ అన్నారు. రష్యా పైపైన్ ఆపి ఆంక్షలు విధించానని, కానీ, రష్యా అధ్యక్షుడితో మంచి సంబంధాలే కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

లలిత్ మోదీకి ఝలక్

- పాస్‌పోర్టు రద్దుకు వనువాటు ప్రధాని ఆదేశం



పోర్ట్ విలా, మార్చి 10: భారత దేశం నుంచి పరారైనా ఆర్థిక నేరగాడు, ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీకి వనువాటు దేశ ప్రధాన మంత్రి జోతం నపట్ ఝలక్ ఇచ్చారు. లలిత్ మోదీకి జారీ చేసిన పాస్‌పోర్టును రద్దు చేయాలని సిటిజన్‌షిప్ కమిషన్‌ను సోమవారం ఆయన ఆదేశించారు. అలాగే పౌరసత్వం కోసం లలిత్ మోదీ చేసిన దరఖాస్తును ఆమోదించవద్దని తమ దేశ అధికారులను ఆయన నిర్దేశించారు. లలిత్ మోదీపై అంతర్జాతీయ మీడియాలో వచ్చిన తాజా కథనాలతో అప్రమత్తమై తాను ఈ ఆదేశాలను జారీ చేసినట్టు పేర్కొన్నారు. నేరస్థుల అప్పగింత ఉచ్చు నుంచి తప్పించుకునేందుకే లలిత్ మోదీ తమ దేశంలో పాస్‌పోర్టు, పౌరసత్వం కోసం దరఖాస్తు చేసినట్టు స్పష్టమవుతోందన్నారు. 'దరఖాస్తుదారులు చట్టపరమైన కారణాలతోనే మా దేశంలో పౌరసత్వం పొందాలి. అంతేగానీ నేరస్థుల అప్పగింత ఉచ్చు నుంచి తప్పించుకునేందుకు కాదు' అని వివరించారు.

కెనడా ప్రధానిగా మార్క్ కార్నీ

85.9% ఓట్లతో ఎన్నుకున్న లిబరల్ పార్టీ



అమెరికా విషయంలో తగ్గేదేలేదన్న మార్క్

ఒట్టావా, మార్చి 10: కెనడా ప్రధానిగా మార్క్ కార్నీ ఎంపికయ్యారు. ప్రస్తుత ప్రధాని ట్రూడో జనవరిలో తన రాజీనామాపై ప్రకటన చేశాక.. వారసత్వ ఎంపిక జరిగేదాకా ఆ పదవిలో కొనసాగుతానని పేర్కొన్న విషయం తెలిసిందే.! అధికార లిబరల్ పార్టీ తదుపరి ప్రధాని కోసం ఆదివారం జరిపిన ఎన్నికల్లో.. మార్క్‌కు 1.31 లక్షల ఓట్లు వచ్చాయి. మొత్తం పోలైన ఓట్లలో ఇవి 85.9%.. దాంతో.. కెనడా 24వ ప్రధానిగా మార్క్ పేరు ఖరారైంది. తొమ్మిదేళ్ల ట్రూడో పాలన ముగిసింది. ఈ పోటీలో మార్క్ ప్రత్యర్థులు కరీనా గౌల్డ్, ఫ్రాంక్ బేలిస్ పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. మార్క్‌కు ఆర్థిక రంగంలో అపారమైన అనుభవం ఉంది. మార్క్ కార్నీ హార్వర్డ్ వర్సిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో పట్టా పొందారు. 2008-13 మధ్యకాలంలో కెనడా సెంట్రల్ బ్యాంక్‌కు గవర్నర్‌గా సేవలందించారు. 2013-20 కాలంలో ఇంగ్లండ్ సెంట్రల్ బ్యాంక్‌కు గవర్నర్‌గా పనిచేశారు. గత ఏడాది నుంచి ఆయన లిబరల్ పార్టీకి ఆర్థిక సలహాదారుగా కొనసాగుతున్నారు. ట్రూడో తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించాక.. అనూహ్యంగా ప్రధాని అభ్యర్థి బరిలో నిలిచారు. ఈయనకు హాకీ, రగ్బీ క్రీడల్లో ప్రవేశముంది.

అమెరికాపై కెనడాదే పైచేయి

ప్రధానిగా తన ఎంపిక లాంఛనమవ్వగానే.. లిబరల్ పార్టీ కన్వెన్షన్‌లో ప్రజలనుద్దేశించి మార్క్ ప్రసంగిస్తూ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై మండిపడ్డారు. కెనడాను 51వ రాష్ట్రంగా చేర్చుకుంటామంటూ ట్రంప్ పదేపదే చేస్తున్న ప్రకటనలపై తీవ్రంగా స్పందించారు. "కెనడా ఎన్నటికీ అమెరికాలో భాగం కాబోదు. మేం ఏ విధంగానూ.. ఏ రూపంలోనూ అమెరికాలో భాగం కాదు. మా దేశం అప్పటికీ, ఇప్పటికీ బలంగా ఉంది. వాణిజ్యమే అయినా.. హాకీ లాంటి క్రీడలే అయినా.. అమెరికాపై కెనడాదే విజయం" అని వ్యాఖ్యానించారు. కెనడాలో ఉన్న అపార వనరులు, నీరు, భూమిని స్వాధీనం చేసుకోవాలనే దురుద్దేశంతో అమెరికా ఉందని, ఒకవేళ అదే జరిగితే.. మన(కెనడా) జీవన విధానాన్ని పూర్తిగా నాశనం చేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు.

భారత్‌తో మైత్రి దిశగా..

భారత్‌తో సత్సంబంధాలు కొనసాగిస్తానని మార్క్ గత వారమే ప్రకటించారు. "నేను కెనడా ప్రధానినైతే.. భారత్‌తో క్షీణించిన దౌత్య సంబంధాలను మెరుగుపరుస్తాను. భారత్‌తోనే కాదు.. ఇండియాతో సారూప్యత ఉన్న దేశాలతోనూ వాణిజ్య సంబంధాలను బలోపేతం చేయడానికి చర్యలు తీసుకుంటాను" అని వ్యాఖ్యానించారు. 2023లో ఖలిస్థానీ నేత హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య వెనక భారత ఏజెన్సీల హస్తముందని అప్పట్లో ట్రూడో ఆరోపించడం.. దీన్ని భారత్ తీవ్రంగా ఖండించడం తెలిసిందే.! ఆ తర్వాత ఇరుదేశాల మధ్య దూరం పెరిగింది.

అమెరికాలోని తెలుగువారి

సంస్కృతి ప్రోత్సాహానికి కృషి

- ఆటా అధ్యక్షుడు జయంత్ చల్లా

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో నివసించే తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాల్ని ప్రోత్సహించేందుకు అమెరికా తెలుగు సంఘం (ఆటా) కృషి చేస్తోందని సంఘం అధ్యక్షుడు జయంత్ చల్లా తెలిపారు. ఆటా ధర్మకర్తల మండలి సమావేశం వర్జీనియాలోని యాష్ బర్న్‌లో జరిగింది. ఈ సందర్భంగా జయంత్ చల్లా మాట్లాడుతూ... అమెరికాలో నివసిస్తున్న తెలుగు వారి సాంస్కృతిక వారసత్వం, తెలుగు సాహిత్యం, విద్యా సామాజిక కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు ఆటా అన్ని వేళల కృషి చేస్తుందన్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చే విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు, ఇమ్మిగ్రేషన్‌పై అవగాహన సదస్సులు, అమెరికాలో హైస్కూల్ విద్యార్థులకు ఉచిత శిక్షణ, కాలేజీ ప్రవేశాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. భారతదేశం నుంచి తాత్కాలికంగా వచ్చే తల్లిదండ్రులకు ఉచిత వైద్య క్యాంపులు, అవసరమైనవారికి ఆర్థిక సాయం అందించామన్నారు. జయంత్ చల్లా బృందం వచ్చే రెండేళ్లకు లక్ష డాలర్ల ఆట సేవ కార్యక్రమాలకు విరాళాలు ప్రకటించారు.

అసోంకు సొంత ఉపగ్రహం

గువహటి, మార్చి 10: అసోం రాష్ట్రం సొంతంగా ఉపగ్రహాన్ని ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించింది. సరిహద్దులపై నిఘాతోపాటు సామాజిక, ఆర్థిక అవసరాలకు సమాచారాన్ని సేకరించడం కోసం ఈ ఉపగ్రహాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సోమవారం 2025-26 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి అజంతా నియోగ్ ఈ మేరకు ప్రకటన చేశారు. ఇస్రోకు చెందిన ఇండియన్ నేషనల్ స్పేస్ ప్రమోషన్ అండ్ ఆథరైజేషన్ సెంటర్ (ఇన్‌స్పేస్), భారత ప్రభుత్వం సహకారంతో సొంత ఉపగ్రహాన్ని ఏర్పాటు చేసుకుంటున్నట్లు ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర సీఎం హిమంత మాట్లాడుతూ.. దేశంలోనే సొంత ఉపగ్రహం కలిగిన తొలి రాష్ట్రంగా అసోం నిలవబోతోందన్నారు.



వెంకయ్య మనవడి

రిసెప్షన్‌కు ప్రధాని

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు మనవడి వివాహ రిసెప్షన్‌కు ప్రధాని మోదీ హాజరయ్యారు. ఢిల్లీలోని త్యాగరాజ మార్గ్‌లో సోమవారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని విచ్చేసి.. నూతన దంపతులు విష్ణు, సాత్వికలను ఆశీర్వదించారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ సింగ్, కిషన్‌రెడ్డి సహా పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ సీనియర్ నేతలు, ఆర్‌ఎస్‌ఎస్ పెద్దలు, కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తదితరులు ఈ వేడుకకు హాజరయ్యారు.

మాటలతో హింసించారు

డీఆర్‌ఐ విచారణపై కోర్టులో నటి రన్యా రావు

బెంగళూరు, మార్చి 10(ఆంధ్రజ్యోతి): డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్‌ఐ) కస్టడీలో తనను మాటలతో హింసించారని, భయపెట్టారని కోర్టులో కన్నడ నటి రన్యా రావు వెల్లడించారు. ఈ వేధింపులతో మానసికంగా గాయపడ్డానంటూ కన్నీటి పర్యంతం అయ్యారు. ఇటీవల 14.2 కిలోల బంగారం స్మగ్లింగ్ చేస్తూ రన్యా రావు బెంగళూరు ఎయిర్‌పోర్టులో పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ కేసులో ఆమెను కస్టడీలోకి తీసుకుని డీఆర్‌ఐ అధికారులు విచారించారు. కస్టడీ ముగియడంతో బెంగళూరులోని ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టులో సోమవారం హాజరుపరిచారు. ఈ సందర్భంగా రన్యా రావును న్యాయమూర్తి ప్రశ్నించారు. కస్టడీలో భౌతికంగా హింసించారా? అన్న ప్రశ్నకు రన్యా రావు స్పందిస్తూ.. భౌతికంగా హింసించలేదని, కానీ మాటలతో మనసు గాయపరిచారని తెలిపారు. దీనిని డీఆర్‌ఐ ఖండించింది. కోర్టు ఆమెకు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి ఆదేశించింది.

కరీబియన్ దీవుల్లో

భారత సంతతి వైద్య విద్యార్థిని అదృశ్యం


సుదీక్ష

న్యూయార్క్, మార్చి 10: కరీబియన్ దీవుల్లో భారత సంతతి విద్యార్థిని, తెలుగు మూలాలు ఉన్న సుదీక్షా కోనంకి(20) అదృశ్యమయ్యారు. అమెరికాలోని వర్జీనియా లౌడౌన్ కౌంటీలో తన తల్లిదండ్రులు సుబ్బారాయుడు, శ్రీదేవితో కలిసి సుదీక్ష నివసిస్తున్నారు. పిట్స్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో మెడిసిన్ చదువుతున్న సుదీక్ష, విశ్వవిద్యాలయం సెలవులు ప్రకటించడంతో స్నేహితులతో కలిసి మార్చి 3న డొమినికన్ రిపబ్లిక్ రిసార్ట్ టౌన్ అయిన పుంటాకానాకు వెళ్లారు. సుదీక్ష, ఆమె స్నేహితులు అక్కడి హోటల్‌లో బస చేశారు. మార్చి 6న సుదీక్ష తన స్నేహితులతో కలిసి అక్కడి బీచ్‌కు వెళ్లారు. సుదీక్ష, ఆమె స్నేహితుల్లో ఒకరు బీచ్‌లోనే ఉండిపోగా మిగతావారు అక్కడి నుంచి తిరిగి హోటల్‌కు వెళ్లిపోయారు. బీచ్‌లో నడుస్తుండగా సుదీక్ష కనిపించకుండా పోయారని, ఆ రోజు ఆమె చివరిసారిగా 4:15 నిమిషాలకు కనిపించారని స్థానికులు చెప్పారు. నాలుగు రోజులుగా ఆమె ఆచూకీ లభించకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈత కొట్టేందుకు సుదీక్ష సముద్రంలోకి దిగివుంటారని, ఆ క్రమంలో భారీ అల తాకిడికి ఆమె గల్లంతై ఉండొచ్చునని అధికారులు భావిస్తున్నారు. సుదీక్ష ఆచూకీ కోసం సివిల్ డిఫెన్స్, నేవీ సహా పోలీసు శాఖ సిబ్బంది ముమ్మరంగా గాలిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రత్యేక హెలికాప్టర్లు, డ్రోన్లనూ వినియోగిస్తున్నారు. డొమినికన్ రిపబ్లిక్‌లో దోపిడీలు, కిడ్నాప్‌లు, హత్యలు తరచుగా జరుగుతుంటాయి. ఈ క్రమంలో తమ కూతురును ఎవరైనా కిడ్నాప్ చేసి ఉంటారని, ఆ కోణంలోనూ దర్యాప్తు చేయాలని సుదీక్ష తల్లిదండ్రులు అధికారులను కోరారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మరో జయపతాక

ప్రపంచ క్రికెట్‌ను శాసిస్తున్న టీమిండియా మరో చరిత్ర సృష్టించింది. గత మధురస్మృతులను మరిపిస్తూ వన్డే క్రికెట్‌లో మినీ విశ్వకప్పుగా ఖ్యాతిగాంచిన చాంపియన్స్ ట్రోఫీని దక్కించుకుంది. తుది సమరంలో న్యూజిలాండ్‌ను ఓడించి మూడో పర్యాయం చాంపియన్స్ ట్రోఫీని ఒడిసి పట్టుకుంది. పొట్టి ఫార్మాట్‌లో ప్రపంచకప్‌ను గెలిచి ఏడాది కూడా తిరగక ముందే మరో ప్రతిష్ఠాత్మక ఈవెంట్‌లో విజేతగా నిలిచి భారత జట్టు అద్భుతమే చేసింది.

పాకిస్థాన్ ఆతిథ్యమిచ్చిన ఈ టోర్నమెంట్‌లో భారత్ తటస్థ వేదిక దుబాయ్‌లో తమ మ్యాచ్‌లను ఆడింది. అపజయమన్నదే ఎరుగకుండా అజేయంగా మ్యాచ్‌లను ముగించింది. అశేష క్రీడాభిమానులు గర్వించేలా పోరాటపటిమను ప్రదర్శించింది. టోర్నమెంట్ ఆరంభంలో బంగ్లాదేశ్‌ను చిత్తుచేసి, డిఫెండింగ్ చాంపియన్ పాకిస్థాన్‌ను మట్టికరిపించి, ఆనక న్యూజిలాండ్‌పై ఆధిపత్యాన్ని చాటుకొన్న భారత్ గ్రూప్ దశ పోరాటాన్ని ఓటమన్నదే లేకుండా ముగించింది. తమకు ఎదురే లేదనుకున్న ఆస్ట్రేలియన్లను సెమీఫైనల్లో కంగుతినిపించి ఫైనల్‌కు దూసుకొచ్చింది. అదే జోరులో న్యూజిలాండ్‌పై మరోసారి పైచేయి సాధించి అంతిమంగా ఫలితాన్ని రాబట్టింది. ఈ గెలుపుతో కోచ్‌గా గౌతమ్ గంభీర్‌కు తొలి ఐసీసీ ట్రోఫీని అందించింది. చివరిగా 2013లో ధోనీ సారథ్యంలో టోర్నీ విజేతగా నిలిచిన భారత జట్టు.. మళ్లీ ఇన్నాళ్ల తర్వాత ఆ మధుర ఘట్టాన్ని ఆవిష్కృతం చేసింది. ఫార్మాట్ ఏదైనా ఐసీసీ టోర్నీల్లో చాంపియన్‌గా నిలవడమన్నది ఎప్పుడూ ప్రత్యేకమే.

ఈమారు టోర్నమెంట్‌లో భారత్ అత్యుత్తమ ప్రదర్శనతో అలరిస్తే, ఈవెంట్‌కు ఆతిథ్యమిచ్చిన పాకిస్థాన్ ఆట పరంగా పూర్తిగా విఫలమైంది. టోర్నీలో ఒక్క గెలుపును కూడా నమోదు చేయకుండా గ్రూప్ దశలోనే నిష్క్రమించి దారుణ పరాభవాన్ని మూటగట్టుకుంది. ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా జట్లు సెమీఫైనల్స్‌లో వెనుదిరిగాయి. కొన్నాళ్లుగా ప్రపంచ క్రికెట్‌లో సంచలన ఆటతీరుతో అలరిస్తున్న అఫ్ఘానిస్థాన్ జట్టు సెమీ ఫైనల్‌కు చేరకున్నా, ఇంగ్లండ్‌లాంటి మేటిజట్టును ఓడించి మరోసారి తమ సత్తాను చాటుకోవడం ఈ టోర్నీలో విశేషం.

సమర్థమైన నాయకుడు లభించడం జట్టుకు ఎప్పుడూ వరమే. తొలుత వన్డే విశ్వకప్, తదుపరి టీ20 ప్రపంచకప్, ఇప్పుడు చాంపియన్స్ ట్రోఫీ.. ఇలా వరుసగా మూడు మెగా టోర్నమెంట్లలో జట్టును ఫైనల్ చేర్చడం.. రెండింటిలో విజయకేతనం ఎగురవేయడం.. రోహిత్ శర్మ అమోఘమైన కెప్టెన్సీ ప్రతిభకు తార్కాణం. వ్యూహాల అమలులో మిగతా జట్ల నాయకులకు అందనంత దూరంలో ఉండే అతను, సారథిగా నాటి మహేంద్రసింగ్ ధోనీని మరిపిస్తూ ముందుకు సాగుతున్నాడు. ప్రత్యర్థి జట్ల లోపాలు, బలహీనతల ఆధారంగా తన వ్యూహరచనకు పదును పెడుతుంటాడు. బ్యాటింగ్ ఆర్డర్, బౌలింగ్ దళంలో ఎవరి పాత్ర ఏమిటన్న దానిపై స్పష్టతతో ఉంటూ సహచరులకు దిశానిర్దేశం చేస్తుంటాడు. మైదానంలో ఒత్తిడిని దరిచేరనీయకుండా కడదాకా విజయానికి ప్రయత్నించడం రోహిత్ నైజం. వ్యక్తిగత గణాంకాలు పట్టించుకోకుండా జట్టును అగ్రపీఠాన నిలిపే లక్ష్యంతో ఆడతాడు. ఈ చాంపియన్స్ ట్రోఫీలో కొన్ని మ్యాచుల్లో ఆటగాడిగా అంతగా రాణించకపోయినా, న్యూజిలాండ్‌తో అంతిమ సమరంలో అసలైన ఆటతీరుతో విజృంభించాడు. ఫైనల్ మ్యాచ్‌లో అత్యధిక పరుగులు చేసిన రోహిత్, బలమైన ఆరంభాన్ని అందించి తన తర్వాతి బ్యాటర్లపై ఒత్తిడి తగ్గించాడు. రోహిత్‌తో పాటు పరుగుల వీరుడు విరాట్ కోహ్లీ, శుభ్‌మన్ గిల్, శ్రేయాస్ అయ్యర్, కేఎల్ రాహుల్, హార్దిక్ పాండ్యా చక్కని బ్యాటింగ్‌తో జట్టు విజయంలో తమ కర్తవ్యాన్ని చాటుకున్నారు. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా లోటును భర్తీ చేస్తూ భారత బౌలింగ్ దళం టోర్నీలో దీటైన ప్రదర్శనతో మెప్పించింది. ప్రధానంగా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి, కుల్దీప్ యాదవ్, మహ్మద్ షమి ప్రత్యర్థి బ్యాటర్లను బోల్తా కొట్టిస్తూ జట్టుకు అండగా నిలిచిన తీరు ప్రశంసనీయం. రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్ బ్యాటింగ్, బౌలింగ్‌లో రాణించి ఆల్‌రౌండర్లుగా భళా అనిపించారు. జట్టులో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతమైన ఆటతీరుతో కలిసికట్టుగా కదం తొక్కడం భారత్ విజేతగా ఆవిర్భవించడానికి విశేషంగా దోహద పడింది. ఇంతటి మహత్తర ప్రదర్శన భారత జట్టులోని యువ ఆటగాళ్లలో నూతనోత్తేజాన్ని నింపుతుందనడంలో సందేహం లేదు. ఈ విజయాన్ని ఆస్వాదిస్తూనే నవతరం ఆటగాళ్లు మున్ముందు ప్రతిష్ఠాత్మక సిరీస్‌లకు సన్నద్ధం కావాలి.

శుద్ధిమంత్రం ఆయన పాట!

హరిసంకీర్తనాచార్యుడు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ విష్ణుదేవుని పాదార్చనకై ఉత్తరాయణ పుణ్యకాలంలో వైకుంఠానికి తరలివెళ్లారు. వారితో నాకు చాలాకాలంగా స్నేహం ఉంది. నేను రేడియోలో చేరిన తొలినాళ్ల నుంచి అంటే సుమారుగా నలభై ఏళ్లుగా వారితో నాకు పరిచయం. వారితో స్నేహం మాపటిపూట పొద్దులాంటిది. మొదట 'ఓహో మీరా' అంటే 'ఓహో తమరా' అంటూ మొదలైన మా స్నేహం క్రమేపీ బల పడుతూ వచ్చింది. రేడియోలో కొలువు ముగిసాక కొన్నేళ్లు నేను టీటీడీలో స్వామిసేవలో ఉన్నాను. టీటీడీ స్టాఫ్ క్వార్టర్స్‌లో ఉన్నప్పుడు తరచూ కలుసుకుంటుండేవాళ్లం. ఎన్ని పాటల ముచ్చట్లో!

గరిమెళ్ల వారి సార్థక సంగీత కళామూర్తిమత్వాన్ని వివరించటానికి మాటలు చాలవు. పాడిన ప్రతి పాటకు శాశ్వతత్వం కల్పించారు. వారి గానంలో కమనీయత ఉంది. నిండైన వ్యక్తిత్వం. సంగీతమూ ఇంగితమూ రెండూ ఆ వ్యక్తిత్వంలో పెనవేసుకుని ఉన్నాయి. సౌజన్యం, సౌశీల్యం, సౌమనస్యం మూర్తీభవించిన మనీషి. అణువంత ప్రతిభకే ఎగిరెగిరి పడే ఈ రోజులలో ఆకాశమంత ప్రజ్ఞ ఉండి కూడా ఏ మాత్రం గర్వోద్ధతి లేకుండా చివరి క్షణం వరకు తాను నమ్మిన దేవుడు వేంకటేశునియందు, గురువులైన నేదునూరి కృష్ణమూర్తి, బాలమురళి, పశుపతి గార్లయందు ఉత్కృష్టమైన భక్తిభావనతో మెలిగారు.



గరిమెళ్ల వారి సార్థక సంగీత కళామూర్తిమత్వాన్ని వివరించటానికి మాటలు చాలవు. పాడిన ప్రతి పాటకు శాశ్వతత్వం కల్పించారు. అణువంత ప్రతిభకే ఎగిరెగిరి పడే ఈ రోజులలో ఆకాశమంత ప్రజ్ఞ ఉండి కూడా ఏ మాత్రం గర్వోద్ధతి లేకుండా చివరి క్షణం వరకు తాను నమ్మిన దేవుడు వేంకటేశునియందు, గురువులైన నేదునూరి, బాలమురళి యందు భక్తిభావనతో మెలిగారు.

1978లో తిరుమల తిరుపతి దేవస్థానం – అన్నమాచార్య ప్రాజెక్టులో గాయకునిగా చేరి రమారమి మూడు దశాబ్దాలకు పైగా స్వామికి సంగీత స్వరార్చన చేశారు. ఉద్యోగ విరమణ చేసిన ఆరేళ్ల తరువాత వారిని టీటీడీ ఆస్థాన గాయకునిగా నియమించింది. గాయకునిగా, ఆస్థాన విద్వాంసునిగా బాలకృష్ణ ప్రసాదు గారు ఆ స్థానపు విలువను పెంచారు. ఆరు వందలకు పైగా అన్నమయ్య కీర్తనలను స్వరపరచారు. దేశ విదేశాలలో వేలాది కచేరీలు చేశారు. బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మగారు గరిమెళ్ల వారి పాటను శ్లాఘిస్తూ, "వారి పాటకు వైశిష్ట్యం ఉంది. మార్దవం, మాధుర్యం, ఆర్ద్రత, శాస్త్రీయత ఉన్నాయి. వారు వాగ్గేయకారులు. వేంకటేశుని మీద, హనుమ మీద అనేక పాటలు రాశారు. అవన్నీ అజరామరం," అన్నారు.

గరిమెళ్ల వారు స్వరపరచిన కీర్తనల్లో 'వినరో భాగ్యము విష్ణు కథ', 'క్షీరాబ్ధికన్యకకు', 'నారాయణ నీ నామమే', 'ఇతడొకడే సర్వేశ్వరుడు', 'జగడపు చనవుల జాజర', 'పిడికిట తలంబ్రాల'... వంటి అనేక కీర్తనలు బహుళ ప్రాచుర్యం పొందాయి. కించిదనునాసికఛాయ కలగలసిన ఆ గాత్రంలో అద్భుత వశీకరణశక్తి ఉంది.

1948 నవంబరు 9న జన్మించిన బాలకృష్ణ ప్రసాదు స్వస్థలం రాజమండ్రి. నరసింహారావు – కృష్ణవేణి దంపతులకు జన్మించారు. అప్పటికే ఇంట సంగీతం కొలువుతీరి ఉండటంతో స్వరజ్ఞానం సులువుగా నోటికి అంది వచ్చింది. శృతిలయల మాధుర్యం తెలుసుకునే సులువు అలవడింది. గడచిన నలభై ఐదు సంవత్సరాలుగా తిరుపతిలో ఉంటూ స్వామికి, అన్నమయ్యకు సంగీత సాహిత్య బంధువయ్యారు. అన్నమయ్య సంకీర్తనా స్వరసంపుటి, అన్నమయ్య నృసింహకీర్తనం, అన్నమయ్య సంకీర్తనారత్నావళి, ఆంజనేయ కృతిమణిమాల మొదలైన గ్రంథాలను రచించారు. హనుమ వైభవాన్ని కీర్తిస్తూ యాభై, గణేశుని మీద యాభై కీర్తనలు రచించారు.

ఆరుమాసాలక్రితం కలిశాను. కొన్నాళ్లుగా ఆరోగ్యం సడలిందనీ పట్టు తప్పిందనీ వారు చెప్పారు గానీ ఆ గానఝరి, గాన సిరి ఏ మాత్రం వన్నె తగ్గలేదు. బాలకృష్ణ ప్రసాదుగారు లాంటివారు అపురూపంగా ప్రభవిస్తారు. ఆయన కళానిధి. సంగీత విద్వన్మణి. అటు శాస్త్రీయం, ఇటు లలిత, జానపద సంగీతాలను ఆపోసనం పట్టిన అగస్త్యులు. మేము కలుసుకున్న ప్రతిసారీ "స్వామిసేవకు, నాదోపాసనకు సమాప్తి అంటూ లేదు. ఇలా పాడుకుంటూ వెళ్లిపోతే చాలు సార్" అనేవారు.

గరిమెళ్లగారు సార్థక జన్ములు. తెలుగునాట సంకీర్తనాయజ్ఞం అనే ప్రక్రియకు వారే ఆద్యులు. 2020వ సంవత్సరంలో కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకున్నారు. అపర అన్నమయ్య, అన్నమాచార్య సంకీర్తనామహతి వంటి అనేక బిరుదులు పొందారు.

సాహిత్యం స్పష్టంగా అందరికీ అర్థమయ్యేలా, శాస్త్రీయత చెడకుండా, శ్రవణసుభగంగా పాడేవారు. ప్రాణాంతక వ్యాధులబారినుంచి రక్షించే సిద్ధమంత్రం వేంకటేశుని నామమైతే, శ్రోతలమనసు, బుద్ధి కలుషితం కాకుండా కాచి కాపాడే శుద్ధిమంత్రం గరిమెళ్లవారి పాట. వారి పాట శాశ్వతం. వారి కీర్తి అజరామరం.

డా.పాలపర్తి శ్యామలానందప్రసాద్ గారు గరిమెళ్ల వారికి శ్రద్ధాంజలి ఘటిస్తూ,

"ఏడు స్వరముల కొండలనెక్కిదిగుచు
అన్నమయ్యతో నేటికి నున్నయట్లు
స్వామి మురిపించు నటనమ్ము చాలుననుచు
గాలినడకన చేరితే బాలకృష్ణ" అని ఘనంగా కీర్తించారు. ఇన్నాళ్లూ ఆయన కంఠంలో కాపురం ఉన్న సంగీత దేవతలంతా ఆయనను స్వర్గానికి తోడ్కొని వెళ్లారన్నమాట!

• ప్రయాగ రామకృష్ణ

అమెరికాను యూరప్ ధిక్కరించగలదా?

వైట్ హౌజ్‌లో అమెరికా అధ్యక్షుడు చర్చలకు వచ్చిన ఉక్రెయిన్ అధ్యక్షుడిని అవమానించిన రోజున (28, ఫిబ్రవరి) నేను ప్రముఖ సాహిత్య పత్రిక గ్రంట పాత సంచిక నొకదాన్ని చదువుతున్నాను. 1990 వసంత కాలంలో ప్రచురితమైన ఆ సంచిక ఇతివృత్తం 'కొత్త యూరప్!'. కొత్త అనే విశేషణం, ఆశ్చర్యార్థ సూచకం రెండూ కిందటి సంవత్సరం (1989)లో సంభవించిన చరిత్రాత్మక ఘటనలకు అంగీకారం తెలుపుతున్నవే. బెర్లిన్ గోడ పతనం, దశాబ్దాల అనంతరం పోలండ్‌లో ప్రప్రథమంగా స్వేచ్ఛాయుత ఎన్నికలు జరగడం, తూర్పు యూరోపియన్ దేశాలలో నియంతృత్వ వ్యవస్థలు కుప్ప కూలిపోవడం మొదలైన నవ యుగ నిర్మాణ పరిణామాలు ప్రపంచాన్ని ఉక్కిరిబిక్కిరి చేసిన సందర్భమది.

ఆ సంఘటనలు యూరప్ భవిష్యత్తును ఏ విధంగా ప్రభావితం చేయనున్నాయనే విషయమై గ్రంట ఎడిటర్ విఖ్యాత యూరోపియన్ రచయితలు, మేధావుల నుంచి వ్యాసాలను ఆహ్వానించాడు. సహజంగానే ఆ వ్యాసకర్తలలో చాలా మంది గత కొద్ది నెలలుగా యూరప్‌లో చోటు చేసుకుంటున్న ఘటనల పట్ల తమ ఎనలేని ఆనందాన్ని వ్యక్తం చేశారు. వారిలో ఒకరైన తూర్పు జర్మనీ మత గురువు వెర్నర్ క్రాట్ షెల్ బెర్లిన్ గోడ పతనానికి దారి తీసిన 'స్వేచ్ఛ, గౌరవం కోసం పోరాటం'కు అభివందనాలు తెలిపారు. గ్రంట వ్యాస రచయితలలో ఒకరు రాజనీతి శాస్త్రవేత్త ఇసయ్యా బెర్లిన్. పాశ్చాత్య మేధో ప్రపంచంలో ఆయన మిగతా వ్యాసకర్తలు అందరికంటే విఖ్యాతుడు. అక్టోబర్ విప్లవ పూర్వపు రష్యాలో జన్మించిన బెర్లిన్ చిన్న వయసులోనే తన తల్లిదండ్రులతో ఇంగ్లాండ్‌కు వలస వచ్చాడు. తనదైన చింతనా పద్ధతుల్లో బ్రిటిష్ మేధో సంస్కృతికి వారసుడుగా వెలుగొందారు. ఆక్స్‌ఫర్డ్‌లో ఆచార్యుడుగా సుప్రసిద్ధమయ్యాడు. ఒక కొత్త ఆక్స్‌ఫర్డ్ కళాశాలను కూడా నెలకొల్పాడు. బ్రిటిష్ అకాడెమీకి అధ్యక్షుడు అయ్యాడు. ముమ్మూర్తులా బ్రిటిష్‌వాడుగా రూపొందినప్పటికీ రష్యా చరిత్రలో తన ప్రగాఢ కుతూహలాన్ని, గత కాలం రష్యన్ రచయితలు, చింతకుల పట్ల అపురూపమైన ఆసక్తిని తుదకంటా నిలుపుకున్న యూరోపియన్ మేధావి. రష్యాలో కమ్యూనిస్టుల పాలన అణచివేసిన పాతకాలం బుద్ధిజీవుల మేధో కృషి, ఉదార వాద సంప్రదాయాల పునరుద్ధరణకు 1989 ఘటనలు అవకాశం కల్పించాయని బెర్లిన్ పేర్కొన్నారు.

తూర్పు యూరప్‌లో సోవియట్ కీలుబొమ్మల ప్రభుత్వాలు కూలిపోవడాన్ని మిగతా వ్యాసకర్తలూ స్వాగతించారు. అయితే భవిష్యత్తు పట్ల నిండు ఆశాభావాన్ని వ్యక్తం చేయలేదు, పలు సంవత్సరాలుగా కెనడాలో నివసిస్తున్న చెక్ రచయిత జోసెఫ్ స్కెవోరెస్కీ ఇలా రాశారు: 'ఐరోపాలోని వివిధ దేశాలలో నిరంకుశ ప్రభుత్వాలకు రోజులు చెల్లిపోయాయి. మరికొన్ని దేశాలలో వాటి అంతం ఆరంభమయింది'. బహుముఖ ప్రజ్ఞాశాలి జార్జి స్టెయినెర్ ఇలా వ్యాఖ్యానించాడు: మనం ప్రతిచోటా పునరుజ్జీవ జాతీయవాదం, జాతి విద్వేషాల మధ్య ఒక ఉన్మాద పోటీని చూస్తున్నాము. అయితే అమెరికా మాత్రం ఒక ప్రాంతీయ మహాశక్తిగా పరిణమిస్తున్నట్టుగా కనిపిస్తోంది. యూరప్ గురించి తెలుసుకోవడం లేదు. సంభవిస్తున్న సంఘటనలను పట్టించుకోకుండా ఈ మహా గొప్ప పాత ప్రపంచం (యూరప్) పట్ల ఉదాసీనత చూపుతున్నది. ఏమైనా యూరప్ పునరుత్థానమవుతోంది. తన సొంతంగా నిలబడుతోంది'.



ఉక్రెయిన్‌కు సహాయపడడానికి తాము తిరస్కరించినప్పటికీ యూరోపియన్ మిత్ర రాజ్యాలు ఆ దేశానికి వెన్వెంటనే పూర్తి మద్దతునిస్తాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఊహించలేదు. ట్రంప్‌తో విభేదించే ధైర్యం చూపినప్పటికీ రష్యా దురాక్రమణ నుంచి ఉక్రెయిన్‌ను రక్షించేందుకు అవసరమైన సైనిక సామర్థ్యం తమకు లేదన్న విషయం యూరోపియన్ రాజకీయవేత్తలకు బాగా తెలుసు.

1989 సంఘటనలలో సంభవించినదేమిటి? తూర్పు యూరప్ అంతటా అణచివేతకు గురైన జాతీయవాద మనోభావాలు ఉప్పెనలా వ్యక్తమయ్యాయి. పోలిష్ ప్రజలు, చెక్ దేశ వాసులు, మగ్యార్లు, జర్మన్లు సోవియట్ యూనియన్ ఆధిపత్యంపై తిరుగుబాటు చేశారు. సోవియట్ రష్యా శృంఖలాల నుంచి విముక్తమయ్యేందుకు దృఢంగా సంకల్పించుకున్నారు. పర్యవసానమే కొత్త యూరప్ ఆవిర్భావం. తూర్పు యూరప్‌లోని చిన్న చిన్న దేశాలు మళ్లీ స్వేచ్ఛ సాధించుకోవడం పట్ల పలువురు వ్యాసకర్తలు తమ దృష్టి కేంద్రీకరించగా అంద్రేయి సిన్యావస్కీ అనే వ్యాసకర్త మాత్రం జాతీయవాదం అణగారిన ప్రజలను విముక్తం చేయడమే కాకుండా ప్రతిఘాతుక శక్తిగా కూడా పరిణమించ గలదని హెచ్చరించారు. 'ప్రతిఘాతుక శక్తి' అనే వ్యాఖ్యను ఆయన రష్యాను దృష్టిలో ఉంచుకుని చేశారు.



▪ రామచంద్ర గుహ

ఒక ఇతివృత్తంతో వెలువరించే ఏ సంచిక కోసమైనా సంబంధిత పత్రిక ఎడిటర్ వ్యాసకర్తలకు వేర్వేరుగా లేఖలు రాయడం పరిపాటి. బెర్లిన్, సిన్యావస్కీలు ఇద్దరికీ తోటి వ్యాసకర్త ఏమి చెప్పుతున్నాడన్న విషయం తెలిసి ఉండే అవకాశం లేదు. ప్రచురితమైన మూడు దశాబ్దాల అనంతరం వారి వ్యాసాలను వెంట వెంటనే చదువుతున్నప్పుడు ఒకరి ఆశాభావం, మరొకరి సంశయవాదం మధ్య వైరుధ్యం స్పష్టంగా కన్పించింది. ఇందుకు కారణం వారి జీవిత ప్రస్థానాలు భిన్న రీతులలో సాగడమేనని చెప్పవచ్చు. రష్యాలో రష్యన్లతో నేరుగా సంబంధాలు లేని తాత్త్వికుడు బెర్లిన్. రష్యన్లతో ప్రత్యక్ష అనుభవాలు అపారంగా ఉన్న మేధావి సిన్యావస్కీ. 1925లో మాస్కోలో జన్మించిన సిన్యావస్కీ, 1973లో మాత్రమే సోవియట్ యూనియన్ నుంచి వలస పోయిన వ్యక్తి. కనుక ఆయనకు రష్యన్లతో దశాబ్దాల పాటు ప్రత్యక్ష అనుభవాలు ఉన్నాయి. రష్యన్ జాతీయవాదంలో విదేశీయుల పట్ల ద్వేషం దురహంకార ధోరణులు ఎలా ఉంటాయో ఆయనకు బాగా తెలిసి ఉంటుంది.

తమ మాతృభూమి రష్యా విషయంలో మాత్రం బెర్లిన్ అభిప్రాయాల కంటే సిన్యావస్కీ అభిప్రాయాలే నిర్దుష్టంగా, యథార్థంగా ఉన్నాయని చెప్పవచ్చు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న వ్లాదిమిర్ పుతిన్ తొలుత తన సొంత ప్రజలను తన ఇష్టాయిష్టాలకు అనుగుణంగా దాస్యులను చేసుకోగలిగాడు. ఆ తరువాత, సోవియట్ యూనియన్ విచ్ఛిన్నమైపోయిన తరువాత స్వేచ్ఛ పొందిన దేశాల ప్రజలపై రష్యా సంపూర్ణ పెత్తనాన్ని నెలకొల్పేందుకు పూనుకున్నాడు. పుతిన్‌లో బలంగా ఉన్న సామ్రాజ్య పునర్నిర్మాణ ఆకాంక్షే ఉక్రెయిన్ దురాక్రమణగా రూపు దాల్చింది. ఉక్రెయిన్‌ను జయించిన పిదప మరికొన్ని చిన్న యూరోపియన్ దేశాలను సైతం ఆక్రమించుకునేందుకు ఆయన తప్పక ప్రయత్నిస్తాడు. రష్యన్ జాతీయవాద దురహంకార ధోరణులను, పుతిన్ విస్తరణవాదాన్ని విమర్శిస్తున్నవారు రష్యా భీతితో వ్యవహరిస్తున్నవారుగా పుతిన్ సమర్థకులు కొట్టివేస్తున్నారు.

అమెరికా భవిష్యత్తులో యూరప్ పట్ల పూర్తిగా ఉదాసీనత చూపుతుందని జార్జి స్టెయినర్ చేసిన వ్యాఖ్యలు చాల దూరదృష్టితో చేసినవని గత పక్షం రోజులుగా సంభవిస్తున్న సంఘటనలు రుజువు చేస్తున్నాయి. అమెరికా కాలక్రమేణా ఐరోపాపట్ల పూర్తిగా ఉదాసీనత చూపుతుందనేది ఆయన వ్యాఖ్యల సారాంశం కదా. పుతిన్ పట్ల డొనాల్డ్ ట్రంప్ అభిమానం అందరికీ తెలిసిందే అయినా, రెండోసారి అధికారానికి వచ్చీ రాగానే ఉక్రెయిన్ విషయంలో తీవ్ర వ్యతిరేకతతో వ్యవహరిస్తాడని కొద్ది మంది మాత్రమే ఊహించారు. ఫిబ్రవరి 28న వైట్ హౌజ్‌లో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీని ట్రంప్, ఆయన ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ మీడియా ముందే అంతగా అవమానించడాన్ని రష్యన్ రాజకీయవేత్తలు సహజంగానే స్వాగతించారు. ఉక్రెయిన్‌ను మళ్లీ స్వాధీనం చేసుకోవాలన్న తమ ఆకాంక్షను ట్రంప్ సమర్థిస్తున్నట్టు ఆ ఘటన నిర్ధారించిందని వారు ఆనందపడుతున్నారు.

అయితే యుద్ధంతో సతమతమవుతున్న ఉక్రెయిన్‌కు సహాయపడడానికి తాము తిరస్కరించినప్పటికీ యూరోపియన్ మిత్ర రాజ్యాలు ఆ దేశానికి వెన్వెంటనే పూర్తి మద్దతునిస్తాయన్న విషయాన్ని ట్రంప్ ఊహించలేకపోయారు. వైట్‌హౌజ్‌లో మాటల యుద్ధం ప్రపంచవ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారమయిన వెన్వెంటనే యూరోపియన్ యూనియన్ విదేశీ వ్యవహారాల, భద్రతా విధాన ప్రతినిధి కజా కల్లాస్ సామాజిక మాధ్యమాల్లో తన ప్రతిస్పందనను పోస్ట్ చేశారు: 'ఉక్రెయిన్ ఐరోపాకు అన్య దేశం కాదు. ఉక్రెయిన్, ఐరోపా అవిభాజ్యమైనవి. మేము ఉక్రెయిన్‌కు బాసటగా నిలబడతాము ఆ యుద్ధ బాధిత దేశానికి మా సహాయ సహకారాలను ఇతోధికం చేస్తాం. దురాక్రమణదారుకు వ్యతిరేకంగా ఉక్రెయిన్ల పోరాటానికి అవసరమైన మద్దతును పూర్తిగా అందిస్తాం'. ఆమె ఇంకా ఇలా పేర్కొన్నారు: 'స్వేచ్ఛాయుత ప్రపంచానికి ఒక కొత్త నాయకుడు అవసరమని ఈ రోజు స్పష్టమయింది. ఈ సవాల్‌ను యూరోపియన్లమైన మేము సమర్థంగా ఎదుర్కొంటాము'.

యూరోపియన్ యూనియన్ విదేశీ వ్యవహారాల ప్రతినిధి బాధ్యతలు చేపట్టక ముందుకు కల్లాస్ ఎస్టోనియా ప్రధానమంత్రిగా ఉన్నారు. సోవియట్ యూనియన్ ఆధిపత్యం నుంచి విముక్తి పొందిన చిన్న బాల్టిక్ రాజ్యాలలో ఎస్టోనియా ఒకటి. ఉక్రెయిన్‌ను వశపరచుకున్న తరువాత పుతిన్ దృష్టి తమ దేశంపై తప్పక పడుతుందన్న వాస్తవం ఆమెకు బాగా తెలుసు. కల్లాస్ ధిక్కార ధోరణి కంటే బ్రిటిష్ ప్రధాని కెయిర్ స్టార్మెర్ తెలిపిన సంఘీభావం చాలా ముఖ్యమైనది. జెలెన్ స్కీని తన అధికార నివాసానికి ఆహ్వానించి వైట్ హౌజ్ ఆయనకు నిరాకరించిన గౌరవాదరాల నివ్వడమేకాకుండా ఉక్రెయిన్‌కు గణనీయమైన ఆర్థిక, ఆయుధ సహాయాన్ని బ్రిటిష్ ప్రధాని ప్రకటించడం గమనార్హం. ఆ వెన్వెంటనే యూరోపియన్ దేశాల అధినేతలు అందరూ జెలెన్ స్కీకి తమ సంఘీభావాన్ని తెలిపారు. ట్రంప్‌తో విభేదించే ధైర్యం చూపినప్పటికీ రష్యా దురాక్రమణ నుంచి ఉక్రెయిన్‌ను రక్షించేందుకు అవసరమైన సైనిక సామర్థ్యం తమకు లేదన్న విషయం యూరోపియన్ రాజకీయవేత్తలకు బాగా తెలుసు. అయితే ఉక్రెయిన్‌లోని విలువైన అపురూప ఖనిజ సంపదను వాణిజ్య ప్రయోజనాలకు వినియోగించుకునేందుకు అమెరికన్ కంపెనీలను ఆహ్వానించిన పక్షంలో ఆ దేశానికి తమ సైనిక సహాయం ఉపసంహరణపై ట్రంప్ పునరాలోచన చేయగలరనే ఆశాభావం యూరోపియన్ నాయకులలో ఉన్నది.

(వ్యాసకర్త చరిత్రకారుడు)

యూజీసీ ప్రతిపాదనలతో ప్రమాదం

రాజ్యాంగ మూలసూత్రాలను బలహీనపరచడమే కాకుండా, భారత రాజ్యాంగంపై దాడిచేసే విధంగా యూజీసీ ముసాయిదా ప్రతిపాదనలు ఉన్నాయి. దేశ ఉన్నత విద్యారంగంలో ఇవి ప్రమాదకరమైనవి. ఫెడరల్ హక్కులను కాలరాసి, ప్రభుత్వ యూనివర్శిటీలను మూసివేసే కుట్రలకు యూజీసీ తెరలేపింది. వైస్ ఛాన్సలర్లను నియమించే అధికారం గవర్నర్లకు కట్టబెట్టే ఆలోచన కేంద్ర ప్రభుత్వం చేస్తున్నది. ఇది రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధం. రాజ్యాంగం కల్పించిన హక్కులను బీజేపీ కాలరాస్తున్నది. విద్యను మరింతగా కేంద్రీకరణ, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, కాషాయీకరణ చేసే దిశగా బీజేపీ ఈ ప్రతిపాదనలకు పూనుకున్నది. విశ్వవిద్యాలయాల్లో ఆర్ఎస్ఎస్ అజెండా అమలుచేయడం బీజేపీ ప్రభుత్వానికి తగదు.

నూతన విద్యావిధానం–2020లో భాగంగా తీసుకొని వస్తున్న ఈ ప్రతిపాదనలు ఫెడరలిజం ప్రాథమిక సూత్రాలను ఉల్లంఘించేలా ఉన్నాయి. రాష్ట్రాలు తమ ప్రత్యేక సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక అంశాలకు అనుగుణంగా విద్యా విధానాలను రూపొందించుకుంటాయి. విశ్వవిద్యాలయాల్లో ప్రజాస్వామ్య వాతావరణం లేకుండా చేయడం, విద్యలో రాష్ట్రాల హక్కులను, స్వయంప్రతిపత్తిని దెబ్బతీసేలా యూజీసీ ముసాయిదా ఉంది. భారత రాజ్యాంగంలో ఉమ్మడి జాబితాలో ఉన్న విద్యను యూజీసీ నిబంధనల ద్వారా కేంద్రం లాక్కుంటున్నది. ఈ విద్యా విధానాలను వ్యతిరేకిస్తున్న విపక్ష పార్టీల పాలిత రాష్ట్రాలలో దీనిని బలవంతంగా అమలుచేసే కుట్రకు కేంద్ర ప్రభుత్వం తెరలేపింది. వైస్ ఛాన్సలర్ల నియామక అధికారం గవర్నర్లకు కట్టబెట్టాలనే కేంద్ర ప్రభుత్వ ఆలోచన సరైంది కాదు. నూతన జాతీయ విద్యా విధానంలో పేదవారికి ఉచిత విద్య లేనట్టేనా? అలాగే పాఠ్య పుస్తకాల్లో ప్రజాస్వామ్య, సెక్యులర్ పదాలను, డార్విన్ సిద్ధాంతాలను తొలగించడంలో ఆంతర్యం ఏమిటి?

భారతదేశంలో విశ్వవిద్యాలయాల సైద్ధాంతిక నియంత్రణ కార్పొరేట్ శక్తులకు లాభదాయక సాధనగా, హిందుత్వ ప్రచార సాధనగా మారకుండా ఉద్యమించాల్సిన అవసరం ఉంది. ఉన్నత విద్యను కాపాడుకునేందుకు విద్యావేత్తలు, విద్యార్థులు యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. ఉన్నత విద్యా పరిరక్షణకు పూనుకోవాలి.

– ఇటికాల రామకృష్ణ
ఏఐఎస్ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు

సివిల్ సర్వెంట్లకు నీతిపాఠాలు కీలకమే!

సుపరిపాలనా వ్యవస్థ సజావుగా సాగడానికి, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించడానికి, అధికారంలో ఉన్న ప్రభుత్వం ఎన్నికలలో వాగ్దానం చేసిన అభివృద్ధి–సంక్షేమ పథకాలకు ఒక రూపం ఇచ్చి సరిగ్గా అమలుచేయడానికి సివిల్ సర్వెంట్ల నిబద్ధత, వైఖరి అత్యంత కీలకం. వారిని ఆ దిశగా నడిపించే స్ఫూర్తి, తప్పు చేయమని ప్రోత్సహించకుండా ఉండే బాధ్యత రాజకీయ నాయకులది. నిరంతరం మార్పుకు గురవుతున్న సామాజిక పరిస్థితుల నేపథ్యంలో, ఊగిసలాటలో వున్న సివిల్ సర్వెంట్లలో, ముఖ్యంగా యువ అధికారులలో, ప్రవర్తనా వైఖరిని ఎప్పటికప్పుడు మెరుగుపరచడానికి నైతికతలో శిక్షణ మినహా గత్యంతరం లేదు.

ఇటీవల కొద్దిమంది యువ అధికారులలో విజ్ఞానం, నైపుణ్యం, ప్రవర్తనా వైఖరుల్లో చోటుచేసుకుంటున్న మార్పులు, ఊగిసలాటలు ఆందోళన కలిగిస్తున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక పుస్తకావిష్కరణ సభలో ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ– యువ ఐఏఎస్ అధికారుల ఆలోచనా విధానం మారాలి అని స్పష్టంగా అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. సమాజం మేలుకోరే పలువురి హృదయాంతరాలలో ఇలాంటి అభిప్రాయమే ఉన్నది. రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు వివాదాస్పదంగా కనిపించినా, అవి సివిల్ సర్వెంట్ల ప్రవర్తనా ధోరణులపై పెరుగుతున్న ఆందోళనలను వంద శాతం ప్రతిబింబిస్తున్నాయి.

మూడున్నర దశాబ్దాల క్రితం నేను ఎంసీఆర్ హెచ్ఆర్‌డి శిక్షణాసంస్థలో ఫ్యాకల్టీ మెంబర్‌గా, అదనపు సంచాలకుడిగా పనిచేస్తున్నాను. ఆ సమయంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన శిక్షణలో వున్న ఏడు బ్యాచ్‌ల అసిస్టెంట్ కలెక్టర్లకు శిక్షణా కార్యక్రమాల సమన్వయ బాధ్యతలను నిర్వహించాను. ఆ సందర్భంగా సివిల్ సర్వీసుకు సంబంధించిన కొన్ని విషయాలు నా అవగాహనకు వచ్చాయి. శిక్షణ పూర్తయిన తరువాత ఆయా అధికారుల వృత్తి పురోగతినీ, రాష్ట్ర అభివృద్ధికి వారు అందించిన విశిష్ట సేవలనూ దగ్గరగా పరిశీలించాను. ఈ విషయంలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలతో పూర్తిగా ఏకీభవించడం కష్టం. కాకపోతే, కొంత మంది యువ ఐఏఎస్ అధికారులలో, వారు అందించాల్సిన సేవలకు సంబంధించి తప్పక అవసరమైన విజ్ఞానం, నైపుణ్యం, ప్రవర్తనా వైఖరుల్లో లోపాలున్న విషయం గమనించాను.

1990 దశకంలో చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 'సివిల్ సర్వెంట్ల నిబద్ధత' అత్యంత ప్రాధాన్యం గల విషయం అని గుర్తించి, మూడు రోజుల శిక్షణ మోడ్యూల్‌ను రూపొందించి, దాదాపు 150 మంది సీనియర్, జూనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. అలాగే, సివిల్ సర్వెంట్లలో మార్పును తీసుకురావడానికి 'గవర్నింగ్ ఫర్ రిజల్ట్స్' అనే ప్రత్యేక కార్యక్రమాన్ని కూడా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాలు అప్పట్లో అనుకున్న లక్ష్యాలను సాధించాయి. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను మళ్లీ నిర్వహించాల్సిన అవసరం ఉంది. దీనికి కారణం, సివిల్ సర్వెంట్ల శిక్షణలో విజ్ఞానం, నైపుణ్యం మాత్రమే కాకుండా ప్రవర్తనా వైఖరి కూడా అవసరమే కాబట్టి.

ప్రవర్తనా విలువలు, నిజాయితీ, నిబద్ధతలను పాటించేందుకు వారిని సిద్ధం చేయడం ఈ శిక్షణ లక్ష్యం.

యువ సివిల్ సర్వెంట్లు కొందరిలో వ్యక్తిగత ప్రయోజనాల పట్ల అమితమైన ఆసక్తి, ధనపిపాస, అధికార తాపత్రయం, గుర్తింపు పొందాలన్న కాంక్ష, పనిలో అనైతికత వంటి ఆందోళనకర అంశాలు వ్యక్తమవుతున్నాయి. వీరిలో నిబద్ధత, బాధ్యత, స్పందన, జవాబుదారీతనం, పారదర్శకత మెల్లమెల్లగా క్షీణిస్తున్నాయి. వీరికి పరిపాలనలో నైతికత అంశంపై సమర్థమైన శిక్షణ ఇవ్వడం అత్యంత కీలకం.

యువ సివిల్ సర్వెంట్లు కొందరిలో వ్యక్తిగత ప్రయోజనాలపట్ల అమితమైన ఆసక్తి, ధనపిపాస, అధికార తాపత్రయం, గుర్తింపు పొందాలన్న కాంక్ష, పనిలో అనైతికత వంటి ఆందోళనకర అంశాలు వ్యక్తమవుతున్నాయి. వీరికి పరిపాలనలో నైతికత అంశంపై సమర్థమైన శిక్షణ ఇవ్వడం అత్యంత కీలకం. ఎందుకంటే ఒక వ్యక్తి పనితీరును నిర్ణయించేది కేవలం అతని విషయ పరిజ్ఞానం, నైపుణ్యం మాత్రమే కాదు; ప్రవర్తనా వైఖరి కూడా.



ఇప్పటివరకు, లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడెమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ (ఎల్బీఎస్ఎన్ఏఏ) సివిల్ సర్వెంట్లకు నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాలలో– విధానాల రూపకల్పన, భూపరిపాలన, సాఫ్ట్ స్కిల్స్ ప్రాజెక్ట్ నిర్వహణ, జాతీయ భద్రత, ఇ–గవర్నెన్స్ వంటి అంశాలకు ప్రాముఖ్యతనిస్తున్నారు. అయితే వీటికన్నా ప్రధానమైన ప్రవర్తనా వైఖరి, నియమావళి మీద పెద్దగా శ్రద్ధ పెట్టడం లేదనిపిస్తున్నది. జాతీయ శిక్షణా విధానం ఈ లోటును గుర్తించింది. దాన్ని భర్తీ చేయడానికి, సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా, 'ప్రవర్తనా వైఖరి ఆధారిత శిక్షణ–పునశ్చరణ' (Attitudinal Training and Reorientation) అవసరం అనే విషయాన్ని ఉద్ఘాటించింది. సివిల్ సర్వెంట్లు ప్రజాస్వామ్య సమాజంలో తమ బాధ్యతలను పూర్తిగా అర్థం చేసుకునేలా చేయడం, అత్యున్నత నైతిక ప్రమాణాలు, ఎందుకంటే ఒక వ్యక్తి పనితీరును నిర్ణయించేది కేవలం అతని విషయ పరిజ్ఞానం, నైపుణ్యం మాత్రమే కాదు; ప్రవర్తనా వైఖరి కూడా.

పదవ పంచవర్ష ప్రణాళికా విధాన ప్రకటన ప్రకారం– ప్రభుత్వ పరిపాలన మరింత సమర్థంగా, ప్రజా ప్రయోజనానికి అనుగుణంగా ఉండాలంటే, సివిల్ సర్వీసును దీర్ఘకాలికంగా, స్థిరంగా నిర్వహించగలిగే విధంగా చర్యలు తీసుకోవాలి. అలాగే, ప్రమాణాలను పాటించే అధికారులకు ప్రోత్సాహకాలను అందించాలి. మెరుగైన పనితీరు కోసం క్రమశిక్షణను కచ్చితంగా అమలు చేయాలి. ప్రభుత్వ పరిపాలనను ప్రజలకు మరింత అనుకూలంగా మార్చాలంటే, అధికార వ్యవస్థను అన్ని స్థాయిల్లో మెరుగుపరచాలి, నైతిక విలువలను ఖచ్చితంగా పాటించాలి. రాజ్యాంగ ప్రాథమిక సిద్ధాంతాలపై నిబద్ధత ఉండాలి. అలాగే రాజకీయ నాయకులు, సివిల్ సర్వెంట్ల పరస్పర సంబంధాలను స్పష్టంగా నిర్వచించుకోవాలి.

ఐఏఎస్ అధికారులుగా ఎంపికకాగానే లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌లో ఏడాదిపాటు ప్రాథమిక శిక్షణ పొందిన తర్వాత, వారికి కేటాయించిన రాష్ట్రాల్లో జిల్లా శిక్షణ పొందుతారు. ఆ తరువాత సబ్ కలెక్టర్లుగా వారి నియామకం జరుగుతుంది. ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ వారు– జాయింట్ కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్‌లుగా పదోన్నతి పొందుతారు. సుమారు నాలుగైదు సంవత్సరాల తర్వాత వారు కీలకమైన జిల్లా కలెక్టర్ పదవిని చేపడతారు. దాదాపు ఒక దశాబ్దం పాటు జిల్లా కలెక్టర్లుగా పనిచేసిన తరువాత, రాజధానికి బదిలీ అయ్యి, సచివాలయ, విభాగ, ప్రభుత్వ రంగసంస్థలలో పదవులు చేయడమో, లేదా కేంద్రంలో నియామకం కావడమో జరుగుతుంది. ఎక్కడ పనిచేసినా సమయానికి పదోన్నతి సీనియారిటీ ఆధారంగా జరుగుతుంది. కానీ పోస్టింగ్‌లు మాత్రం అధికారుల వ్యక్తిగత ప్రతిభ, సామర్థ్యాలు, అలాగే రాజకీయ నాయకత్వంతో ఉన్న సన్నిహిత సంబంధాలపై ఆధారపడి ఉంటాయి. ఐఏఎస్ అధికారుల అత్యున్నత పదవి– రాష్ట్రంలో చీఫ్ సెక్రటరీ, కేంద్రంలో కాబినెట్ సెక్రటరీ. అయితే దీనికి కేవలం సీనియారిటీ ఒక్కటే అర్హత కాదు. ఒకసారి జిల్లా పరిపాలనను వదిలిపెడితే, తదుపరి ఉద్యోగ జీవితంలో క్షేత్రానుభావం వదిలినట్లే.

కొత్త జిల్లాల ఏర్పాటుతో యువ ఐఏఎస్ అధికారులకు ఒకేసారి ఎక్కువ బాధ్యతలు రావడం సవాలుగా మారింది. అనుభవం తక్కువగా ఉండటం, మంచి పరిపాలనా పద్ధతులపై తగిన శిక్షణ లేకపోవడం, మారుతున్న సామాజిక, రాజకీయ సమీకరణాలకు అనుగుణంగా మారడం కష్టతరం కావడం ప్రధాన సమస్యలుగా మారాయి. యువ అధికారులు ప్రజా సేవకులుగా అభివృద్ధి చెందడానికి తగిన శిక్షణ, తగిన అభివృద్ధి అవకాశాలు అందించాలి. అప్పుడే ప్రజాస్వామ్య స్ఫూర్తిని పరిరక్షిస్తూ వారు సమర్థమైన ప్రజా సేవను అందించగలుగుతారు.


▪ వనం జ్వాలానరసింహారావు



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : మంగళవారం
సా.. 6.30 గం॥

సహర్ : బుధవారం
ఉ..5.05 గం॥



- కాంగ్రెస్, సీసీఐ, బీఆర్ఎస్‌లోని ఆశవాహులకు దక్కని ఛాన్స్
- గంపెడాశలు పెట్టుకున్న కాంగ్రెస్ నేతలకు చుక్కెదురు
- నేతల మధ్య అనైక్యతే కొంపముంచిందా?
- ఫలించని మధ్యవర్తిత్వాలు, లాబీయింగ్
- వారికి పార్టీ పదవులైనా దక్కుతాయా?
- బీఆర్ఎస్, సీపీఐ నేతలకూ విగిలింది మొండిచేయే..

దక్కని అవకాశం.. నేతల్లో అంతర్మథనం!

'ఎమ్మెల్సీ'లో ఓరుగల్లు నాయకులకు ఝలక్ ఇచ్చిన పార్టీలు

ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీల కేటాయింపు విషయంలో ఇటు అధికార కాంగ్రెస్, దాని మిత్రపక్షం సీపీఐ.. అటు ప్రతిపక్ష బీఆర్ఎస్ ఊహించని నిర్ణయాలు తీసుకున్నాయి. ఆయా పార్టీల నుంచి ఎమ్మెల్సీల పదవులకు కొందరి పేర్లు వినిపించినా.. ఆశావహులు లాబీయింగ్ చేసినా.. వారందరికీ ఝలక్ ఇస్తూ.. అనూహ్యంగా వేరే నేతలకు ఆ పదవులను కట్టబెట్టాయి. ఈ క్రమంలో పెద్దల సభలో అడుగుపెట్టాలకున్న వారి ఆశలు అడియాశలయ్యాయి. ముఖ్యంగా ఈ మూడు పార్టీల నుంచి ముగ్గురు ఉమ్మడి ఓరుగల్లు నేతలకే అవకాశం ఉండబోతోందన్న ప్రచారం జరగ్గా.. అదంతా తారుమారైంది. ఒక్కరికి కూడా అవకాశం దక్కలేదు. ఈ క్రమంలో అధికార కాంగ్రెస్ నేతల్లోని అనైక్యతే ఎవరికీ పదవి రాకుండా చేసిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక కాంగ్రెస్ తన మిత్రపక్షంగా ఉన్న సీపీఐకి ఒక సీటు కేటాయించగా.. ఆ పదవికి ఉమ్మడి ఓరుగల్లు నుంచి ఒకరిని ఎంపిక చేయబోతున్నారన్న ఊహాగానాలు వెలువడ్డాయి. 'గులాబీ' పార్టీ నుంచి మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, లేదంటే ఎర్రబెల్లి దయాకర్‌రావు పెద్దల సభకు వెళ్లబోతున్నారంటూ వార్తలొచ్చాయి. కానీ ఈ రెండు పార్టీలు కూడా ఝలక్ ఇచ్చాయి. దీంతో ఓరుగల్లు నేతలు ఇప్పుడు అంతర్మథనంలో పడ్డారు. తమకు పదవులు రాకపోవడానికి కారణాలను తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

ఓరుగల్లు నేతలకు అటు కాంగ్రెస్, సీపీఐ.. ఇటు బీఆర్ఎస్ అధిష్ఠానాలు ఝలక్ ఇచ్చాయి. ఎమ్మెల్సీ సీటు పక్కా అనుకున్న నేతలకు పరాభావం తప్పలేదు. కాంగ్రెస్ నేతలు ఏడాది కాలంగా ఎమ్మెల్సీ సీటుపై ఆశలతో అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చినా ఫలితం లేకుండా పోయిందనే నైరాశ్యంలో ఉన్నారు. తమకు పదవులు దక్కపోవడం వెనుక కారణాలేంటా అని అంతర్మథనం చెందుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నేతల మధ్య అనైక్యతే ఎవరికి పదవి రాకుండా చేసిందనే చర్చ జరుగుతోంది. మరోవైపు పీసీసీ పదవులు కూడా ఓరుగల్లు నేతలకు దక్కేనా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆధిపత్య పోరులో ఒకరికి రాకుండా మరొకరు అధిష్ఠానంపై ఒత్తిళ్లు చేస్తుండటంతో ఎమ్మెల్సీ సీటు తరహాలోనే టీపీసీసీ పదవులు కూడా దూరమయ్యే అవకాశం ఉందనే చర్చ జరుగుతుంది. మరోవైపు బీఆర్ఎస్ నుంచి మరోసారి చాన్స్ తనకే అనే ధీమాతో ఉన్న మాజీ మంత్రి సత్యవతిరాథోడ్‌కు అధిష్ఠానం షాక్ ఇచ్చింది. ఇక పొత్తులో భాగంగా వచ్చే ఆ ఒక్క సీటు కూడా వరంగల్ సీపీఐకే దక్కుతుందని భావించినా కామ్రేడ్లు సైతం ఝలక్ ఇవ్వటంతో ఎమ్మెల్సీ సీటును ఆశించిన వారిలో నిరాశ ఆవహించింది. అయితే ఓరుగల్లు మూలలు ఉన్న సినీనటి విజయశాంతికి ఎమ్మెల్సీ రావటం కొంత ఊరటగా భావిస్తున్నారు.

కాంగ్రెస్ ఆశవాహులకు నిరాశే...

కాంగ్రెస్ ఎమ్మెల్సీ పదవి కోసం ఉమ్మడి వరంగల్ జిల్లాలో డజను మందికి పైగా ఆశలు పెట్టుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి అవకాశం లేనివారు, పోటీ చేసేందుకు చాన్స్ దక్కనివారు, సీనియర్ నేతలు ఎమ్మెల్సీ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. వీరిలో ప్రధానంగా మంత్రి కొండా సురేఖ భర్త మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు మొదటి నుంచి ఎమ్మెల్సీ పదవిపై ఆశతో ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పరకాల నుంచి కొండా మురళీ పోటీకి ప్రయత్నాలు చేశారు. ఆ సమయంలో ఒకే కుటుంబంలో ఇద్దరికి టికెట్ కష్టమని, ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తాని పార్టీ హామీ ఇచ్చింది. గత పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలోనూ స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి కొండా మురళీకి పదవిపై హామీ ఇచ్చారు. దీంతో ఈసారి పక్కాగా కొండాకు ఎమ్మెల్సీ పదవి ఖాయమనున్నారు. కానీ, అనూహ్యంగా కొండా మురళి పేరు జాబితాలో లేకపోవటంతో ఆయన వర్గీయులు కంగుతిన్నారు. మరోవైపు సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి పేరు కూడా చివరి నిమిషంలో ప్రముఖంగా వినిపించింది. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు కూడా వేంకు ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని సీఎం, టీపీసీసీ అధ్యక్షుడిని కోరారు. అయితే వేం నరేందర్‌రెడ్డికి కూడా ఎమ్మెల్సీ చాన్స్ రాకపోవటం ఆయన వర్గీయుల్లో నిరాశకు గురయ్యారు. ఇక మరో నాయకుడు దొమ్మాటి సాంబయ్యకు కూడా ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని పరకాల, భూపాలపల్లి, పాలకుర్తి, స్టేషన్‌ఘనపూర్, వర్ధన్నపేట ఎమ్మెల్యేలు అప్పటి ఏఐసీసీ ఇన్‌చార్జ్ దీపా దాస్‌మున్షిని కలిసి లేఖ అందజేశారు. సీఎం రేవంత్‌రెడ్డికి కూడా విజ్ఞప్తి చేసినా సాంబయ్యకు అధిష్ఠానం ఝలక్ ఇచ్చిందనే టాక్ వినబడుతోంది. మరోవైపు స్టేషన్‌ఘనపూర్ నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన శనిగపురం ఇందిరాకు సైతం ఎమ్మెల్సీ పదవి అందని ద్రాక్షగానే విగిలింది. కడియం శ్రీహరి బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన సమయంలోనే ఇందిరాకు అధిష్ఠానం పదవిపై హామి ఇచ్చింది. వీరితో పాటు మరికొంత మంది నేతలు ఎమ్మెల్సీ సీటుపై ఆశతో అధిష్ఠానంపై ఒత్తిళ్లు తెచ్చిన ఫలితం లేకపోవటంతో

మిగతా 7వ పేజీలో...



వరంగల్‌లోని భట్టుపల్లి ప్రాంతంలో సభా స్థలాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నేతలు

కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు..

- కాంగ్రెస్ పాలనపై జనానికి స్పష్టత వచ్చింది
- ఇక ఏ ఎన్నికల్లోనైనా బీఆర్ఎస్‌దే విజయం
- వచ్చే నెల 27న బీఆర్ఎస్ రజతోత్సవ సభ
- మీడియా సమావేశంలో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు



హనుమకొండ టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ కావాలని కోరుకుంటున్నారని, కేసీఆర్ గొంతు వినాలని ప్రజలు ఎదురు చూస్తున్నారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. సోమవారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తన్నీరు హరీశ్‌రావు మాట్లాడుతూ.. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో దేశానికే తలమానికంగా నిలిపారని కొనియాడారు. పదేళ్ల పాలనలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి పాటుపడిన కేసీఆర్‌ను ప్రజలు గుండెల్లో పెట్టుకున్నారని అన్నారు. కేసీఆర్ ప్రారంభించిన పథకాలు దేశానికి దిక్సూచిగా నిలిచాయని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సహా ఏ ఎన్నికలు వచ్చినా ఇక బీఆర్ఎస్‌దే విజయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

యేడాది కాంగ్రెస్ పాలనపై ప్రజలకు ఒక స్పష్టత వచ్చిందని హరీశ్‌రావు అన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగెత్తి పోతున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 15 నెలల పాలనలో 15 ఇళ్లను కూడా నిర్మించలేదని విమర్శించారు. హుజూరాబాద్, మునుగోడులో అమ్ముడుబోయి డిపాజిట్ కోల్పోయిన చరిత్ర రేవంత్‌రెడ్డిదేనని ఆరోపించారు. రాహుల్ గాంధీ గుజరాత్ సభలో కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులు గురించి మాట్లాడారని, తెలంగాణలో సీఎం రేవంత్‌రెడ్డి మోదీ మంచోడని

మిగతా 8వ పేజీలో...



తాడ్వాయి మండలం కొండపర్తిలో గవర్నర్ నిధులతో నిర్మించిన పాఠశాల భవనం



నేడు కొండపర్తికి గవర్నర్

దత్తత గ్రామానికి రానున్న జిష్ణుదేవ్ వర్మ

- అభివృద్ధి పనులకు శ్రీకారం
- గ్రామస్థులతో సమావేశం.. అనంతరం సమ్మక్క సారలమ్మల దర్శనం

7



ఫాతిమా మాత గుహ వద్ద అలంకరిస్తున్న దృశ్యం

నేటి నుంచి ఫాతిమామాత ఉత్సవాలు

- రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి రానున్న క్రైస్తవులు
- కేథడ్రల్ చర్చి ఆవరణలో విస్తృత ఏర్పాట్లు
- ఉత్సవాలు విజయవంతం చేయాలి : బిషప్ ఉడుమల బాల

7

ఎల్‌ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- ఈ నెలాఖరు వరకు 25 శాతం రాయితీతో గడువు
- వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య
- కుడా కార్యాలయంలో అధికారులతో సమావేశం



కుడా కార్యాలయంలో మాట్లాడుతున్న కలెక్టర్లు సత్యశారద, ప్రావీణ్య

వరంగల్ కార్పొరేషన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ సదుపాయాన్ని లేఅవుట్, నాన్‌లేవుట్ ప్లాట్ల యజమానులు, డెవలపర్లు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు సత్యశారదదేవి, ప్రావీణ్యలు సంయుక్తంగా సూచించారు. సోమవారం హనుమకొండలోని కుడా కార్యాలయంలో కుడా వైస్ చైర్‌పర్సన్ అశ్విని తానాజీ వాకడేతో పాటు సంబంధిత శాఖల అధికారులతో ఎల్‌ఆర్ఎస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్లు మాట్లాడుతూ.. ఎల్‌ఆర్ఎస్‌కు దరఖాస్తుదారులు రెగ్యులరైజ్ చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అనుమతులు ఇస్తామన్నారు. 26 ఆగస్టు 2020 సంవత్సరం కంటే ముందు రిజిస్ట్రేషన్ అయిన తర్వాత కచ్చా లేఅవుట్ చేసిన వారు ప్లాన్‌లు తీసుకుని ఎల్‌ఆర్ఎస్‌కు వచ్చిన దరఖాస్తుదారులు క్రమబద్ధీకరించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు. రెగ్యులరైజ్ చేసుకోవడానికి 25 శాతం రాయితీతో ఈ నెల 31 వరకు ప్రభుత్వం గడువు కల్పించిందని, గడువు పొడిగింపు ఉండదని, కల్పిస్తున్న రాయితీ ప్రోత్సాహకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఏదైనా కారణం చేత ఎల్‌ఆర్ఎస్ తిరస్కరణ జరిగితే 10శాతం ప్రాసెసింగ్ ఫీజు కింద మినహాయించుకుని మిగతా 90 శాతం డబ్బులు తిరిగి ఇస్తామన్నారు. లేఅవుట్ ప్లాట్ల ప్రాంతాన్ని మున్సిపాలిటీ అభివృద్ధి చేస్తుందని వారు పేర్కొన్నారు. ఎల్‌ఆర్ఎస్ కోసం ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కుడా వీసీ అజిత్‌రెడ్డి, ఇన్‌చార్జ్ సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, రిజిస్ట్రేషన్ అధికారి, లేఅవుట్, నాన్ లేఅవుట్ ప్లాట్ల యజమా నులు, బిల్డర్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పోలీసుశాఖపై నమ్మకం కలిగేలా పనిచేస్తా..

- నిత్యం పోలీసులు అందుబాటులో ఉండేలా చూస్తా..
- వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్
- కమిషనరేట్‌లో బాధ్యతల స్వీకరణ



వరంగల్ సీపీగా బాధ్యతలు స్వీకరిస్తున్న సన్‌ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం, మార్చి 10(ఆంధ్రజ్యోతి) : పోలీసుశాఖపై ప్రజలకు నమ్మకం కలిగేలా వరంగల్ పోలీస్ కమిషనర్‌గా తన విధులు నిర్వర్తిస్తానని నూతన సీపీ సన్‌ప్రీత్ సింగ్ స్పష్టం చేశారు. వరంగల్ పోలీస్ కమిషనర్‌గా సోమవారం సన్‌ప్రీత్ సింగ్ బాధ్యతలు స్వీకరించారు. పూర్వపు సీపీ అంబర్ కిషోర్ ఝా నుంచి బాధ్యతలు స్వీకరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండి శాంతి భద్రతలు కాపాడుతామన్నారు. నేరాల నియంత్రణతో పాటు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు కృషి చేస్తానన్నారు. ప్రస్తుతం పోలీసులకు సవాల్‌గా మారిన సైబర్ క్రైంతో పాటు, మత్తు పదార్థాల రవాణా, వినియోగించే వారిపై కఠినంగా వ్యవహరిస్తానని పేర్కొన్నారు. మహిళల భద్రతపై ప్రత్యేకంగా దృష్టి పెడతామన్నారు. రానున్న రోజుల్లో కమిషనరేట్‌ను బలోపేతం చేస్తానని సన్‌ప్రీత్‌సింగ్ తెలిపారు. ఈ సందర్భంగా సాయుధ పోలీసులు చేసిన గౌరవ వందనాన్ని సీపీ స్వీకరించారు. కమిషనరేట్‌లోని మూడు జోన్‌ల పరిధిలో ఉన్న డీసీపీలు షేక్ సలీమా, రాజమహేంద్ర నాయక్, అంకిత్‌కుమార్, ఏఎస్పీ చైతన్య, ఏఆర్ అధికారులు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్స్ సీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

ప్రజావాణి వినతులలో అలసత్వం వహించొద్దు

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య
- వివిధ సమస్యలపై 114 వినతులు

హనుమకొండ కలెక్టరేట్, మార్చి10(ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చే వినతులలో అలసత్వం వహించకుండా బాధిత ప్రజలకు వెంటనే న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లావ్యాప్తంగా వివిధ సమస్యలపై ప్రజలు 114 ఫిర్యాదులు అందజేశారు. కలెక్టర్ ప్రావీణ్య బాధితుల నుంచి ఓపికగా సమస్య వింటూ సంబంధిత శాఖల అధికారులను పిలిచి వినతిని పరిశీలించి వెంటనే పరిష్కరించాలన్నారు. ఫిర్యాదులలో 14 గ్రేటర్ వరంగల్ మహానగపాలక సంస్థకు రాగా, హనుమకొండ తహసీల్దార్ కార్యాలయానికి 8, కమలాపూర్ తహసీల్దార్ కార్యాలయానికి 6రాగా, మిగిలిన వినతులు ఇతర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ.. ప్రజావాణికి వచ్చే సమస్యలు పరిష్కరిస్తేనే ప్రజలకు ప్రజావాణిపై నమ్మకం ఉంటుందని, సంబంధిత శాఖల అధికారులు వెంటనే సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వై.వి.గణేష్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



బాధితుల సమస్య వింటున్న కలెక్టర్ ప్రావీణ్య



కొంగర జగన్మోహన్, షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం సంచాలకుడు

ప్రత్యేకం

పేద నిరుద్యోగులకు ఉపాధే ధ్యేయం

ఆంధ్రజ్యోతి: షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం ఎప్పుడు ప్రారంభమైంది?

సంచాలకుడు: 2016లో ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా హనుమకొండలో ప్రారంభమైంది.

ఆంధ్రజ్యోతి : ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు ఎంత మంది నిరుద్యోగులు ఉచిత శిక్షణ తీసుకున్నారు ?

సంచాలకుడు: ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వికలాంగుల అభ్యర్థులు 1275 మంది నిరుద్యోగులు ఉచిత శిక్షణ తీసుకున్నారు.

ఆంధ్రజ్యోతి: శిక్షణ తీసుకున్న ఎంత మందికి ఉద్యోగాలు లభించాయి ?

సంచాలకుడు : శిక్షణ తీసుకున్న వారిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో 200కు పైగా ఉద్యోగాలు సాధించారు. ఈ శిక్షణ తీసుకున్న వారిలో అనేక మంది ప్రైవేటు సెక్టార్‌లో సైతం పనిచేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం నుంచి ఏఏ ఉద్యోగాలకు శిక్షణ ఇస్తారు?

సంచాలకుడు : కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎస్ఎస్‌సీ, బ్యాంకింగ్, ఆర్ఆర్‌బీ, రాష్ట్ర ప్రభుత్వంలో అన్ని రంగాలకు సంబంధించిన ఉద్యోగాల ఎంపికకు శిక్షణ ఇవ్వబడుతుంది.

ఆంధ్రజ్యోతి : షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం నిరుద్యోగులకు ఎలా ఉపయోగపడుతుంది ?

సంచాలకుడు: షెడ్యూల్ కులాల అధ్యయన కేంద్రం ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న పేద నిరుద్యోగులకు, ఉద్యోగాలు సాధించే వారికి ఒక ప్లాట్ ఫామ్ లాంటిది. ఇక్కడి శిక్షణ తీసుకున్న వారంతా ఏదో ఒక రంగంలో పనిచేస్తున్నారు. శిక్షణ మంచి నైపుణ్యం గల అధ్యాపకులతో ఇవ్వనున్నాం.

- వడ్డెపల్లి, (ఆంధ్రజ్యోతి)

స్పాట్ టీచర్లకు రెమ్యూనరేషన్ ఇవ్వాలి

టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాపురావు, శ్రీనివాస్ నాయక్

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది ఏప్రిల్‌లో పదో తరగతి మూల్యాంకనం విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాసిరిరాజి బాపురావు, గుగులోత్ శ్రీనివాస్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం వారు హనుమకొండ డీఈవో కార్యాలయంలో డీఈవో వాసంతిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఏడాది టెన్త్ స్పాట్‌లో వివిధ హోదాల్లో పనిచేసిన ఉపాధ్యాయులకు యేడాది గడుస్తున్నా ఇప్పటి వరకు రెమ్యునరేషన్ ఇవ్వకపోవడాన్ని వారు తప్పుబట్టారు. ఇప్పటి వరకు స్పాట్ రెమ్యునరేషన్ చెల్లించకపోవడంతో ఉపాధ్యాయుల్లో చాలామంది ఈ సారి స్పాట్‌లో డ్యూటీలు చేసేందుకు సిద్ధంగా లేరన్నారు. ఇప్పటికైనా రెమ్యునరేషన్ ఇవ్వకపోతే ఈ ఏడాది జరిగే స్పాట్‌ను బహిష్కరించాలని టీఆర్‌టీఎఫ్ పిలుపునిస్తుందని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే పంటలు ఎండుతున్నాయ్

- వెంటనే నీరందించి కాపాడాలి
- లేదంటే సీఎం పర్యటనను అడ్డుకుంటాం
- జనగామ జిల్లా పర్యటనలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



చిన్నరామన్‌చర్లలో ఎండిన పంటను పరిశీలిస్తున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, నాయకులు

జనగామ రూరల్ / బచ్చన్నపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్లక్ష్యం కారణాగానే పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే సాగు నీరు అందించి పంటలను, రైతులను కాపాడాలని, లేదంటే త్వరలో జరిగే సీఎం రేవంత్‌రెడ్డి స్టేషన్‌ఘన్‌పూర్ పర్యటనను అడ్డుకుంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ హెచ్చరించారు. సోమవారం జనగామ జిల్లాలో పర్యటించిన ఆయన తొలుత జనగామ మండలంలోని గానుగుపహాడ్, కొత్రతండా, వడ్లకొండ గ్రామాల్లో ఎండిన పంటలను పరిశీలించారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కంటే మెరుగైన పాలన కాంగ్రెస్ పార్టీ అందిస్తుందని ప్రజలు నమ్మి ఓట్లు వేసి గెలిపిస్తే కాంగ్రెస్ ప్రభుత్వ పాలన గత ప్రభుత్వం కంటే దారుణంగా ఉందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను పూర్తి స్థాయిలో అమలు చేయలేదని మండిపడ్డారు. సాగు నీరు లేక పంట పొలాలు ఎండిపోతున్నా ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని, నష్టపోయిన రైతులకు వెంటనే నష్ట పరిహారం ఎకరానికి రూ. 50వేల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇక బచ్చన్నపేట మండలం చిన్నరామన్‌చర్లలో ఎండిన పొలాలను కూడా పరిశీలించిన జాన్‌వెస్లీ మాట్లాడుతూ జిల్లాలో రిజర్వాయర్లుండీ గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపకపోవటం విచారకరమన్నారు. సీఎం స్టేషన్‌ఘన్‌పూర్ పర్యటనకు ముందే చెరువులు, కుంటలు నింపి పంటలు కాపాడే ప్రయత్నాలు చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతులకు రుణ మాఫీ చేస్తామని చెప్పి సంపూర్ణం చేయలేకపోయారని విమర్శించారు. ఆయన వెంట రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అబ్బాస్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, నాయకులు రాపర్తి రాజు, ఇర్రి అహల్య, బూడిద గోపి, జోగు ప్రకాశ్, సుంచు విజేందర్, బీ వెంకటేశ్, పర్వతం నర్సింహులు, ఎం ఎల్లయ్య, రాజు, బలరాములు, అశోక్ తదితరులు ఉన్నారు.

సీఎం సభకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

- సీపీ సన్‌ప్రీత్ సింగ్
- సభా స్థలం పరిశీలన



సీఎం సభాస్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

స్టేషన్‌ఘన్‌పూర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఈనెల 16న స్టేషన్‌ఘన్‌పూర్‌లో నిర్వహించనున్న సీఎం సభ ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. ఘన్‌పూర్- పాలకుర్తి రోడ్‌లో ఏర్పాటు చేస్తున్న సీఎం సభ స్థలాన్ని సీపీ సోమవారం పరిశీలించారు. హెలిప్యాడ్ ఏర్పాటు స్థలాన్ని, వీఐపీల వాహనాల పార్కింగ్, వేదిక స్థలాన్ని పరిశీలించారు. సభ నిర్వహనకు సంబంధించిన ఏర్పాట్లను ప్రతీ రోజు మానిటరింగ్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన స్థలాలతో పాటు అత్యవసర ట్రాఫిక్ సమస్యలు లేకుండా రోడ్డు వెంట ఖాళీగా ఉన్న స్థలాలను అందుబాటులోకి తీసుకోవాలన్నారు. సభ ముగిసే వరకు సభ స్థలాన్ని సంబంధిత సిబ్బంది ప్రతీ రోజు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీపీ రాజమహేంద్రనాయక్, ఏసీపీ భీమాశర్మ, సీఐలు జి.వేణు, ఎడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సైలు నవీన్‌కుమార్, వినయ్‌కుమార్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు : ఆర్డీవో

ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సీఎం సభ ఏర్పాట్లను నిర్వహిస్తున్నామని ఆర్డీవో ధరంసోత్ వెంకన్న తెలిపారు. సోమవారం స్టేషన్‌ఘన్‌పూర్‌లోని పాలకుర్తి రోడ్డులో ఏర్పాటు చేస్తున్న సీఎం సభ స్థలం ఏర్పాటు పనులను ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సభ స్థలంలో జంగల్ కటింగ్, స్థలం చదును పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభ స్థలిలో ఏర్పాటు చేయనున్న డయాస్, హెలిప్యాడ్, ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు చెందిన స్టాల్స్, వీఐపీల వాహనాల పార్కింగ్‌కు సంబంధించిన స్థలాలను గుర్తించి పనులను ప్రారంభించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ అశోక్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎస్సై వినయ్‌కుమార్, ఆర్ఐ సతీష్, నాయకులు నరేందర్ రెడ్డి, పోగుల సారంగపాణి, గుర్రం రాజు పాల్గొన్నారు.

తెలంగాణలో రైల్వే సమస్యలు పరిష్కరించాలి

రైల్వేబోర్డు చైర్మన్ సతీష్ కుమార్‌కు ఎంపీ వద్దిరాజు వినతి

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యలను పరిష్కరించాలని కేంద్ర రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్‌ను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కోరారు. సోమవారం ఢిల్లీలోని రైల్ నిలయంలో ఆయన్ని కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులు, సమస్యలు, నిధుల కేటాయింపు, రైల్వేస్టేషన్ల ఆధునీకరణ, కొత్త ప్లాట్‌ఫామ్‌ల ఏర్పాటు, పాతవాటి విస్తరణ, కోవిడ్‌కు ముందు రద్దు చేసిన రైళ్ల పునరుద్ధరణ, అదనపు హాల్టులతోపాటు పలు సమస్యలను సతీష్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. కాగా, అన్నిటిపై చైర్మన్ సానుకూలంగా స్పందించారని, ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని వద్దిరాజు స్పష్టం చేశారు.

అంతర్జాతీయ జూడో పోటీలకు అర్హత

వరంగల్ కార్పొరేషన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ లూయీస్ బ్రెయిలీ ఆదర్శ అంధుల పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ జూడో పోటీలలో పాల్గొనేందుకు అర్హత సాధించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో కమిషనర్ అశ్విని తానాజీ వాకడే జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఫిబ్రవరి 24 నుంచి 28 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో జరిగిన జాతీయస్థాయి పారా జూడో పోటీలలో వరంగల్ నుంచి 9 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. ఐదుగురు విద్యార్థులు సత్తా చాటి గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ మెడల్ సాధించారు. వీరు మే 8 నుంచి 16 వరకు కజకిస్థాన్‌లో జరిగే అంతర్జాతీయ పారా జూడో పోటీలలో పాల్గొంటారని పాఠశాల కరస్పాండెంట్ కల్యాణి తెలిపారు. విద్యార్థులు అంతర్జాతీయ స్థాయిలోనూ ప్రతిభ కనబరచాలని కమిషనర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో బల్దియా అదనపు కమిషనర్ జోనా, పాఠశాల కరస్పాండెంట్ కల్యాణి, మేనేజ్‌మెంట్ సభ్యులు మణిశంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

13న జాబ్‌మేళా

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగుల కోసం ఈ నెల 13వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.మల్లయ్య ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని అపోలో ఫార్మసీ కంపెనీలో సుమారు 20 ఉద్యోగాల ఎంపికకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ములుగురోడ్‌లోని ఐటీఐలో ఉదయం 11 గంటలకు జాబ్ మేళా ఉంటుందన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఫార్మసీ చదివిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయస్సు గల యువతీ యువకులు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 7893394393 సెల్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

భూ తగాదాలతోనే తల్లిని కడతేర్చిన తనయుడు

హత్య కేసులో నిందితుడి రిమాండ్



నిందితుడి అరెస్టు చూపిస్తున్న పోలీసులు

ఎల్కతుర్తి, మార్చి10 (ఆంధ్రజ్యోతి): ఆస్తి పంపకం చేయాలని తల్లితో వాగ్వాదానికి దిగిన తనయుడు ఆగ్రహంతో తల్లిని హత్యచేశాడు. ఈ మేరకు నిందితుడిని సోమవారం అదుపులోకి తీసుకొని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించామని ఎల్కతుర్తి సీఐ పులి రమేష్ తెలిపారు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం వీరనారాయణపూర్ గ్రామానికి చెందిన చదిలం రేవతి(42) - కుమారస్వామి దంపతులకు అజయ్, విజయ్ ఇద్దరు కుమారులు ఉన్నారు. అజయ్‌కు ఇటీవల వివాహం జరిగింది. తల్లి రేవతికి ఉన్న 30 గుంటల వ్యవసా భూమితోపాటు ఇల్లును ఇద్దరు కుమారులకు పంపకాలు చేయాలని అజయ్ పట్టుబట్టాడు. తల్లి రేవతికి కుమారుడు అజయ్‌లకు మధ్య ఈ నెల 7న పంపకాల విషయంలో తీవ్రస్థాయిలో ఘర్షణ చోటుచేసుకుంది. ఆవేశంతో రగిలిపోయిన కుమారుడు ఇంట్లో ఉన్న గొడ్డలి తీసుకొని తల్లి మెడపై బలంగా దాడిచేయడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అజయ్ అక్కడి నుంచి పారిపోయాడు. ఈ క్రమంలో సోమవారం ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పెట్రోలింగ్ చేస్తుండగా కోతులనడుమ గ్రామ శివారులో అజయ్ పట్టుబడ్డాడు. అతడిని అదుపులోకి తీసుకొని మృతురాలి చిన్న కుమారుడు విజయ్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ తరలించినట్లు సీఐ తెలిపారు.

మామునూరు ఎయిర్‌పోర్టు
భూ సర్వే పూర్తి

మామునూరు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అనేక కారణాలతో ఆగిన మామునూరు 253 ఎకరాల భూ సర్వేను ఐదు రోజుల పాటు సర్వే చేసిన రెవెన్యూ అధికారులు ఆదివారం నాటికి పూర్తి చేశారు. ఈ మేరకు ఖిలా వరంగల్ తహసీల్దార్ నాగేశ్వర్ రావు భూ సర్వే పూర్తయినట్లు తెలిపారు. ఇక సర్వే చేసిన 253 ఎకరాల భూసేకరణ ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు జరగనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

22 మంది పోలీస్ కానిస్టేబుళ్ల బదిలీ

వరంగల్ క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో విధులు నిర్వర్తిస్తున్న 22 మంది కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ సీపీ అంబర్ కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో బదిలీ కోసం 22 మంది ఆర్జీ పెట్టుకోగా బదిలీపై వెళ్తున్న క్రమంలో మరోసారి సీపీని 22 మంది కలిసి విన్నవించుకోగా ఈ నెల 9న బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

అవసరార్థులను ఆదుకునేందుకే లయన్స్

పీఎస్‌టీ సదస్సులో లయన్స్ క్లబ్ గవర్నర్ వెంకట్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ కె.వెంకటరెడ్డి

హనుమకొండ కల్చరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అవసరార్థులకు ఆపన్న హస్తంగా లయన్స్ సభ్యులు పని చేయాలని అంతర్జాతీయ లయన్స్ 320 ఎఫ్ జిల్లా గవర్నర్ కందూరు వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం రాత్రి కేఎల్ఎన్ కన్వెన్షన్ వేదికగా కంది రాజిరెడ్డి అధ్యక్షతన జరిగిన పీఎస్‌టీ హానరింగ్ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రోగ్రామ్ కమిటీ చైర్మన్ రేపూరి రమణారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాకు చెందిన 70 క్లబ్‌లకు పీఎస్‌టీ అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారిలతో పాటు ముఖ్య నాయకులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. ఈనెల 16న మడికొండలోని రెడ్డి కన్వెన్షన్ హాలులో ఉమ్మడి జిల్లాకు చెందిన 2000 మంది లయన్స్ ప్రతినిధులతో నిర్వహించే సంకల్ప నివేదితం జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. క్లబ్ నిర్వహణలో పీఎస్‌టీలు కీలకమని, యేటా ఉత్సాహవంతులైన సేవాతత్పరులను పీఎస్‌టీలుగా ఎన్నుకుంటే క్లబ్‌ల మనుగడ సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో వీడీజీలు డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, నరహరి సుధాకర్‌రెడ్డి, మాజీ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ వంగాల గోపాల్‌రెడ్డితో పాటు పీడీజీలు డాక్టర్ కె.సుధాకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, పొట్లపల్లి శ్రీనివాసరావు, కన్నా పరశురాములు, ముచ్చ రాజిరెడ్డి, డీసీఎస్ సయ్యద్ హబీబ్‌తోపాటు హనుమకొండ క్లబ్ అధ్యక్షులు కె.నిర్మల, కార్యదర్శి కోటిలింగం, కోశాధికారి కె.కిరణ్మయి పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి 76 క్లబ్‌లకు నాయకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కల్పించాలి

వరంగల్ జిల్లా రిజిస్ట్రార్ ఫణిందర్



సమావేశంలో మాట్లాడుతున్న ఫణిందర్

హనుమకొండ టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ఎల్ఆర్ఎస్ మాడ్యూల్ ఇంప్లిమెంటేషన్ విధానాన్ని ప్రభుత్వం తీసుకురావడం సంతోషదాయకమని, ఎల్ఆర్ఎస్ విధానాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ జిల్లా రిజిస్ట్రార్ డి. ఫణిందర్ అన్నారు. సోమవారం హనుమకొండలోని రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ 2020పై డాక్యుమెంటర్లకు, రియల్ ఎస్టేట్ వారికి, ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రిజిస్ట్రార్ డి.ఫణిందర్ మాట్లాడుతూ.. ఆన్‌లైన్ ద్వారా ఆస్తి వివరాలు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుతో పాటు తప్పులు లేకుండా చూసుకోవాలని అన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఆస్తి విలువ పత్రాలను జత చేయాలన్నారు. ఆస్తిని క్రయ విక్రయాలు చేసే వారు వారి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎల్ఆర్ఎస్ పోర్టల్‌ను ఆన్‌లైన్‌లో పొందుపర్చినట్లు ఇతర అంశాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు. మార్చి 31 వరకు 25 శాతం రాయితీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సబ్ రిజిస్ట్రార్లు శ్రీరాం నర్సింహారావు, ఆనంద్, సైదులు నాయక్, వెంకట్‌లాల్, గిరిధర్, సృజన్‌కుమార్, వి.ప్రభాకర్, రాంకుమార్, సీనియర్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ మార్కెట్ ధరలు

(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2211	2100
పల్లికాయ (సూక)	7160	6500
పల్లికాయ (పచ్చిది)	4800	4400
కందులు	6890	5540
పెసళ్లు	7524	4645
పత్తి	6960	5800
కొత్త పత్తి	-	-
పసుపు (కాడి)	7607	7522
పసుపు (గోల)	6565	6233
తేజ మిర్చి	13600	9000
డీడీ	12800	12500
వండర్‌హాట్	16600	11500
దీపిక	17000	15245
దేశీ	28000	25500
సింగిల్ పట్టి	39000	29000
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

ముగిసిన జిల్లాస్థాయి చెస్ టోర్నీ

వరంగల్ స్పోర్ట్స్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కమల్ కింగ్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో హనుమకొండ హంటర్‌రోడ్డులోని న్యూసైన్స్ పీజీ కళాశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి చెస్ టోర్నీ సోమవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ బాధ్యుడు డాక్టర్ బీవీ రాజగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెస్ క్రీడలో పాల్గొనడం ద్వారా మేధోసంపత్తి పెంపొం దుతుందన్నారు. క్రీడల్లో రాణించాలంటే పట్టుదల క్రమశిక్షణ ఎంతో అవసరమని తెలిపారు. కమల్ కింగ్ చెస్ అకాడమీ డైరెక్టర్ జి.రాంప్రసాద్ మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయిలో అండర్-5, 7, 9, 11, 13 బాలబాలికల విభాగాల్లో నిర్వ హించిన చెస్ టోర్నీలో 300 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. ఇందులో వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు సర్టిఫికెట్లను, బహుమ తులను ప్రదానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో న్యూసైన్స్ కళాశాల డైరెక్టర్లు డాక్టర్ బి. కొమురారెడ్డి, ఎస్.శ్రీనివాస్‌రెడ్డి, కమల్‌కింగ్ మేనేజింగ్ డైరెక్టర్ షేక్ సలీం, ఆర్బిటర్లు అన్వేష్, ఎం.డి. పర్వీన్, అశ్విని, శ్రీకాంత్, మణికంఠ, తపస్వి, నితీశ్‌కుమార్, మార్టిన్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...

వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ బస్టాండ్ సమీపంలోని సెంట్రల్ కాంప్లెక్స్ శ్రీహర్ష కన్వెన్షన్‌హాల్లో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా ఓపెన్ టూ ఆల్ చెస్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు సీనియర్ సివిల్ జడ్జ్ క్షేమదేశ్‌పాండే ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను చదువుతో పాటు క్రీడల్లో పాల్గొనే విధంగా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. చెస్ క్రీడా జీవితానికి దగ్గరగా ఉంటుందన్నారు. క్రీడల్లో గెలుపోటములని సమానంగా తీసుకున్నప్పుడే రాణిస్తామన్నారు. చెస్ క్రీడాపోటీల నిర్వాహకుడు కన్నా మాట్లాడుతూ.. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి ఓపెన్ టూ ఆల్ బాలబాలికల విభాగాల్లో నిర్వహించిన చెస్‌లో 80మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. అనంతరం విజేతలకు అతిథులు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్బిటర్లు సీహెచ్ శ్రీనివాస్, ప్రేమ్‌సాగర్, వైశాలి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందిస్తున్న అతిథులు, నిర్వాహకులు




కురవి మండలం రాజోలు జడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన మూత్రశాల

ఆలోచన అదిరింది.. సమస్య తీరింది

» విద్యార్థుల కోసం రూ.2 వేలతో మూత్రశాల తయారీ

» నూనె డబ్బాలు, పైపులతో రూపొందించిన పీఈటీ

అది కురవి మండలం రాజోలు జడ్పీహెచ్ఎస్ పాఠశాల.. మొత్తం 170 మంది విద్యార్థులున్నారు. వారిలో సుమారు 100 మంది అబ్బాయిలున్నారు. అయితే ఈ పాఠశాలలో మరుగుదొడ్లు ఉన్నా వాటిని విద్యార్థినులు ఉపయోగిస్తుండటంతో.. అబ్బాయిలు మూత్రవిసర్జన కోసం పాఠశాల బయటకు వెళుతుంటారు. ఈ క్రమంలో వారు మళ్లీ పాఠశాలలోకి సమయానికి రాకుండా బయట కాలక్షేపం చేస్తుండటంతో పాటు బహిరంగ మూత్ర విసర్జన చేయడంపై సమీపంలోని ఇళ్లవారు తరచూ అభ్యంతరం వ్యక్తం చేస్తుండటం లాంటివి జరుగుతున్నాయి. పరిస్థితిని గమనించిన పాఠశాలలోని క్రీడా ఉపాధ్యాయుడు పిల్లి కాశీనాథ్ ఓ ఆలోచన చేశారు. అతి తక్కువ ఖర్చుతో పాఠశాలలోనే ఓ మూత్రశాలను ఏర్పాటు చేసి ఔరా అనిపించారు. అధికారులద్వారా నిధులు మంజూరై శాశ్వత మూత్రశాలల నిర్మాణం జరగాలంటే చాలా సమయం పడుతుండటంతో తానే స్వయంగా ఓ మూత్రశాలను నెలకొల్పాడు. ఐదు లీటర్ల నూనె డబ్బాలు పది సేకరించి.. వాటిని తలక్రిందులుగా కట్‌చేసి విద్యార్థులు మూత్రం పోసేందుకు అనువుగా ఉండే ఎత్తులో సైజుల వారీగా అమర్చాడు. పాఠశాలలో స్టోర్ రూంలో పడేసిన నాలుగు పాత పైపులను తెచ్చి.. దానికి నూనె డబ్బాలకు అమర్చారు. విద్యార్థులు పోసిన మూత్రం పైపుల ద్వారా బయటకు వచ్చేలా చేశాడు. ఇక కింది భాగంలో సిమెంట్‌తో





పీఈటీ కాశీనాథ్

ఫ్లోరింగ్ చేసి.. పాఠశాలలో పనికి రాకుండా ఉన్న రేకులను వాటి చుట్టూ అమర్చి మూత్రశాలను తయారు చేశారు. ఇందుకోసం ఆయన కేవలం రూ.2 వేలను ఖర్చు చేశారు. ఇక ఇటీవల ఈ పాఠశాలను డీఈవో రవీందర్‌రెడ్డి సందర్శించిన సమయంలో కాశీనాథ్ తయారు చేసిన మూత్రశాలలను చూసి అభినందించారు.

- కురవి, ఆంధ్రజ్యోతి

రామయ్య కల్యాణానికి తలంబ్రాలు

ఖానాపురంలో సిద్ధమవుతున్న కో(గో)టి తలంబ్రాలు

భద్రాద్రి సీతారాములకు సమర్పించనున్న భక్తులు



గోటి తలంబ్రాలను సిద్ధం చేస్తున్న భక్తులు

ఖానాపురం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సీతారాముల కల్యాణం అంటే సాక్ష్యాత్తు లోక కల్యాణమే.. ఎక్కడెక్కడి నుంచో భద్రాచల రాముల వారి కల్యాణానికి భక్తులు తరలివస్తారు. ఈ కల్యాణానికి ఎంతటి ఖ్యాతి ఉందో ఆ కల్యాణంలో వినియోగించే గోటి తలంబ్రాలకు అంతే ప్రత్యేకత ఉంది. ఆ కల్యాణ వేడుకల్లో ఆ తలంబ్రాలను తాకితే ఎంతో పుణ్యమని భావిస్తారు భక్తులు. అటువంటి ఆ జానకీరాముల కల్యాణానికి వినియోగించే కోటి గోటి తలంబ్రాలను స్వయంగా తయారు చేస్తూ భక్తి పారవశ్యంతో మునిగితేలుతున్నారు వరంగల్ జిల్లా ఖానాపురం వాసులు.

సీతారాముల కల్యాణ మహోత్సవంలో పవిత్రంగా భావించే తలంబ్రాలు, పసుపు, ముత్యాలు, ధాన్యాలు వినియోగిస్తారు. వీటిలో వినియోగించే ఒక్కో వస్తువుకు ఓ ప్రత్యేకత ఉంటుంది. పసుపు సకల శుభాలకు దీపికగా, ముత్యాలు కల్మషంలేని మనస్సుతో ఆనందంగా జీవించాలని ప్రతీకగా, ఇక ధాన్యం ధన ధాన్యాలతో సరితూగాలని భావనగా ఉంటుంది. ఇంతటి విశిష్టత కలిగినవి జగత్ కల్యాణంగా భావించే భద్రాచలం సీతారాముల కల్యాణ మహోత్సవంలో దేవతామూర్తుల శిరస్సు నుంచి జాలువారేలా తలంబ్రాలు పోస్తారు. అటువంటి కల్యాణోత్సవంలో గోటితో ఒలిచిన తలంబ్రాలను వినియోగిస్తారు.

గోటి తలంబ్రాలు

శ్రీరామ నవమి రోజు భద్రాచలంలో జరిగే సీతారామచంద్రస్వామి కల్యాణంలో ఉపయోగించే తలంబ్రాలకు ప్రత్యేకత ఉంటుంది. వడ్ల గింజలను రోలులో దంచడంగాని లేక మిల్లులో మరపట్టించినవీ కావు. ఆలయంలో మహిళలు, భక్తులు చేతిగోళ్లతో ఒక్కొక్క ధాన్యపు గింజను ఒలిచి బియ్యంగా తయారు చేస్తారు. వీటినే గోటి తలంబ్రాలు అంటారు. రాములోరి కల్యాణంలో వినియోగించే గోటి తలంబ్రాలు సిద్ధం చేసే అరుదైన అవకాశం మండల కేంద్రంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో భక్తులకు దక్కింది. కల్యాణ వేడుకలలో తలంబ్రాలను తాకితేనే ఎంతో పుణ్యమని భావిస్తారు భక్తులు. అయితే సాక్షాత్తు ఆ జానకీరాముడి కల్యాణానికి వినియోగించే గోటి తంలంబ్రాలను సిద్ధంచేసే మహత్తర కార్యక్రమంలో ఖానాపురం వాసులు కొన్నేళ్లుగా భాగస్వాములు అవుతున్నారు. ఆలయ చైర్మన్ గొల్లపుడి సుబ్బారావు, ఆలయ అర్చకుడు పర్వతపు శివప్రసాద్ శాస్త్రీ ఆధ్వర్యంలో భక్తులు మూడు నెలలుగా నిత్యం గోటితో వడ్లను ఒలిచి తలంబ్రాలను సిద్ధంచేస్తున్నారు. స్వామివారి సేవలో పునీతులవుతూ భక్తి భావాన్ని చాటుకుంటున్నారు.



సీతారామచంద్రస్వామి ఆలయం

పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాం..



పర్వతపు శివప్రసాద్ శాస్త్రి, ఆలయ అర్చకుడు

భద్రాద్రిలో జరిగే సీతారాముల కల్యాణానికి ఉపయోగించే గోటి తలంబ్రాలను అందించే అవకాశం కలగడం పూర్వ జన్మ సుకృతమే. ఈ మహా సంకల్పంలో భక్తులు భాస్వాములు కావడం ఆనందంగా ఉంది. భగవంతుడికి సేవచేయడం వల్ల అందరికీ మంచి జరుగుతుంది.

ధన్యులమయ్యాం..



జి. సుబ్బారావు, ఆలయ కమిటీ చైర్మన్

రాములవారి కల్యాణంలో ముఖ్యమైన ఘట్టం తలంబ్రాలు. ఈ అక్షింతలకు కోటి తలంబ్రాలుగా చెబుతారు. గోటి తలంబ్రాల కార్యక్రమంలో భాగస్వాములైనందుకు ధన్యులమయ్యాం.

మినీ తిరుపతి.. ఇంద్రకీలాద్రి

• భక్తుల కొంగు బంగారం శ్రీనివాసుడు • రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

• 14న వేంకటేశ్వరుడి కల్యాణోత్సవం • నర్సింపహులపేటలో ఆధ్యాత్మిక సందడి

నర్సింహులపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : మినీ తిరుపతిగా ప్రఖ్యాతి పొందిన నర్సింహులపేట మండల కేంద్రంలోని ఇంద్రకీలాద్రి పర్వతంపై కొలువుదీరిన పద్మావతి, అలివేలు మంగమ్మ సహిత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ తరుణంలో ఆలయ పరిసరాలు బ్రహ్మోత్సవాల శోభను సంతరించుకున్నాయి. భక్తుల కొంగుబంగారంగా వేంచేసిన శ్రీనివాసుడు సన్నిధికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు. మార్చి 14న నిండు పౌర్ణమి హోలీ రోజున జరిగే స్వామి వారి కల్యాణోత్సవానికి మండలం నుంచే కాకుండా ఉమ్మడి ఖమ్మం, నల్లగొండ, ఉమ్మడి వరంగల్ జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలిరానున్నారు. ఈ ఆలయానికి ఓ పురాణగాథ ఉంది. ఒకరోజు సంధ్య సమయంలో కొందరు పశువుల కాపరులు చూస్తుండగా సుమారు ఎనిమిదేళ్ల వయస్సు గల బాలుడు దిగంబరంగా ఇంద్రకీలాద్రి పర్వతంపైకి పరుగెత్తినట్టుగా, అక్కడ అదృశ్యమయ్యాడని, అంతలోనే కారుచీకట్లు కమ్ముకున్నాయని, ఆ పశువుల కాపరులు గ్రామానికి వెళ్లి గ్రామస్తులకు జరిగిన విషయాన్ని చెప్పారట. అదేరోజు రాత్రి గ్రామంలో చిన్నపిల్లలు పాలకోసం తపించి ఎవరూ పాలు తాగకపోవడం, చెట్లు ఊగకుండా ప్రకృతి అంతా స్తంభించడం, నిద్రలో ఉన్నవారు కలవాటుకు గురవడం, ప్రజలంతా తావులేక భూమిని పట్టుకున్నట్లు, వెయ్యి ఏనుగులు ఒకేసారి గ్రామంపై పడినట్లు, ఇంద్రకీలాద్రి పర్వతంపై నుంచి దిగంబర బాలుడు



ఆలయంలో స్వామివారు



ఇంద్రకీలాద్రి పర్వతంపై వెంకటేశ్వరస్వామి ఆలయం

పరుగెత్తిన మార్గం గుండా రబ్బరు బంతుల మాదిరిగా సుమారు మూడు కిలోమీటర్ల వరకు విస్తరించినట్టు ఒక కథ ప్రచారంలో ఉన్నది. అయితే నాడు వెలువడిన శబ్దాలకు చుట్టుపక్కల ప్రజలు వేలాదిగా అక్కడకు తరలివచ్చి తర్జన భర్జన పడుతున్న సమయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి తన మహిమతో అక్కడే ఉన్న ఒక బాలికకు పూనకం రూపంలో వచ్చిన తాను సర్పాకారంలో స్వయంశక్తి స్వరూపుడుగా భక్తులను తరింపచేయడానికి అవతరించానని తన అంతర్యాన్ని తెలియజేసినట్లు చెబుతారు.

బ్రహ్మోత్సవాల షెడ్యూల్..

మార్చి 12న పాల్గుణ త్రయోదశి రాత్రి 8 గంటలకు తొళక్కంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండగా, 13న బిందెతీర్థం ప్రాబోధిత ప్రబంధసేవాకాలం, పరమపదోత్సవం, తీర్థప్రసాదం గోష్టి, 14న విశ్వక్సేనారాధన పుణ్యాహచనం, అంకురార్పణం, బేరీపూజ, దేవతారోహనం, హోమం బలిహరణం తర్వాత రాత్రి 8 గంటలకు స్వామివారి కల్యాణం. 15న హోమం బలిహరణం, పురవీధి సేవ, సదస్యం, తీర్థప్రసాదగోష్టి, 16న పూర్ణాహుతి, ద్వజపట ఉద్వాసన, పుష్పయాగం, ఏకాంతసేవ, మహాదాశీర్వచనంతో ఉత్సవాలు ముగింపు జరగనుంది.

దక్కని అవకాశం.. నేతల్లో అంతర్మథనం!

(5వ పేజీ తరువాయి)

వారి వర్గీయుల్లో ఆందోళన వ్యక్తం అవుతుంది. తమతమ నేతలకు పెద్దల సభకు వెళ్లే అవకాశాలు కల్పించకపోవడం వెనుక ఏం జరిగి ఉంటుందా అంటూ చర్చించుకుంటున్నారు. అయితే ఓరుగల్లు మూలాలు ఉన్న సినీనటి విజయశాంతికి అనూహ్యంగా ఎమ్మెల్సీ పదవి దక్కటం కాంగ్రెస్ శ్రేణుల్లో కొంత ఊరటగా భావిస్తున్నారు. విజయశాంతి ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం రామన్నగూడెం తమ సొంత గ్రామంగా చెప్పుకొన్నారు. దీంతో ఎవరూ ఊహించని విధంగా రాములమ్మగా పిలుచుకునే విజయశాంతికి ఎమ్మెల్సీగా పదవి రావటం ఓరుగల్లువాసుల్లో హర్షం వ్యక్తం అవుతుంది.

మారిందా?

ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, కీలక నేతల మధ్య అనైక్యతే ఒక్కరికి కూడా ఎమ్మెల్సీ పదవి రాకుండా అడ్డుపడిందనే చర్చ జరుగుతోంది. కాంగ్రెస్‌లో మొదటి నుంచి మంత్రి సురేఖతో కొంతమంది ఎమ్మెల్యేలకు విభేదాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే మంత్రి సురేఖ భర్తకు ఎమ్మెల్సీ టికెట్ రాకుండా కాంగ్రెస్‌లోని ఓ వర్గం అధిష్ఠానంపై ఒత్తిడి తెచ్చిందనే చర్చ జరుగుతోంది. అంతేకాకుండా కొత్త పేర్లను తెరపైకి తీసుకవచ్చి, వారికి టికెట్ ఇవ్వాలని ఒత్తిడి తెచ్చారని సమాచారం. ఉమ్మడి జిల్లా నేతల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో ఒక వర్గానికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి.. మరో వర్గాన్ని దూరం చేసుకోవడం ఎందుకని, పార్టీ వరంగల్ నేతల పేర్లను పరిగణనలోకి తీసుకోలేదనే చర్చ ఉంది. ఇదే అనైక్యత పార్టీలో ఉంటే టీపీసీసీలో పదవులతో పాటు జిల్లా కాంగ్రెస్ కమిటీల్లోనూ ఆధిపత్య పోరుతో ఎవరికి పదవులు రావనే చర్చ జరుగుతోంది. టీపీసీసీలో పదవి కోసం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రయత్నాలు చేస్తున్నారు. ఇటీవల ఏఐసీసీ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌తో స్వయంగా రాజేందర్‌రెడ్డితో భేటీ అయ్యారు. పార్టీ నుంచి ఏం ఆశిస్తున్నారని నాయినిని ప్రశ్నించినట్టుగా తెలిసింది. తనకు ప్రభుత్వంలో పదవులకంటే పార్టీలోనే రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి కావాలని కోరినట్లుగా ప్రచారం జరుగుతోంది.

అనైక్యతే పదవికి అడ్డుగా

నాయినితో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ఇద్దరు ఎస్సీ, ఒకరు ఎస్టీ, ముగ్గురు ఓసీ సామాజిక వర్గాలకు చెందిన నేతలు సహా మొత్తం ఎనిమిది మందిని మీనాక్షి నటరాజన్ వ్యక్తిగతంగా కలుసుకుని పార్టీ, ప్రభుత్వ పదవులపై ఆరా తీశారు. అంతేకాకుండా వీరిలో పార్టీ కోసం పని చేసినవారు, త్యాగాలు చేసిన వారు ఎవరెవరున్నారో ఆరా తీసి ఓ నివేదిక తయారు చేసినట్టు సమాచారం. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో కాంగ్రెస్ నేతల మధ్య అనైక్యత ఇలాగే కొనసాగితే పార్టీలో ఎవరికి కూడా కీలకమైన పదవులు వచ్చే అవకాశం ఉండదనే చర్చ పార్టీ క్యాడర్‌లో కొనసాగుతోంది. ఇప్పటికే ఎమ్మెల్సీ సీటు వరంగల్ నేతలకు దక్కకపోవటంతో నారాజ్‌గా ఉన్న నేతలు పదవులు కూడా రాకుంటే, పార్టీలో వరంగల్ ప్రాధాన్యం తగ్గుతుందనే చర్చ జరుగుతోంది.

గులాబీ, కామ్రేడ్లకూ షాకే...

శాసనసభలో ఉన్న బలబలాల దృష్ట్యా బీఆర్ఎస్‌కు ఒక ఎమ్మెల్సీ పదవి దక్కుతుంది. అయితే పలు సమీకరణల నేపథ్యంలో ఆ ఒక్క సీటు కూడా ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నేతకే దక్కుతుందన్న ఆశల్లో ఉన్నారు. ఇక ఈ నెల 27వ తేదీతో ఎమ్మెల్సీ పదవీకాలం ముగుస్తున్న మహబూబాబాద్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి సత్యవతిరాథోడ్‌కు గులాబీ పార్టీ మరో అవకాశం ఇస్తుందనే ప్రచారం జరిగింది. ఇటీవలే ఆమెను శాసనమండలిలో పార్టీ విప్‌గా నియమించారు. దీంతో పదవీకాలం పూర్తవుతున్న సమయంలో విప్‌గా నియమించటంతో.. మరోసారి ఎమ్మెల్సీగా అవకాశం వచ్చినట్లేనని భావించారు.

చివరి నిమిషం వరకు కూడా సత్యవతిరాథోడ్ పేరు వినిపించినా అనూహ్యంగా నల్లగొండ జిల్లాకు చెందిన బీసీ నేత దాసోజు శ్రావణ్‌కుమార్‌కు ఎమ్మెల్సీ సీటు ఖరారు చేయటంతో ఓరుగల్లు గులాబీ నేతలు డీలా పడ్డారు. ఇక మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేరు కూడా ప్రముఖంగా వినిపించినప్పటికి కుల సమీకరణలో ఎర్రబెల్లికి కూడా పదవి అందకుండా పోయిందని తెలుస్తోంది. అలాగే పొత్తులో భాగంగా సీపీఐకి కాంగ్రెస్ ఒక ఎమ్మెల్సీ సీటును కేటాయించింది. అయితే వరంగల్‌కు చెందిన ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావుకు దక్కుతుందని కామ్రేడ్లు భావించారు. చివరకు సీపీఐకి కేటాయించిన ఆ సీటు కూడా నల్లగొండ నేతనే వరించటంతో ఓరుగల్లు కామ్రేడ్లకు నిరాశ మిగిలింది. మొత్తానికి కొద్దికాలంగా ఎమ్మెల్సీ సీటుపై గంపెడాశలు పెట్టుకున్న నేతలకు ఆయా పార్టీల అధిష్ఠానాలు ఝలక్ ఇవ్వడంతో ఇటు నేతలు, అటు క్యాడర్ అంతర్మథనంలో పడ్డారు.



కల్యాణోత్సవానికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

కల్యాణం.. కమనీయం

వైభవంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం

గీసుగొండ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కొమ్మాల లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభ వంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా తొలుత ఉత్సవమూర్తులకు హనుమత్ సేవ, నిత్యవిధి హోమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. కాగా, సోమవారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవాన్ని తిలకిం చేందుకు జిల్లా నలుమూల నుంచి భక్తులు పెద్దసం ఖ్యలో తరలివచ్చారు. ఆలయ గుట్టపై నుంచి ఉత్సవ మూర్తులైన లీలాదేవి, భూదేవి, లక్ష్మీనరసింహస్వామివా రిని పల్లకీలో ఆలయ దిగువన ఉన్న కల్యాణ మండపానికి వేదమంత్రోచ్చరణలతో తీసుకువచ్చారు. భక్తి పారవశ్యంతో పల్లకీని మోసేందుకు భక్తులు పోటీ పడ్డారు. కొమ్మిడి వంశస్థులు అమ్మవార్లకు తలంబ్రాలు, తాళిపుస్తె, మట్టెలు తీసుకువచ్చారు. మాంగళ్యధారణ సమయంలో భక్తులు చేసిన గోవిందా నామస్మరణలో మిన్నంటాయి. కాగా, ఉత్సవమూర్తులకు ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి పట్టువస్త్రాలను సమర్పించి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో అద్దంకి నాగేశ్వర్‌రావు, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, రామాచార్యులు, విష్ణుచార్యులు, ఫణీంద్రాచార్యులు, సీఐ మహేందర్, నాయకులు చాడా కొమురారెడ్డి, మాజీ ఎంపీపీ భీముగాని సౌజన్య, తుమ్మనపెల్లి శ్రీనివాస్, ఉత్సవ కమిటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.






స్వామి వారి కల్యాణానికి హాజరైన భక్తులు

నేటి నుంచి ఫాతిమామాత ఉత్సవాలు

» రాష్ట్రవ్యాప్తంగా హాజరు కానున్న క్రైస్తవులు » భారీ ఏర్పాట్లలో కేథడ్రల్ చర్చి ఆవరణ

» ఉత్సవాలు విజయవంతం చేయాలి : బిషప్ ఉడుముల బాల



ఫాతిమా కేథడ్రల్ చర్చి

కాజీపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): యేటా మార్చిలో నిర్వహించే ఫాతిమామాత ఉత్సవాలు ఈ నెల 11, 12, 13 తేదీలలో జరుపుకునేందుకు హనుమకొండ జిల్లా కాజీపేటలోని ఫాతిమా కేథడ్రల్ చర్చి ముస్తాబైంది. 72 ఏళ్లుగా నిర్వహించే ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే విశ్వాసులకు క్రైస్తవ మత బోధకులు ప్రత్యేక స్వస్థత ప్రార్థనలు చేయనున్నారు. ఇందులో భాగంగా మరియమాతకు ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఫాతిమామాత ఉత్సవాల సందర్భంగా వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తుల కోసం ఫాతిమా కేథడ్రిల్ ప్రాంగణం భారీలో ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీటి సౌకర్యం, పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

మూడు రోజుల పాటు ఉత్సవాలు

ఉత్సవాల్లో భాగంగా 11వ తేదీ మంగళవారం వివాహితులకు రజతోత్సవాల ప్రత్యేక పూజలు, స్వర్ణ జూబ్లీ వేడుకలు, దంప తుల వాగ్దాన నూతనీకరణ కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం కుటుంబాల సంరక్షణ అంశంపై బిషప్ డాక్టర్ ఉడుముల బాల దివ్యబలి పూజ చేయనున్నారు. 12వ తేదీ మహోత్సవ పూజ ఉంటుంది. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటలకు ప్రత్యేక ప్రార్థనలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. సాయంత్రం 5.30 నిమిషాలకు పురవీధులలో ఫాతిమామాత స్వరూపంతో మహారథ యాత్ర నిర్వహించనున్నారు. 13వ తేదీ చివరి రోజు గురువారం సాయంత్ర 6.30నిమిషాల నుంచి ప్రత్యేక ప్రార్థనలు ఉంటాయి. కాగా, ఈ ఉత్సవాలను విజయవంతం చేయాలని బిషప్ ఉడుమల బాల కాజీపేట మీడియా పాయింట్‌లో జరిగిన మీడియా సమావేశంలో కోరారు. అనంతరం ఉత్సవ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఓరుగల్లు పీఠం ఫాదర్‌లు పాల్గొన్నారు.

చర్చి ప్రాశస్త్యం

ఫాతిమా కేథడ్రల్ చర్చి భక్తులకు క్రీస్తు వరాలకు, స్వస్థతలకు నిలయంగా నిలుస్తోంది. పోర్చుగల్ దేశం నుంచి ఫాతిమామాత స్వరూపం విగ్రహం కొలువై ఉన్న ఆలయమే ఫాతిమా కేథడ్రల్ చర్చి. నాటి నుంచి నేటివరకు ఆ ప్రాంగణంలో రోగులకు స్వస్థత ప్రార్థనలు, మానసిక వేదనలు అనుభవించే వారిని దీవిస్తూ ప్రార్థనా వాతావరణంలో కనుల పండుగగా జరుపునే ఉత్సవమే ఫాతిమామాత ఉత్సవం.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బిషప్ ఉడుముల బాల

నేడు కొండపర్తికి గవర్నర్

» దత్తత గ్రామానికి రానున్న జిష్ణుదేవ్ వర్మ

» అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

» గ్రామస్థులతో సమావేశం.. అనంతరం సమ్మక్క, సారలమ్మల దర్శనం

» పటిష్ఠ ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం

ములుగు, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ గతేడాది ఆగస్టులో ములుగు పర్యటనకు వచ్చిన సందర్భంగా రాష్ట్రమంత్రి ధనసరి అనసూయ సీతక్క విజ్ఞప్తికి స్పందించి తాడ్వాయి మండలంలోని కొండపర్తి గ్రామాన్ని దత్తత తీసుకున్నట్టు ప్రకటించిన విషయం తెలిసిందే. అనంతరం ఆ ఊరి అభివృద్ధికి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈక్రమంలో పనులు పూర్తికాగా మంగళవారం గవర్నర్ వాటిని ప్రారంభించేందుకు అడవిపల్లె కొండపర్తికి రానున్నారు. గ్రామస్తులతో సమావేశమవుతారు. తర్వాత మేడారం సమ్మక్క, సారలమ్మ, వనదేవతల గద్దెలను దర్శించుకోనున్నారు. ఇందుకోసం జిల్లా అధికారులు పటిష్ఠ ఏర్పాట్లు చేశారు. గవర్నర్ స్పందనతో కేవలం 79గడపలు, 370 జనాభా కలిగిన అటవీ గ్రామమైన కొండపర్తి రూపురేఖలు మారిపోయాయి. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వా డీలకు నూతన భవనాలు నిర్మించారు. డిజిటల్ బోధనను అమలు చేస్తున్నారు. మహిళలు, నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన కోసం మసాలా తయారీ, టైలరింగ్, నైపుణ్య శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆదివాసీ రైతుల వ్యవ సాయ అవసరాల కోసం బోరు మోటారును అందుబాటు లోకి తెచ్చారు. మరుగుదొడ్లు, అంతర్గతరోడ్లు, తాగునీటి వసతిని మెరుగుపర్చారు. సోలార్ వీధి దీపాలను ఏర్పాటు చేశారు. అందరికీ ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇండ్లను మంజూరు చేశారు.

కొండపర్తిలో ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామంలో ముమ్మర ఏర్పాట్లు చేశారు. అదనపు కలెక్టర్‌లు మహేందర్‌జీ, సంపత్‌రావు, ఇతర జిల్లా అధికారులతో కలిసి సోమవారం రాత్రి గ్రామానికి వెళ్లిన కలెక్టర్ టీఎస్.దివాకర ఏర్పాట్లను పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. కొండపర్తిని తమ ఆధీనంలోకి తీసుకున్న పోలీసులు బందోబస్తును కట్టుదిట్టం చేశారు. ఎస్పీ పర్యవేక్షణలో భద్రతా ఏర్పాట్లు చేశారు.



కొండపర్తిలో నిర్మించిన నైపుణ్య శిక్షణ కేంద్రం

గవర్నర్ పర్యటన జరగనుందిలా..

గవర్నర్ ములుగు జిల్లా పర్యటన షెడ్యూల్‌ను అధికారులు విడుదల చేశారు. మంగళవారం ఉదయం రాజ్‌భవన్ నుంచి ఉదయం 8గంటలకు రోడ్డుమార్గాన బయలుదేరి 10:30 గంటలకు ములుగుకు చేరుకుంటారు. గట్టమ్మ సమీ పంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో కొద్దిసేపు సేద తీరుతారు. 11:15గంటలకు తాడ్వాయి మండలం కొండపర్తికి చేరుకుంటారు. అభివృద్ధి పనులను ప్రారంభించిన తర్వాత గ్రామస్థులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 12:45 గంటలకు మేడారం వెళ్తారు. సమ్మక్క, సారలమ్మ గద్దెలను దర్శించుకుంటారు. స్థానిక ఐటీడీఏ అతిథి గృహంలో భోజనం చేసిన తర్వాత 2:30 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్తారు.

నేత్రదానం

హసన్‌పర్తి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : 66వ డివిజన్ కేంద్రానికి చెందిన మీసరకొండ నర్సయ్య(70) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి భార్య వెంకటలక్ష్మి, కుమారులు కుమారస్వామి, సాంబయ్య, రమేష్, యుగంధర్, కూతుళ్ల రమ, రజితలు నేత్రదానానికి ముందుకు వచ్చారు. దీంతో తెలంగాణ నేత్ర అవయవ శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల సిబ్బంది ప్రసాద్, నేత్ర సేకరణ నిపుణులు ప్రదీప్‌లు నర్సయ్య నేత్ర(కార్నియా) సేకరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ హనుమకొండ ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి ఆధ్వ ర్యంలో మృతుడి కుటుంబ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపి సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ హనుమకొండ, వరంగల్ అధ్యక్షుడు పరికిపండ్ల వేణు, కోన్‌రెడ్డి మల్లారెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



నర్సయ్య నేత్రాలను సేకరిస్తున్న ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల సిబ్బంది

సీసీరోడ్డు పనులు ప్రారంభం



నాగారంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న గ్రామస్థురాలు

హసన్‌పర్తి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగారంలో సీసీ రోడ్డు పనులను సోమవారం ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సందరాజు సంతోష్, వట్టి శ్రీనివాస్‌రెడ్డి, రామంచ దయాకర్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో వైకుంఠధామం నిర్మించాలి

హసన్‌పర్తి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): హసన్‌పర్తిలో వైకుంఠ ధామం నిర్మించాలని 66వ డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్ సోమవారం గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ గ్రీవెన్స్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రస్తుత హనుమకొండ జిల్లా కలెక్టర్ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసినప్పుడు హసన్‌పర్తి వైకుంఠధామ స్థలాన్ని పరిశీలించారని తెలిపారు. 2023లో రూ.కోటితో వర్క్ అగ్రిమెంట్ చేసి ఇప్పటి వరకు వైకుంఠధామం పనులు ప్రారంభం కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత పెద్ద జనాభా కలిగిన డివిజన్‌కు ఉమ్మడి శ్మశాన వాటిక లేక డివిజన్ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇప్పటికైనా కార్పొరేషన్ కమిషనర్ తక్షణమే స్పందించి ఈ మార్చి బడ్జెట్‌లో పట్టణ ప్రగతిలో మంజూరి చేసిన నిధులతో వైకుంఠ ధామం పనులు ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ప్రజావాణిలో 90 దరఖాస్తుల స్వీకరణ

వరంగల్ కార్పొరేషన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : బల్దియా ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహనగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. నగర ప్రజలకు అందించాల్సిన మౌలిక సదుపాయాలపై అధికారులు చొరవ చూపాలని అన్నారు. టౌన్ ప్లానింగ్‌పై చాలా ఫిర్యాదులు అందుతున్నాయని, అధికారులు సమస్యలపై శ్రద్ధ వహించాలని అన్నారు. రానున్న వేసవిలో మంచినీటి సమస్య రాకుండా ఇంజనీరింగ్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 90 ఫిర్యాదులు స్వీకరించినట్టు కమిషనర్ వెల్లడించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 66 డివిజన్లలో నివసిస్తున్న ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రతీ సోమవారం

ఫిర్యాదులు	
ఇంజనీరింగ్	23
హెల్త్, శానిటేషన్	10
ప్రాపర్టీ ట్యాక్స్ రెవెన్యూ	11
టౌన్ ప్లానింగ్	38
తాగునీటి సరఫరా	07
హార్టికల్చర్	01
మొత్తం	90



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్

నిర్వహించే గ్రీవెన్స్‌కు హాజరై సమస్యలు చెప్పుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఈసంపెల్లి జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, డీఎఫ్‌వో శంకర్‌లింగం, హెచ్‌వో లక్ష్మారెడ్డి, ఇన్‌చార్జ్ సీపీ రవీంద్ర రాడేకర్, పన్నుల అధికారి వై.రామకృష్ణ, వివిధ విభాగాల వింగ్‌అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వీకరించిన ఫిర్యాదులు ఇలా..

- వరంగల్ శంభునిపేట రాజేంద్రనగర్‌లో ప్రభుత్వ సూచనల మేరకు 20 ఫీట్ల రోడ్డును వదిలి వేసి ఇండ్లను నిర్మించుకున్నాం. కానీ, ఇటీవల కొందరు భూకబ్జాదారులు రోడ్డును ఆక్రమించి ఇండ్ల నిర్మాణం చేసుకున్నారని కాలనీవాసులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. వెంటనే వారు జరిపిన కట్టడాలను కూల్చి వేయాలని కోరారు.
- 3వ డివిజన్ పైడిపెల్లిలో సర్వే నెంబర్ 704లో ప్రభుత్వ భూమితో పాటు గొలుసుకట్టు పానాది రోడ్డును కొందరు వ్యక్తులు ఆక్రమించుకుంటున్నారని గ్రామస్తులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. అక్రమంగా అనుమతులు పొంది ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారని, అధికారులు స్పందించి ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా చూడాలని కోరారు.
- గ్రేటర్ 16వ డివిజన్ కోటిలింగాల గుడి ప్రాంతంలో చాలా కాలంగా డ్రైనేజీ కాలువ నిర్మాణం లేదు. అంతే కాకుండా మంచినీటి పైప్‌లైన్ లేకపోవడం వల్ల ఇక్కడి ప్రజలకు చాలా ఇబ్బందిగా మారిందని కాలనీవాసులు కమిషనర్‌ను కోరారు. ఇంజనీరింగ్ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా స్పందించి పైప్‌లైన్ వేయాలని ప్రజలు కోరుతున్నారు.
- హసన్‌పర్తితో పాటు 66వ డివిజన్‌లో 16 శ్మశాన వాటికలు ఉన్నాయి. అక్కడ ప్రజలకు కావలసిన కనీస సౌకర్యాలు లేవని స్థానిక కార్పొరేటర్ శివకుమార్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు. శ్మశానవాటికల నిర్మాణం కోసం గతంలో నిధులు మంజూరైనా అధికారులు పనులు చేయడం లేదని, ఇప్పటికైనా స్పందించాలని కార్పొరేటర్ కోరారు.

ఈవీఎం స్ట్రాంగ్‌రూమ్‌లను తనిఖీ చేసిన కలెక్టర్



ఈవీఎంలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న హనుమకొండ జిల్లాకు సంబంధించిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు(ఈవీఎంలను) జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య సోమవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్‌రూమ్‌ల వద్ద ఏర్పాటు చేసిన భద్రత, సీసీ కెమెరాలు, రికార్డుల నిర్వహణ, తదితర రికార్డులను తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 3నెలల కోసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఈవీఎంలను తనిఖీ చేసినట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. కలెక్టర్ వెంట హనుమకొండ ఆర్డీవో, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రం సందర్శన

హనుమకొండ సుబేదారిలోని కాకతీయ బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ పి.ప్రావీణ్య సందర్శించారు. ఈ సందర్భంగా పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలో పరీక్ష జరుగుతున్న తీరును కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల సంఖ్య వివరాలను, పరీక్షల నిర్వహణకు సంబంధించి తెలుసుకున్నారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

ఆర్ట్స్ కళాశాలలో సావిత్రిబాయి పూలే వర్ధంతి



సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : సావిత్రిబాయి పూలే 128వ వర్ధంతిని పురస్కరించుకొని హనుమకొండలోని ఆర్ట్స్ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.జ్యోతి సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. సావిత్రిబాయి మహిళల విద్య కోసం తన జీవితాన్ని త్యాగం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా రమేష్, అధ్యాపకులు కర్ణాకర్, శేషు, స్వామి, నహిదా పర్వీన్, గిరిప్రసాద్, మాధవి, నర్సయ్య, లక్ష్మీనారాయణ, వెంకట్, జ్యోష్న, శ్రీదేవి, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగట్టు జాతర విజయవంతానికి సమన్వయం కీలకం

▸▸ కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్

హసన్‌పర్తి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగట్టు జాతర విజయవంతానికి అన్ని శాఖల అధికారుల సమన్వయం కీలకమని కేయూ ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్ అన్నారు. సోమవారం మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాస్ రోడ్డులోని వెంకటేశ్వర స్వామి జాతర ప్రాంగణాన్ని ఆయన సందర్శించి జాతర బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆలయ ఈవో వెంకట్రావ్ సమక్షంలో జాతర సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. ఈ నెల 14 నుంచి 18వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జాతరకు వచ్చే భక్తులకు అన్ని శాఖల అధికారుల సహాయ సహకారాలు అందించాలన్నారు. విద్యుత్, రెవెన్యూ, ఇరిగేషన్, ఫైర్, కార్పొరేషన్, వైద్యశాఖ, ఎండోమెంట్ అధికారులు జాతర సమయంలో సమన్వయంతో పని చేసేందుకు సహకరించాలన్నారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వారికి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. ముఖ్యంగా జాతర సమయంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎండోమెంట్ అధికారులు, జాతర ఉత్సవకమిటీ, ఆలయ సిబ్బంది పోలీసులకు పూర్తి సహాయసహకారాలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు మాధవ్, శ్రీకాంత్, ఆలయ పూజారులు వేదాంతం పార్థసారథాచార్యులు, 66వ డివిజన్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, మార్కె ట్ మాజీ డైరెక్టర్ వీసం సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



ఆలయ సిబ్బందితో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ సుంకరి రవికుమార్

ముగిసిన జాతర వేలం పాటలు

మండలంలోని ఎర్రగట్టుగుట్ట క్రాస్‌రోడ్డులోని ఎర్రగట్టు వెంకటేశ్వరస్వామి జాతర ఉత్సవాల వేలం పాటలు సోమవారం ముగిసినట్లు ఆలయ ఈవో వెంకట్రావ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 14 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించే జాతర ఉత్సవ వేలం పాటలలో జాయింట్ వీల్ రూ.1,26,500, కొబ్బరి ముక్కల సేకరణ రూ.34,500, లడ్డూ, పులిహోర రూ.3,30,000, కొబ్బరికాయల అమ్మేందుకు రూ.1,31,500లకు వేలం పాట నిర్వహించినట్లు తెలిపారు.

వైభవంగా చైతన్యపురి వేంకటేశ్వరస్వామి కల్యాణం

- హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు



వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దంపతులు

కాజీపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట 61వ డివిజన్ చైతన్యపురి వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 7 నుంచి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారికి కల్యాణం కన్నులపండువగా జరిగింది. సోమవారం తీర్థ ప్రసాద గోష్ఠి, హోమం, గరుడ సేవతో పాటు ప్రత్యేక పూజలు జరిగాయి. ఆదివారం రాత్రి జరిగిన కల్యాణానికి పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నీలిమా దంపతులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ పంజాల అశోక్, కార్యదర్శి మేజర్ వడ్డేపల్లి నరేందర్, కోశాధికారి పెద్ది అశోక్ కుమార్, పరకాల ఎంపీడీవో పెద్ది ఆంజనేయులు పాల్గొనగా ఆలయ అర్చకులు శ్రీనివాస చార్యులు, కన్నన్ రఘుమాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ పూజల్లో వేలాదిగా భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

గోడ ధ్వంసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోండి

- హనుమకొండ పోలీసులకు వృద్ధురాలి ఫిర్యాదు

వరంగల్ క్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తన ఇంటి గోడలో వాటా ఉందని దబాయిస్తూ పిల్లర్లు, పుట్టింగ్ దెబ్బతినేలా తవ్విన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బ్రాహ్మణవాడలోని నాగుల వీధికి చెందిన వృద్ధురాలు డి.పుష్పలత సోమవారం హనమకొండ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి కథనం ప్రకారం.. 1970లో పసుపు, కుంకుమ కింద తన తండ్రి తనతో పాటు తన అక్క అంబాదేవికి పక్కపక్కకు ఇళ్లు ఇచ్చారన్నారు. 2006లో కార్పొషన్ అనుమతులు పొంది పాత ఇంటి స్థలంలో కొత్త ఇల్లు నిర్మాణం చేసుకొని ఉంటున్నానన్నారు. తన అక్క అంబాదేవి కుమారుడైన రమేశ్.. తన ఇంటి గోడలలో వాటా ఉందని దబాయిస్తూ పిల్లర్లు, పుట్టింగ్ దెబ్బతినేలా తవ్వకాలు జరపాడని, దీంతో ఇల్లు కూలిపోయే పరిస్థితికి వచ్చిందని అన్నారు. పోలీసులు స్పందించి అతడిపై చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యం

▸▸ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. సోమవారం గ్రేటర్ వరంగల్ 57, 58 డివిజన్లలో ఆయన పర్యటించారు. తొలుత 57వ డివిజన్‌లోని కుడా కాలనీ వద్ద రూ.19 లక్షలతో కల్వర్టు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలను అధికారులు జాప్యం చేస్తే సహించేది లేదని అన్నారు. 58వ డివిజన్ రాఘవేంద్రనగర్ ఫేజ్-2 రోడ్డు నంబర్ 2-ఏ నుంచి 2-ఎఫ్ వరకు సీసీ రోడ్డుతో పాటు ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే రూ.183 కోట్ల నిధులను గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ నుంచి అభివృద్ధి పనులకు కేటాయించినట్లు తెలిపారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేయడమే తమ అభిమతమని ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు.

ఈ కార్యక్రమంలో 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి సుధాకర్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్‌యాదవ్, మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, 58, 60 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాళ్లపెల్లి సుధాకర్, ఎనుకొంటి పున్నంచందర్, జై భీం యూత్ జిల్లా కన్వీనర్ తాళ్లపెల్లి విజయ్, సీనియర్ కాంగ్రెస్ నేతలు మండల సమ్మయ్య, ఎమ్డీ నెహాల్, అక్మల్, తాళ్లపెల్లి రవీందర్, తాళ్లపెల్లి మేరి, గోవింద ప్రకాశం, సాజిద్, సర్వర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



రాఘవేంద్రనగర్ కాలనీలోని సమస్యలను ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి వివరిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

టెలికం టవర్ ఏర్పాటు చేయొద్దు

హనుమకొండ కలెక్టరేట్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ పరిధిలోని 46వ డివిజన్ మడికొండలోని ఆర్ఎస్ఆర్ కాలనీలో టెలికం టవర్‌ను ఏర్పాటు చేయొద్దని కాలనీ ప్రజలు గ్రీవెన్స్‌సెల్‌లో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్యకు వినతిపత్రం అందజేశారు. ఇప్పటికే కాలనీలో ఒక టెలికం టవర్ ఉందని, దానివల్లనే విపరీతమైన రేడియేషన్‌తో బాధపడుతున్నామని, ఇంకో టవర్ ఏర్పాటు చేస్తే ఇక్కడ నివసించడానికి చాలా ఇబ్బంది అవుతుందని, అందుకే టవర్ ఏర్పాటు చేయకుండా చూడాలని కలెక్టర్‌కు ఇచ్చిన వినతిలో కాలనీ ప్రజలు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ మెంబర్లు తిరుపతి, ఎండీ యాకుబ్ పాషా, రాజు యాదవ్, రమేష్, వెంకట్రావు, తాడితర్ల దండిగం తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆర్ఎస్ఆర్ కాలనీవాసులు

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

▸▸ సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



శిబిరం వద్ద మాట్లాడుతున్న కర్రె భిక్షపతి

హనుమకొండ టౌన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి మాదిగలకు న్యాయం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా గ్రూప్-1, 2, 3తోపాటు హెచ్‌డబ్ల్యూవో, ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్స్ ఉద్యోగాల ఫలితాలు విడుదల చేస్తామని టీజీపీఎస్సీ ప్రకటించడం దుర్మార్గమని దుయ్యబట్టారు. ఈ దీక్షలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ రాష్ట్ర, జిల్లా నేతలు మంద కుమార్ మాదిగ, మంద ఇద్దయ్య, జన్ను దినేష్, గద్దల సుకుమార్, చేతాళ్ల శివ, జూపాక రాజు, రాజారపు దాసు, వస్కుల రాంబాబు, పారునంది రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా మినీ వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

గిర్మాజీపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగరం నర్సంపేట రోడ్డులోని అజంజాహి మిల్లు గ్రౌండ్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా మినీ వ్యాన్(డీసీఎం) ఓనర్స్ అసోసియేషన్ అడ్డాలో అసోసియేషన్ నూతన కార్యవర్గం సోమవారం బాధ్యతలు చేపట్టింది. మినీ వ్యాన్(డీసీఎం)ఓనర్స్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా తాళ్లపెల్లి మహేందర్, ఉపాధ్యక్షుడిగా ఆరె రాజు, ప్రధాన కార్యదర్శిగా శభర్తీ నరేష్, కోశాధికారిగా వంచ రంగారెడ్డి, సహాయ కార్యదర్శిగా పోతుల రాజ కొమురయ్యలు బాధ్యతలు చేపట్టారు. తమ కార్యవర్గం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మినీ వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యుల సమస్యల పరిష్కారంతో పాటుగా వారి సంక్షేమానికి కృషి చేయనున్నట్లు అధ్యక్షుడు మహేందర్ తెలిపారు.



ఎన్నికైన నూతన కార్యవర్గం

అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ 10వ శాఖ ప్రారంభం



బ్యాంక్ నూతన శాఖను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

కాజీపేట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి):వడ్డెపల్లి సమీపంలోని ప్రశాంత్‌నగర్‌లో సోమవారం నూతనంగా ఏర్పాటు చేసిన వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ 10వ శాఖ సోమవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై నూతన శాఖను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని బ్యాంక్ సిబ్బంది శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వరంగల్ అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మాట్లాడారు. బ్యాంక్ 1994లో ఆవిర్భవించి, రూ.400 కోట్ల టర్నోవర్ పూర్తిచేసుకుని బ్యాంకింగ్ రంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీ సీతారాంనాయక్, మాజీ ఎమ్మెల్యేలు అరూరి రమేశ్, కొండేటి శ్రీధర్, హనుమకొండ జిల్లా డీసీవో సంజీవరెడ్డి, వరంగల్ జిల్లా డీసీవో ఎం.నీరజ, జగన్మోహన్‌రావు, బ్యాంక్ డైరెక్టర్లు తోట సంపత్, ముందడ వేణుగోపాల్, పాపిరెడ్డి, కూరపాటి చంద్రమౌళి, గౌసుద్దీన్, పవన్, మందా స్వప్నశ్రీనివాస్, హరినాథ్, ఫౌండర్ డైరెక్టర్ ముత్తులింగం, పాలారం కృష్ణమూర్తి, బ్యాంక్ సీఈవో సత్యనారాయణరావు, బ్యాంక్ సిబ్బంది, వ్యాపార ప్రముఖులు పాల్గొన్నారు.

కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు..

(5వ పేజీ తరువాయి)

మాట్లాడుతున్నారని.. ఇక్కడ కోవర్టులు ఎవరో రాహుల్‌గాంధీ తెలుసుకోవాలని సూచించారు. రేవంత్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిందని, కానీ బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను అమలు చేసిందని హరీష్‌రావు పేర్కొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ ప్రజలకు జరుగుతున్న అన్యాయాలకు వ్యతిరేకంగా ప్రజల గొంతుకగా ఆవిర్భవించిన ఉద్యమ పార్టీ అని హరీష్‌రావు తెలిపారు. బీఆర్ఎస్ 25 ఏళ్ల రజతోత్సవ వేడుకలను వరంగల్ జిల్లాలో ఏప్రిల్ 27న ప్రారంభించి ఏడాది పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కాకతీయుల తోరణాన్ని సీఎం రేవంత్‌రెడ్డి లేకుండా చేశారని, కానీ కాకతీయులు పాలించిన గడ్డమీదనే ఉద్యమ పార్టీ బీఆర్ఎస్ రజతోత్సవ సభను నిర్వహించబోతోందని హరీష్‌రావు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మార్చి 10న మిలియన్ మార్చ్ నిర్వహించిన రోజున వరంగల్‌కు రావడం.. 25 ఏళ్ల ఉద్యమ పార్టీ సభా స్థలి పరిశీలనకు రావడం సంతోషంగా ఉందన్నారు. 14 ఏళ్ల ఉద్యమం.. 9 ఏళ్ల పాలన మేళవింపే ఈ రజతోత్సవ సభ అన్నారు. ఈ సభ కోసం వరంగల్ శివారులో రెండు స్థలాలను పరిశీలించామని, కానీ ఇంకా ఎంపిక చేయలేదని తెలిపారు. వరంగల్‌కు బీఆర్ఎస్ పార్టీకి విడదీయరాని అనుబంధం ఉందని తెలిపారు. ఈ జిల్లాలో సమర్థవంతమైన నాయకులు ఉన్నారని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవంలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని హరీష్‌రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు తాటికొండ రాజయ్య, ఎర్రబెల్లి దయాకర్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, శంకర్‌నాయక్, నన్నపునేని నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

సభా స్థలిని పరిశీలించిన నేతలు

ఏప్రిల్ 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ భారీ బహిరంగ సభ కోసం సోమవారం వరంగల్‌లోని ఉనికచర్ల, భట్టుపల్లి ప్రాంతాల్లోని సభా వేదిక స్థలాలను బీఆర్ఎస్ నేతలు పరిశీలించారు. తన్నీరు హరీష్‌రావుతోపాటు వరంగల్ జిల్లా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పరిశీలించారు.

పంటతడి.. కంటతడి!

(మొదటి పేజీ తరువాయి)

రైతులకు సాగునీటి కష్టాలు చుట్టుముట్టాయి. బోరుబావులు వట్టిపోతున్నాయి. మొన్నటిదాకా నిండుగా పోసిన బోర్లు కూడా దండగైపోయాయి. బొట్టు బొట్టుగా నీరు పోసే బోర్లను పొద్దంతా నడిపినా పది గుంటల పొలమైనా తడవడం లేదు. ప్రాజెక్టుల కింద పొలాలదీ ఇదే పరిస్థితి. నీరు వదలకపోవడంతో ఎక్కడికక్కడ పొలాలు ఎండిపోతున్నాయి. కొన్ని ప్రాజెక్టుల్లో భారీగా పూడిక చేరడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గింది. ఫలితంగా నీరు చాలడం లేదు. వదిలిన ఆ నీరు కూడా కాల్వల నిర్వహణ సరిగా లేక వృథా అవుతోంది. కాల్వల్లో పూడిక, ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కల కారణంగా నీళ్లు పొలాలకు చేరడం లేదనే అసంతృప్తులు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా కొన్నిచోట్ల యాసంగిపై ఆశలు వదిలేసుకున్న అన్నదాతలు, మేత కోసం వరి పొలంలోకి పశువులను వదులుతున్నారు. ఆశలు కోల్పోని రైతులు.. వందలు, వేలల్లో కిరాయి వెచ్చించి, ట్యాంకర్లతో నీళ్లు తెచ్చి పొలాన్ని తడుపుతున్నారు.

ఎస్సారెస్పీ కాల్వకు మరమ్మతులెప్పుడు?

ప్రధానంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు చివరి ఆయకట్టుకు నీరు అందడం లేదు. ఫలితంగా హనుమకొండ, ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల రైతులపై తీవ్ర ప్రభావం పడుతోంది. హనుమకొండ జిల్లాలో లక్ష ఎకరాలకు సాగునీరు అందించేందుకు 30 ఏళ్ల క్రితం కాల్వ నిర్మించారని. నిర్వహణను పూర్తిగా విస్మరించడంతో కాల్వ అధ్వానంగా మారిందని రైతులు అంటున్నారు. ప్రధాన కాల్వలతో పాటు ఉపకాల్వలూ శిథిలావస్థకు చేరుకున్నాయి. జిల్లాలో లక్ష ఎకరాలకు నీరు అందివ్వాల్సి ఉండగా 60-70వేల ఎకరాలకే నీరు అందుతోందని, కాల్వలకు మరమ్మతులు చేయకపోవడమే కారణం అని నీటిపారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. కొన్నిప్రాంతాల్లో రైతులు డబ్బులు పోగేసుకొని కాల్వలకు మరమ్మతులు చేసుకుంటున్నారు. ఎస్సారెస్పీ కాల్వ ద్వారా సాగునీరు విడుదల చేయాలంటూ ఐనవోలు మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతులు, చింతగట్టు క్యాంపు నీటిపారుదల శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ప్రస్తుతం ధర్మసాగర్ నుంచి స్టేషన్ ఘన్‌పూర్ పాలకుర్తి నియోజకవర్గాల పరిధిలోని ఎస్సారెస్పీ కాల్వ ద్వారా నీటిని తరలిస్తున్నట్లు.. ఐదురోజుల తర్వాత నీరు అందిస్తామని అధికారులు చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు. కాగా ఆయకట్టు పరిధిలోని లేని రైతులు కూడా ఎస్సారెస్పీపై ఆశలు పెట్టుకొని యాసంగిలో విస్తృతంగా వరిసాగు చేశారు. సూర్యాపేట జిల్లా మోతె మండలంలోని అన్ని గ్రామాల్లో, మునగాల మండలంలోని రేపాల, నర్సింహులగూడెం, జగన్నాథపురం, విజయరాఘవపురం, సీతానగరం, కలకోవ గ్రామాల్లో భారీగా వరిసాగు చేశారు. వరి పొట్టదశకొచ్చిందని, మరో 2-3 తడులు పెడితే గట్టెక్కుతామని, వెంటనే నీటిని విడుదల చేయాలని ఈ గ్రామాల రైతులు ప్రభుత్వాన్ని.. ముఖ్యంగా జిల్లాకు చెందిన భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కోరుతున్నారు. నిజాంసాగర్, పోచారం, కౌలాస్‌నాలా ప్రాజెక్టుల్లో నీటి నిల్వ సామర్థ్యం తగ్గడంతో పూర్తిస్థాయిలో నీరు అందడం లేదు. అందునా.. రెండ్రోజుల క్రితం నిజాంసాగర్ ప్రధాన కాల్వ నుంచి నీటి విడుదలను ఆపేశారు. నాగార్జునసాగర్ ఎడమ కాల్వ నుంచి నీటి సరఫరా జరుగుతున్నా కొన్నిచోట్ల చివరి ఆయకట్టుకు నీరందడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఖమ్మం జిల్లాలో సాగర్ ఎడమకాల్వ కింద లక్ష ఎకరాల్లో, వరి, 70వేల ఎకరాల్లో మొక్కజొన్న పంట వేశారు. కొణిజర్ల, పల్లిపాడు, లాలపురం, దిద్దుపూడి, చిన్న మునగాల తదితర చోట్ల నీరు అందడం లేదని.. ఫలితంగా దిగుబడిపైనే ప్రభావం పడే అవకాశం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సాగర్ బోనకల్ జోన్‌కు నీరు విడుదల చేస్తుండటంతో ఎగువభూములైన కొణిజర్ల, వైరా, ఎన్కూరు తదితర మండలాలకు నీరే అందడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వైరా మేజర్ ఆయకట్టు రైతులు ఆదివారం బోనకల్ బ్రాంచ్ కాల్వ వైరా మేజర్‌కు వెళ్లే తూము వద్దకు చేరుకొని ఆందోళన చేశారు. ఎండుతున్న తమ పంటలను పట్టించుకోకుండా దిగువకు నీళ్లు ఎలా వదులుతున్నారని ప్రశ్నించారు. కడెం ప్రాజెక్టు కింద పొలాలు ఎండిపోతున్నాయంటూ మంచిర్యాల జిల్లా దండేపల్లిలో అన్నదాతలు రోడ్డెక్కారు. ఎన్నిసార్లు చెప్పినా నీటిపారుదల శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కడెం ఆయకట్టు కింద 24వ డిస్ట్రిబ్యూటరీ కాల్వ ద్వారా సాగునీరు అందక తాము సాగుచేసిన పొలాలన్నీ ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.



సాగునీటి కోసం మంచిర్యాల జిల్లా నాగసముద్రంలో రాస్తారోకో చేస్తున్న అన్నదాతలు (ఫైల్)



జనగామ జిల్లా బచ్చన్నపేటలో ఎండిన వరి పొలాలు

జనగామ జిల్లాలో 20శాతం పంటలు ఖతం

కామారెడ్డి జిల్లాలో భూగర్భజలాలు 12.97 మీటర్లకు పడిపోయాయి. జిల్లాలోని దోమకొండ, భిక్కనూరు, మాచారెడ్డి, రామారెడ్డి ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు ఎండిపోయి నీళ్లు లేక పొలాలు వాడుముఖం పట్టాయి. నస్రూల్లాబాద్, బీర్కూర్, పిట్లం, నిజాంసాగర్, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, గాంధారి మండలాల పరిధిలో జొన్న పంట ఎండిపోతోంది. రిజర్వాయర్ల నుంచి నీళ్లు రాకపోవడంతో జనగామ జిల్లా వ్యాప్తంగా సాగైన పంటల్లో 20శాతం మేర ఎండిపోయాయి. జిల్లాలో స్టేషన్‌ఘన్‌పూర్, అశ్వారావుపల్లి, చీటకోడూరు, నవాబుపేట, గండిరామారం, బొమ్మకూరు, కన్నెబోయినగూడెం రిజర్వాయర్లున్నాయి. వీటి ద్వారా గతంలో చెరువులను నింపేవారు. ఇప్పుడు నీళ్లు లేకపోవడంతో చెరువుల కింద పంటలూ ఎండుతున్నాయి.

ఎండుతున్న పొలాన్ని చూసి తట్టుకోలేక..



నర్సింహా (ఫైల్)

సాగునీరు లేక ఎండిపోయిన వరిపొలాన్ని చూసి మనోవేదనకు గురైన ఆ కౌలు రైతు.. పెట్టుబడికి అయిన అప్పు ఎలా తీర్చాలనే రందితో ఆత్మహత్య చేసుకున్నాడు. యాదాద్రి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామానికి చెందిన మోట నర్సింహా (50) 14ఎకరాలను కౌలుకు తీసుకుని వరి సాగుచేశాడు. బోర్లు సరిగా పోయకపోవడంతో ఐదెకరాల పొలం పూర్తిగా ఎండిపోయింది. మరికొంత వాడుముఖం పట్టింది. దీనిపైనే గత పదిరోజులుగా నర్సింహా బాధపడుతున్నాడు. సోమవారం పొలం వద్దే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పెట్టుబడుల కోసం, కుటుంబ అవసరాల కోసం నర్సింహా రూ.15 లక్షల దాకా అప్పులు చేశాడని గ్రామస్థులు తెలిపారు. నర్సింహాకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.

ట్యాంకర్‌కు రూ.700 వెచ్చించి..



యాదాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపురంలో ట్యాంకర్ ద్వారా చేనుకు నీరు పెడుతున్న రైతు

యాదాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపురానికి చెందిన కొండ సత్తయ్య ఎకరం పొలంలో వరిసాగు చేశాడు. నెలరోజుల నుంచి బోరు సరిగా పోయడం లేదు. వచ్చే ఆ నీళ్లు సరిపోక పంట ఎండుతుండటంతో సత్తయ్య రెండ్రోజులకోసారి ట్యాంకర్ ద్వారా నీళ్లు తెచ్చి పొలానికి పెడుతున్నాడు. ఇందుకు.. ట్యాంకర్‌కు రూ.700 వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ గ్రామానికి చెందిన రైతు గాలయ్య పరిస్థితి అయితే మరీ దారుణం. కొన్నాళ్లు ట్యాంకర్ల నీటితో పొలాన్ని తడిపినా.. డబ్బు వెచ్చించే స్థోమత లేక చివరికి రెండెకరాల పొలంలో పశువులను వదిలాడు. సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో సత్యయ్య అనే రైతు నాలుగు ఎకరాల్లో వరి వస్తే.. బోరుబావిలోంచి నీరు సరిగా రాకపోవడంతో రెండెకరాల పొలాన్ని విడిచిపెట్టేసి.. మిగతా రెండెకరాల పొలానికి ట్యాంకర్లతో నీళ్లు తెచ్చి పోస్తున్నాడు. మూడు రోజులకోసారి ఐదు ట్యాంకర్లతో నీళ్లు తెచ్చి పోస్తున్నానని చెప్పాడు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం అంబటోనిపల్లి గ్రామానికి చెందిన బసప్ప అనే రైతు బోరుబావి అడుగంటడంతో పొట్టదశకొచ్చిన రెండెకరాల పొలంలో ఒక ఎకరాన్ని వదిలేశాడు.

చేతికొచ్చిన పంటల రక్షణే ప్రభుత్వ కర్తవ్యం

» అధికారులతో మంత్రులు ఉత్తమ్, తుమ్మల

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : చేతికొచ్చిన పంటలను కాపాడుకోవడమే ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. ఆ దిశగానే పనిచేయాలని వారికి సూచించారు. ప్రాజెక్టుల నుంచి సాగునీటి విడుదల విషయంలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, వాస్తవాలు ప్రజలకు వివరించాలన్నారు. సచివాలయం నుంచి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన సోమవారం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, వ్యవసాయ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రబీ సీజన్ పంట మరో 15 రోజుల్లో చేతికి రానుందని, అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు తోడ్పాటు అందించాలన్నారు. తొలుత ఆయకట్టు చివరి భూములకు నీరు అందేలా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో నిజానిజాలు తెలుసుకోకుండా పంటల నష్టం గురించి దుష్ప్రచారం జరుగుతుందని, దీన్ని కట్టడి చేయాలని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు.



మహా పూర్ణాహుతిలో పాల్గొన్న గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మకు ఆశీర్వచనం చేస్తున్న ఆలయ ప్రధాన అర్చకుడు లక్ష్మీనరసింహాచార్యులు

గుట్టపై ఘనంగా మహా పూర్ణాహుతి

» నృసింహుడిని దర్శించుకున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

యాదాద్రి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా 10వ రోజైన సోమవారం పూర్ణాహుతి, చక్రతీర్థం, దోపు కథ వైదిక కార్యక్రమాలు ఆగమ శాస్త్ర రీతిలో వైభవంగా నిర్వహించారు. శ్రీచక్ర ఆళ్వార్లకు పుణ్యతీర్థ స్నానం, పూర్ణాహుతి, లక్ష్మీనరసింహులకు శ్రీపుష్పయాగం దేవతోద్వాసన.. దోపు కథ వైదిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఉదయం 10.30 గంటలకు స్వామివారి ఆలయంలో నిత్యారాధనల అనంతరం మహా పూర్ణాహుతి, చక్రతీర్థం నిర్వహించారు. కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ పాల్గొని పూజలు నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం చక్రతీర్థ స్నాన వేడుకను సంప్రదాయ రీతిలో స్వామివారి విష్ణు పుష్కరిణిలో నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం నిర్వహించి, పవిత్ర జలాలతో సుదర్శన చక్రతీర్థ స్నాన పర్వాలను వైభవంగా నిర్వహించారు. ముందుగా బ్రహ్మోత్సవాల్లో విశ్వశాంతి, లోకకల్యాణం కోసం యాగశాలలో హవన పూజలు కొనసాగగా.. మహోత్సవ పరి సమాప్తిలో భాగంగా మంత్రోచ్చారణలతో మహా పూర్ణాహుతి పర్వాలను నిర్వహించారు. సాయంత్రం కల్యాణ లక్ష్మీనరసింహులకు వివిధ పుష్పాలు సమర్పించి శ్రీపుష్పయాగం, అనంతరం దోపోత్సవం జరిపారు. కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఎం.హనుమంతరావు, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి, ఈవో ఏపూరి భాస్కర్‌రావు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

చావనైనా చస్తాం.. మా భూములివ్వం

» కలెక్టరేట్ వద్ద రావిర్యాల రైతుల ఆందోళన

» ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం

రంగారెడ్డి అర్బన్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : "ఓ సారూ.. నీ కాల్మొక్త.. మా భూమి లాక్కోవద్దు.. ఉన్న కొద్ది భూమిని రోడ్డు కోసం మీరు గుంజుకుంటే.. మేమెట్లా బతికేది..? మాకు వ్యవసాయమే జీవనాధారం.. భూమి కోసం చావనైనా చస్తాం కానీ.. మా పొలాలను మాత్రం ఇవ్వం" అని రావిర్యాల (కొంగరకుర్దు) రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. భూములు తీసుకోవద్దని సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఎదుట రైతులు సుధాకర్, బాల్‌రాజ్, నర్సింహ ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల (కొంగరకుర్దు) సర్వే నంబరు 13లోని పట్టా భూముల్లో రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారు. ఆ భూముల నుంచి 300 ఫీట్ల వెడల్పుతో ఫ్యూచర్ సిటీకి రోడ్డు వేసేందుకు ప్రభుత్వం సర్వే చేసింది. రైతులకు నోటీసులు ఇవ్వకుండానే రోడ్డు కోసం హద్దు రాళ్లను పాతే ప్రక్రియ కొనసాగుతోంది. సోమవారం పొలాల వద్ద హద్దు రాళ్లను పాతేందుకు వచ్చిన అధికారులను రైతులు అడ్డుకున్నారు. తమకు నోటీసులు, పరిహారం భరోసా ఇవ్వకుండా దౌర్జన్యంగా రోడ్డు వేయడం ఏంటని ప్రశ్నించారు. అయితే, అధికారులు రైతులను పట్టించుకోకుండా హద్దురాళ్లను పాతారు. దీంతో రైతులు కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. ఫ్యూచర్ సిటీ రోడ్డు పనులను వెంటనే ఆపేయాలని ఆందోళన చేశారు. కలెక్టర్ లేకపోవడంతో రైతులను ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ముగ్గురు రైతులు ఒంటిపై పెట్రోల్ పోసుకున్నారు. అక్కడున్న పోలీసులు వెంటనే వారిని అడ్డుకున్నారు. రైతులు వాగ్వాదానికి దిగడంతో పోలీసులు వారిని డీఆర్వో సంగీత వద్దకు తీసుకెళ్లారు. తమకు న్యాయం చేయాలని అన్నదాతలు డీఆర్వోకు వినతి పత్రం ఇచ్చారు.

సీఎం రేవంత్ రాజీనామా చేయాలి

» కాంగ్రెస్ పాలనకు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలే రెఫరెండం

» పంటలు ఎండిపోవడానికి రేవంత్ రెడ్డి వైఫల్యమే కారణం

» కృష్ణా నీటిని చంద్రబాబు ఏపీకి తరలిస్తుంటే మౌనం

» మాజీ మంత్రి హరీశ్ రావు ధ్వజం



హనుమకొండ టౌన్/జనగామ మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను తుక్కు తుక్కుగా ఓడించారని బీఆర్ఎస్ నేత, మాజీమంత్రి హరీశ్‌రావు అన్నారు. 15 నెలల పాలనకు రెఫరెండంగా నిలిచిన ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటమికి బాధ్యతగా సీఎం రేవంత్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు స్థలాన్ని పరిశీలించేందుకు సోమవారం హనుమకొండ వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడారు. అంతకు ముందు హనుమకొండలో మరో చోట, జనగామలోనూ ప్రసంగించారు. రాష్ట్రంలో పంటలు ఎండిపోవడానికి రేవంత్ వైఫల్యమే కారణమని ఆరోపించారు. ఇది కాలం తెచ్చిన కరువు కాదని.. పాలన చేతకాక రేవంత్ తెచ్చిన కరువు అని విమర్శించారు. దేవాదుల కాంట్రాక్టర్‌కు రూ.7 వేల కోట్లు బిల్లులు చెల్లించకపోవడం వల్ల 33 రోజులు పంపుల మోటార్లు ఆన్ చేయలేదని.. సరైన సమయంలో మోటార్లు ఆన్‌చేసి ఉంటే రిజర్వాయర్లు నిండి పొలాలకు నీళ్లు వచ్చేవని చెప్పారు. రేవంత్ వైఫల్యం కారణంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో లక్ష ఎకరాల్లో పంటలు ఎండిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. కృష్ణానది నీటిని చంద్రబాబు ఏపీకి తరలించుకుపోతుంటే రేవంత్, మంత్రి ఉత్తమ్ కనీసం మాట్లాడలేదన్నారు. స్థానిక ఎన్నికలు సహా ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌దే విజయమని ధీమా వ్యక్తం చేశారు. 'ఇటీవల ఓ సభలో రేవంత్ ప్రధాని మోదీ మంచోడే నన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్‌లో బీజేపీ కోవర్టులెవరో రాహుల్ గాంధీ తెలుసుకోవాలి' అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ 25 ఏళ్ల రజతోత్సవ వేడుకలను వరంగల్ జిల్లాలో ఏప్రిల్ 27న ప్రారంభించి ఏడాది పాటు నిర్వహిస్తామని చెప్పారు. 14 ఏళ్ల ఉద్యమం, 9 ఏళ్ల పాలన మేళవింపే ఈ సభ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, రాజయ్య, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు కౌశిక్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్ బస్టాండ్ ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు

పసుపు రైతుల ఆందోళన

» నిజామాబాద్ మార్కెట్‌లో ధర్నా, బస్టాండ్ వద్ద బైఠాయింపు

నిజామాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కొద్ది రోజులుగా వ్యాపారులు సిండికేటై పసుపు పంటను తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆగ్రహిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో వ్యాపారులు.. తమను దోపిడీ చేస్తున్నారని, అధికారులు స్పందించి మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చూడాలని డిమాండ్ చేస్తూ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద, ఆ తర్వాత బస్టాండ్ ఎదుట రహదారిపై బైఠాయించి, ధర్నా చేశారు. మార్కెట్‌కు సోమవారం జిల్లాతో పాటు జగిత్యాల, నిర్మల్ జిల్లాల నుంచి రైతులు భారీ ఎత్తున పసుపును తీసుకొచ్చారు. మధ్యాహ్నం వరకు వ్యాపారులతో పాటు అధికారులు కూడా కొనుగోలు చేపట్టలేదు. రైతులు ఈ విషయమై మార్కెట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా వ్యాపారులు తేమ ఎక్కువగా ఉందని కొనుగోలు చేపట్టలేదు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద ధర్నా చేయగా.. అక్కడ అధికారులెవరూ పట్టించుకోకపోవడంతో పెద్దసంఖ్యలో బస్టాండ్ వద్దకు తరలొచ్చి ధర్నా చేశారు. బస్టాండ్ నుంచి బస్సులను బయటకు రాకుండా నిలిపివేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. గతేడాది మాదిరిగా క్వింటాలుకు రూ.15వేల వరకు ధర పెట్టి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తాను మార్కెట్‌కు వస్తానని, కొనుగోలు జరిగే విధంగా చూస్తామని అదనపు కలెక్టర్ హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు. కాగా, నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం రాత్రి వ్యాపారులు, రైతులతో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ సమావేశమయ్యారు. కొమ్ము రకానికి క్వింటాలుకు రూ.9500కు, మండ రకానికి రూ.8వేలకు తగ్గకుండా కొనుగోలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం నుంచి కొనుగోళ్లను మొదలు పెడతామని మార్కెట్ చైర్మన్ ముప్ప గంగారెడ్డి తెలిపారు.

ఎండుతున్న పంటలకు నీరందించాలి: జాన్ వెస్లీ

జనగామ రూరల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లనే పంటలు ఎండిపోతున్నాయని, వెంటనే సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ కోరారు. లేదంటే త్వరలో జనగామ జిల్లాలో జరిగే సీఎం రేవంత్ పర్యటనను అడ్డుకుంటామనిహెచ్చరించారు. సోమవారం జనగామ జిల్లాలో పర్యటించిన జాన్ వెస్లీ గానుగుపహాడ్, కొత్రతండా, వడ్లకొండ, చిన్నరామన్‌చర్లలలో ఎండిన పంటలను పరిశీలించారు.


అస్గర్ అలీ


అబ్దుల్ బారీ


అబ్దుల్ కరీం


శ్రావణ్ (మారుతీరావు తమ్ముడు)


శివ(మారుతీరావు డ్రైవర్)


నిజాం (ఆటోడ్రైవర్)

ప్రణయ్ హంతకుడికి
మరణ శిక్ష




నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ప్రణయ్ సమాధి వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు ప్రేమలత, బాలస్వామి

(మొదటిపేజీ తరువాయి)

ప్రణయ్-అమృత పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పలుమార్లు మారుతీరావుకు కౌన్సెలింగ్ ఇచ్చి, ఆయనలో మార్పు తీసుకొచ్చారు. అంతా ప్రశాంతంగా ఉందని భావిస్తున్న సమయంలో.. ప్రణయ్-అమృత పెళ్లి విందు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీన్ని జీర్ణించుకోలేని మారుతీరావు.. కులోన్మాదం, ప్రతీకారంతో రగిలిపోయారు. ప్రణయ్‌ని హత్య చేయించాలని నిర్ణయించుకుని, మిర్యాలగూడకు చెందిన మహమ్మద్ అబ్దుల్ కరీంకు రూ.కోటి సుపారీ ఇచ్చాడు. దాంతో కరీం.. హైదరాబాద్‌లోని మలక్‌పేటకు చెందిన అబ్దుల్‌బారీ, బిహార్‌లోని సమస్తిపూర్ జిల్లా జగత్‌సింగ్‌పూర్ గ్రామానికి చెందిన సుభాష్‌శర్మ, నల్లగొండ పట్టణానికి చెందిన అస్గర్‌అలీ(గుజరాత్ మాజీ హోంమంత్రి హరేన్‌పాండ్య హత్యకేసు నిందితుడు)లతో గ్యాంగ్ ఏర్పాటు చేశాడు. గర్భిణిగా ఉన్న అమృతను ప్రణయ్ 2018 సెప్టెంబరు 14న మిర్యాలగూడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి తీసుకెళ్లిన సమయంలో.. సుభాష్ శర్మ అతణ్ని కత్తితో పొడిచి, చంపాడు. ఈ ఘటనను చూసిన అమృత, ప్రణయ్ తల్లి ప్రేమలత పెద్దపెట్టున కేకలు వేస్తూ.. మూర్ఛపోయారు. ప్రణయ్ తండ్రి బాలస్వామి ఫిర్యాదు మేరకు మిర్యాలగూడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు ప్రారంభించారు. అప్పట్లో ఈ హత్య దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కుల వ్యతిరేక.. ప్రజా సంఘాల నేతలు ఈ హత్యను తీవ్రంగా ఖండించి, ర్యాలీలు, ఆందోళనలు నిర్వహించారు. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న అప్పటి నల్లగొండ జిల్లా ఎస్పీ(ప్రస్తుతం హైడ్రా కమిషనర్) ఏవీ రంగనాథ్ నాలుగు రోజుల్లో ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేశారు. తొమ్మిది నెలల్లోనే 1,600 పేజీల చార్జిషీట్‌ను కోర్టుకు సమర్పించారు.

ఒకరికి ఉరి.. ఆరుగురికి యావజ్జీవం

నల్లగొండ రెండో అదనపు జిల్లా కోర్టు, ఎస్సీఎస్టీ ప్రత్యేక న్యాయస్థానంలో ప్రణయ్ హత్యకేసు విచారణ ఏడేళ్ల పాటు కొనసాగింది. మొత్తం 78 మంది సాక్షులు కోర్టుకు వాంగ్మూలమిచ్చారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ దర్శనం నరసింహ వాదనలను వినిపించారు. జడ్జి రోజారమణి సోమవారం 523 పేజీల తీర్పునిచ్చారు. ఏ-1గా ఉన్న మారుతీరావు 2020లో ఆత్మహత్య చేసుకోగా.. ప్రణయ్‌ను హత్య చేసిన ఏ-2సుభాష్‌శర్మకు మరణశిక్ష, రూ.15 వేల జరిమానా విధించారు. ఏ-3 నుంచి ఏ-8 వరకు ఉన్న మిగతా నిందితులు– మహమ్మద్ అస్గర్‌అలీ, మహ్మద్ అబ్దుల్‌బారీ, మహమ్మద్ అబ్దుల్ కరీం, తిరునగరు శ్రవణ్‌కుమార్(అమృత చిన్నాన్న), సముద్రాల శివ(మారుతీరావు డ్రైవర్), ఆటోడ్రైవర్ నిజాంలకు యావజ్జీవ కారాగార శిక్షతో పాటు.. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు. తీర్పు అనంతరం సుభాష్‌శర్మను చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. అస్గర్‌అలీ ఇప్పటికే హరేన్‌పాండ్య హత్యకేసులో సబర్మతి జైలులో శిక్షను అనుభవిస్తున్నాడు. తీర్పు తర్వాత అతణ్ని సబర్మతి జైలుకు తరలించారు. మిగతా నిందితులను నల్లగొండ జిల్లా జైలుకు పంపారు. తీర్పు నేపథ్యంలో సోమవారం కోర్టు వద్ద ఉద్రిక్త పరిస్థితులు కనిపించాయి. దీంతో.. ఇద్దరు డీఎస్పీలు, ఐదుగురు సీఐలు, పలువురు ఎస్సైలు, కానిస్టేబుళ్లు కలిపి.. మొత్తం 150 మంది బందోబస్తు నిర్వహించారు. మీడియా ప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు అధికసంఖ్యలో రావడంతో.. కోర్టు ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఈ తీర్పుపై ప్రజాసంఘాల నాయకులు, న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

కరుడుగట్టిన నేరస్థులే

ఈ కేసులో మరణ శిక్ష పడ్డ సుభాష్‌శర్మ, యావజ్జీవ శిక్ష పడిన అబ్దుల్‌బారీ, అస్గర్‌అలీకి కరడుగట్టిన నేర చరిత్ర ఉంది. బిహార్‌కు చెందిన సుభాష్‌శర్మ 13 ఏళ్ల వయసు నుంచే నేరాలకు పాల్పడుతున్నాడు. ఆయుధాల అక్రమ రవాణా కేసులో పుణె జైలులో శిక్ష అనుభవించాడు. ప్రణయ్ హత్యకు ఇతను రూ2 లక్షల సుపారీకి తీసుకోవడం గమనార్హం.! అస్గర్‌అలీకి పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐతో సంబంధాలున్నాయనే అభియోగాలున్నాయి. గుజరాత్ మాజీ హోంమంత్రి హరేన్‌పాండ్యా హత్యకేసులో ఇతనికి యావజ్జీవ శిక్ష పడింది. అస్గర్‌తో కలిసి అబ్దుల్‌బారీ భూదందాలు, సెటిల్మెంట్లు, బెదిరింపులు చేసేవారు. అబ్దుల్ బారీ ఓ సందర్భంలో మారుతీరావును కూడా బెదిరించి, డబ్బులు వసూలు చేశాడు. అబ్దుల్ కరీం(అప్పట్లో కాంగ్రెస్ నేత)తో మారుతీరావుకు మైత్రి ఉంది. దాంతో.. కరీం ద్వారా ఈ గ్యాంగ్‌ను మారుతీరావు సంప్రదించాడు. సుభాష్‌శర్మ ఓ దోపిడీ కేసులో రాజమహేంద్రవరం జైలుకు వెళ్లగా.. అక్కడే అస్గర్‌అలీతో పరిచయం ఏర్పడిందని పోలీసులు తెలిపారు. మరో నిందితుడు, మారుతీరావు సోదరుడు శ్రవణ్‌కుమార్.. మొదటి నుంచి అమృత ప్రేమను అంగీకరించలేదు. ఓ సందర్భంలో తనను బాబాయి డంబెల్స్‌తో కొట్టాడని అమృత చెప్పారు. శ్రవణ్‌కుమార్ ఆస్తికోసం వేధించడంతోనే మారుతీరావు ఆత్మహత్య చేసుకుని ఉంటారని అప్పట్లో ఆమె ఆరోపించారు. మారుతీరావు డ్రైవర్ శివ, నిందితులను ఆటోలో తిప్పిన నిజాంకు కూడా ఈ కేసులో శిక్ష పడింది.

శిక్ష తగ్గించాలని వేడుకున్న నిందితులు

జస్టిస్ రోజారమణి తీర్పును వెలువరించడానికి ముందు నిందితులతో.. "చెప్పుకోవడానికి ఏమైనా ఉందా?" అని ప్రశ్నించారు. ఆ వెంటనే.. నిందితులు ఒక్కొక్కరుగా తమకు శిక్షను తగ్గించాలని వేడుకున్నారు. "నా కుటుంబానికి నేనే ఆధారం. నా తండ్రి ఇటీవలే చనిపోయారు. కర్మకాండలను నిర్వహించాల్సి ఉంది. నా తల్లిని పోషించాల్సిన బాధ్యత నాపైనే ఉంది" అని సుభాష్ శర్మ జడ్జిని వేడుకున్నాడు. అస్గర్‌అలీ, అబ్దుల్‌బారీ, అబ్దుల్‌కరీం కూడా చిన్న పిల్లలున్నారని, గుండె, ఇతర అనారోగ్య సమస్యలున్నాయని, పిల్లల బాధ్యత తమపైనే ఉన్నందున శిక్షను తగ్గించాలని జడ్జిని కోరారు. శ్రవణ్‌కుమార్ తనకు పెళ్లికావాల్సిన ఇద్దరు కుమార్తెలున్నారని, నిరుద్యోగి అయిన కుమారుడు ఉన్నాడని, ఈ కేసులో తన ప్రమేయమేమీ లేదనే విషయం అందరికీ తెలుసునని చెప్పారు. డ్రైవర్ శివ తన భార్య విడాకులిచ్చిందని, ఇద్దరు చిన్నపిల్లల బాధ్యత తనపైనే ఉందని.. ఆటోడ్రైవర్ నిజాం కూడా తనను భార్య విడిచివెళ్లిందని, చిన్న పిల్లలు అనాథలవుతారని, తనకు గుండె సమస్యలున్నాయని, క్షమించి విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.

కేసును సవాల్‌గా తీసుకున్న రంగనాథ్

అప్పటి నల్లగొండ ఎస్పీ ఏవీ రంగనాథ్ ప్రణయ్ హత్యకేసును సవాల్‌గా తీసుకున్నారు. అప్పటి డీఎస్పీ(ప్రస్తుతం జీహెచ్ఎంసీ విజిలెన్స్ అదనపు ఎస్పీ) శ్రీనివాస్, ఇతర దర్యాప్తు అధికారులతో రేయింబవళ్లు కేసు పురోగతిపై సమీక్షలు నిర్వహించేవారు. ఎక్కడా పొరపాట్లు జరగకుండా.. తొమ్మిది నెలల్లో 1,600 పేజీల చార్జిషీట్‌ను సిద్ధం చేశారు. హత్యకు ఉపయోగించిన ఆయుధాలు, నిందితుల తల వెంట్రుకలు, రక్త నమూనాలు, ఇతర ఫోరెన్సిక్ ఆధారాల విషయంలో శ్రద్ధ వహించారు. పకడ్బందీగా సీన్ రీ-కన్‌స్ట్రక్షన్ చేయించారు. అప్పటి డీఎస్పీ శ్రీనివాస్ కూడా ఈ కేసులో కీలక పాత్ర పోషించారు. కోర్టు తాజా తీర్పుపై రంగనాథ్, శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు.

రైలులో బిహార్ వెళ్లేలోపే.. విమానంలో చేరుకుని..!

ప్రణయ్ హత్య తర్వాత సుభాష్‌శర్మ రైలులో బిహార్‌కు పారిపోయాడు. అతణ్ని నల్లగొండ నుంచి పంపించేస్తే.. ఎలాంటి ఆధారాలు దొరకవని నిందితులంతా భావించారు. అయితే.. ఎస్పీ రంగనాథ్ మారుతీరావును విచారించడంతో డొంకంతా కదిలింది. సుభాష్‌శర్మ బిహార్‌కు చెక్కేసినట్లు తేలడంతో.. చార్టెడ్ విమానంలో ఇద్దరు ఇన్‌స్పెక్టర్ల నేతృత్వంలోని ఓ బృందాన్ని బిహార్‌లోని జగత్‌సింగ్‌పూర్‌కు పంపారు. నిజానికి ఆ ఊరు 'ఖాకీ' సినిమా మాదిరిగా ఉంటుంది. కొత్తవారు కనిపిస్తే రాళ్లతో కొట్టి చంపడానికీ వెనకాడరు. అలాంటి ఊరికి వెళ్లిన నల్లగొండ బృందం అక్కడి పోలీసులతో కలిసి.. సుభాష్‌శర్మను అదుపులోకి తీసుకుంది.

2020లో మారుతీరావు ఆత్మహత్య

మారుతీరావు 2020 మార్చి 7న హైదరాబాద్‌లోని ఆర్యవైశ్య భవన్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. తనకు మరణశిక్ష తప్పదని అర్థం చేసుకున్న మారుతీరావు.. తన భార్య గిరిజతో చివరిసారి ఫోన్‌లో మాట్లాడి.. గారెల్లో విషం కలుపుకొని తిని, బలవన్మరణానికి పాల్పడ్డారు. "గిరిజా.. నన్ను క్షమించు" అంటూ భార్యకు.. "అమృత.. అమ్మ వద్దకు వెళ్లమ్మా.." అంటూ తన కూతురికి రాసిన నోట్‌ను పోలీసులు గుర్తించారు.



కన్నీటి పర్యంతమైన శ్రవణ్ భార్య, కుమార్తె

కేసులో యావజ్జీవ శిక్షపడిన తిరునగరు శ్రవణ్‌కుమార్(అమృత చిన్నాన్న) భార్య పద్మజ, కుమార్తె స్ఫూర్తి.. తీర్పు వెలువడగానే కోర్టు ప్రాంగణంలో తీవ్రంగా రోదించారు. అమృత వల్లే ఇదంతా జరిగిందని, ఏ పాపం తెలియని శ్రవణ్‌కుమార్‌ను పోలీసులు కేసులో ఇరికించారని, తెల్ల కాగితాలపై సంతకాలు తీసుకున్నారని ఆరోపించారు. ఈ క్రమంలో స్ఫూర్తికి పోలీసులకు మధ్య వాగ్వాదం జరగడంతో.. మహిళా ఎస్సై, కానిస్టేబుళ్లు వారిని కోర్టు బయటకు పంపారు.

కోర్టుకు రాని అమృత, ప్రణయ్ కుటుంబీకులు

తీర్పు సందర్భంగా అమృత, ప్రణయ్ తల్లిదండ్రులు కోర్టుకు రాలేదు. అమృత రెండ్రోజుల క్రితమే తన ఫోన్‌ను స్విచాఫ్ చేసుకున్నారు. తీర్పు వెలువడ్డాక ప్రణయ్ తండ్రి బాలస్వామి, తన కుమారుడి సమాధి వద్దకు వెళ్లి, నివాళులర్పించారు. అక్కడ, తన ఇంటి వద్ద కంటతడితో మీడియాతో మాట్లాడారు. "ప్రణయ్ హత్యతో నేను కుమారుడిని, అమృత తన భర్తను, నా మనవడు తండ్రిని కోల్పోయారు. ఈ హత్య తర్వాత చాలా కులోన్మాద హత్యలు జరిగాయి. హత్యలు చేసేవారికి ఈ తీర్పు కనువిప్పు కావాలి" అని వ్యాఖ్యానించారు. కాగా, ప్రణయ్ హత్య తర్వాత అమృత తన అత్తింట్లోనే ఉన్నారు. అక్కడే ఓ బాబుకు జన్మనిచ్చారు. మారుతీరావు ఆత్మహత్య తర్వాత అమృత తన తల్లి గిరిజను దరిచేర్చుకున్నారు. అత్తింటితో సంబంధాలు కొనసాగిస్తూనే.. తల్లి, తన కుమారుడితో కలిసి హైదరాబాద్‌లో ఉంటున్నారు. 'అమృత ప్రణయ్' పేరుతో 5 లక్షల సబ్‌స్క్రైబర్లున్న ఓ యూట్యూబ్ చానల్‌ను నిర్వహిస్తున్నారు.

తీర్పుల ఆలస్యం వల్లే కులోన్మాద హత్యలు

మాల కృష్ణ భార్య భార్గవి

సూర్యాపేటక్రైం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రణయ్ హత్య కేసు విచారణ సుమారు ఆరేళ్లకు పైగా సాగిందని, ఈ హత్య కేసును త్వరగా విచారించి శిక్షలు విధించి ఉంటే.. తన భర్త మాల కృష్ణ అలియాస్ బంటితో పాటు సమాజంలో ఇలాంటి సంఘటనలు జరిగేవి కావని మాల కృష్ణ భార్య భార్గవి అన్నారు. సోమవారం భార్గవి సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడుతూ, ప్రణయ్ హత్యోదంతంలో నిందితులకు శిక్ష పడిన మాదిరే తన భర్తను హత్య చేసిన నిందితులకు త్వరగా శిక్ష పడేలా చేసి తమకూ న్యాయం చేయాలని ఆమె కోరారు. కులోన్మాద హత్యల కేసులను ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల్లో విచారణ చేయించి త్వరగా శిక్షలు పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.కాగా, నానమ్మ కళ్లలో సంతోషం కోసం తన చెల్లెలు భార్గవిని ప్రేమించి పెళ్లి చేసుకున్న మాల కృష్ణను భార్గవి అన్న నవీన్ మరో ఇద్దరితో కలిసి ఈ ఏడాది జనవరి 26న హత్య చేశాడు.

చిత్రజ్యోతి
SINCE 1965

కన్నప్ప ప్రేమగీతం



విష్ణు మంచు హీరోగా డాక్టర్ మోహన్‌బాబు ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న భారీ చిత్రం 'కన్నప్ప'. ఇటీవల విడుదల చేసిన 'శివ శివ శంకర' పాట, రెండో టీజర్‌తో సినిమా మీద అంచనాలు భారీగా పెరిగాయి. వచ్చే నెల 25న 'కన్నప్ప' ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దాంతో ప్రచార కార్యక్రమాల వేగం పెంచారు. సినిమాలోని ప్రేమ గీతాన్ని సోమవారం విడుదల చేశారు. కన్నప్ప పాత్రధారి విష్ణు, ప్రీతి ముకుందన్ పాల్గొన్న 'సగమై.. చెరి సగమై' అంటూ సాగే ఈ పాటను శ్రీమణి రాయగా, రేవంత్, సాహితి చాగంటి పాడారు. ప్రభుదావా, బృందా కొరియోగ్రఫీ చేశారు. శివ భక్తుడైన కన్నప్ప కథను వెండితెరపై ఆవిష్కరిస్తున్న ఈ చిత్రంలో శివుడిగా అక్షయ్‌కుమార్, రుద్రుడిగా ప్రభాస్, పార్వతిగా కాజల్ నటించనున్నారు. ఈ చిత్రానికి ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకుడు.

'అవతార్' టైటిల్ నేనే ఇచ్చా!





జేమ్స్ కామెరూన్ అద్భుత సృష్టి 'అవతార్.. ఫైర్ అండ్ యాష్' ఈ ఏడాది డిసెంబర్ 19న విడుదల కానుంది. గత రెండు చిత్రాలకంటే ఈ సినిమా నిడివి ఎక్కువ అని దర్శకుడు జేమ్స్ కామెరూన్ చెప్పారు. 'అవతార్' గురించి కొన్ని ఆసక్తికరమైన విషయాలను బాలీవుడ్ నటుడు గోవిందా ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఒకసారి అమెరికా వెళ్లినప్పుడు ఓ వ్యాపారవేత్త జేమ్స్ కామెరూన్‌ను పరిచయం చేశాడనీ, డిన్నర్ చేస్తూ అవతార్ గురించి జేమ్స్ చెప్పాడనీ, ఆ సినిమాకు 'అవతార్' అనే పేరు పెట్టమని తనే సూచించానని గోవిందా చెప్పారు. 'అవతార్' సినిమాలో శామ్ వర్తింగ్టన్ హీరోగా నటించారు. అయితే ఆ సినిమాలో హీరో పాత్ర చేయమని మొదట గోవిందాను అడిగారట జేమ్స్ కామెరూన్. 410 రోజులు పని చేయాలనీ, రూ. 18 కోట్ల ఆఫర్ కూడా ఇచ్చారట. గోవిందా మొదట ఓకే చెప్పారు కానీ శరీరానికి పెయింట్ వేసుకోవాలని జేమ్స్ చెప్పడంతో 'అన్ని రోజులు పెయింట్ వేసుకుని నటిస్తే నేను ఆస్పత్రిలో చేరడం ఖాయం అని నో చెప్పేశాను' అని ఆ ఇంటర్వ్యూలో వివరించారు గోవిందా. ఈ విషయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.



ప్రముఖ నటి షబానా అజ్మీని సీఎం సిద్ధరామయ్య జీవనసాఫల్య పురస్కారంతో సత్కరించారు. సీఎం అధికారిక నివాసం కావేరిలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సోమవారం ఆమెను ప్రత్యేకంగా సత్కరించారు. పురస్కారంతో పాటు రూ.10 లక్షల చెక్కును అందించారు.

ఏడవ శతాబ్దపు కథతో..



హీరో గోపీచంద్ కొత్త చిత్రం షూటింగ్ సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. 'ఘాజీ', 'ఐబీ 71', 'అంతరిక్షం' వంటి విభిన్న చిత్రాలను రూపొందించిన సంకల్ప్ రెడ్డి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. పవన్‌కుమార్ సమర్పణలో శ్రీనివాస చిట్టూరి నిర్మిస్తున్నారు. ఏడవ శతాబ్దం నేపథ్యంగా రూపుదిద్దుకునే ఈ చిత్రంలో ఓ ముఖ్యమైన, ఇంకా అన్వేషించని చారిత్రక సంఘటనను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నామనీ, ఇందులో గోపీచంద్ ఇంతవరకూ పోషించని ఓ అద్భుతమైన పాత్ర చేస్తున్నారనీ దర్శకుడు సంకల్పరెడ్డి చెప్పారు. విజువల్ వండర్‌గా, భారీ స్థాయిలో రూపుదిద్దుకొనే ఈ చారిత్రక చిత్రానికి టాప్ టెక్నీషియన్లు పని చేస్తున్నారు. మణికందన్ సినిమాటోగ్రఫీనీ, చిన్నా ప్రొడక్షన్ డిజైనింగ్‌ను, పృథ్వీ యాక్షన్ కొరియోగ్రఫీని అందిస్తున్నారు. సురేశ్‌బాబు, ప్రకాశ్ ఈ చిత్రానికి రచన చేస్తున్నారు.

నిర్మాతగా శ్రీకాంత్ ఓదెల



నాని హీరోగా నటించిన 'దసరా' చిత్రంలో దర్శకుడిగా పరిచయమైన శ్రీకాంత్ ఓదెల ప్రస్తుతం నానితోనే 'ద ప్యారడైజ్' చిత్రాన్ని రూపొందిస్తున్నారు. మెగాస్టార్ చిరంజీవి హీరోగా ఆయన మూడవ చిత్రం ఉంటుంది. ఇప్పుడు నిర్మాణరంగంలోకి అడుగుపెడుతున్నారు శ్రీకాంత్. అనురాగ్ రెడ్డి, శరత్‌చంద్రలతో కలసి 'ఏఐ అమీనా జరీనా రుక్సానా.. గులాబీ'. చిత్రాన్ని నిర్మిస్తున్నారు. శ్రీకాంత్ ఓదెల కథను సమకూర్చిన ఈ చిత్రంతో చేతన్ బండి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. '2009లో గోదావరిఖని పట్టణంలో జరిగిన ఓ సంఘటన ఆధారంగా రూపుదిద్దుకొనే ప్రేమకథ ఇది. ప్రీ ప్రొడక్షన్ పనులు ప్రారంభమయ్యాయి. త్వరలో షూటింగ్ ప్రారంభిస్తాం' అని శ్రీకాంత్ ఓదెల చెప్పారు.

లాయర్లపై మరింత గౌరవం పెరిగింది

ప్రియదర్శి



వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రియదర్శి నటించిన తాజా చిత్రం 'కోర్ట్'. 'ఏ స్టేట్ వర్సెస్ నోబడీ' ఉపశీర్షిక. రామ్ జగదీశ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను నాని సమర్పిస్తున్నారు. ప్రశాంతి తిపిర్నేని నిర్మించారు. ఈ నెల 14న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా ప్రియదర్శి మీడియాతో ముచ్చటించారు. "ప్రేక్షకులకు కొత్తదనం అందించే మంచి సినిమా చేయాలని ఎదురుచూసే సమయంలో దర్శకుడు రామ్ ఈ కథను చెప్పారు. సినిమాలో నా పాత్ర కోసం చాలా హోమ్ వర్క్ చేశాను. ఈ సినిమాతో లాయర్లపై మరింత గౌరవం పెరిగింది. చాలా నిజాయితీతో చేసిన ప్రయత్నం ఈ సినిమా. దర్శకుడు రామ్ చాలా ప్రతిభావంతుడు. సినిమాలోని ప్రతీ సన్నివేశాన్ని సహజంగా మలిచారు. నానిగారికి ఈ సినిమా కథపై ఎంతో నమ్మకం ఉంది. ఆయన నటించే సినిమా కన్నా ఈ సినిమా విషయంలోనే ఎక్కువ జాగ్రత్త తీసుకున్నారు. ఈ ఎంగేజింగ్ కోర్ట్ రూమ్ డ్రామా ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుంది. అందరికి గుర్తుండిపోతుంది" అని చెప్పారు.

ఐఫా అవార్డ్స్.. లాపతా లేడీస్ హవా


నోరా ఫతేహి
కార్తీక్ ఆర్యన్ | రాఘవ్ జాయల్ | రాకేశ్ రోషన్ | జాకీ బోడీవాలా | ప్రతిభ

భారత సినీప్రియులంతా ఆసక్తిగా ఎదురుచూసిన ఇంటర్నేషనల్ ఇండియన్ ఫిల్మ్ అకాడమీ (ఐఫా) అవార్డుల కార్యక్రమం ఆదివారం రాత్రి ముగిసింది. జైపూర్‌లో జరిగిన ఈ 25వ ఐఫా వేడుకల్లో భాగంగా తొలిరోజు డిజిటల్ అవార్డులను ప్రదానం చేశారు. వీటిని ఈ ఏడాదే ప్రవేశపెట్టడం విశేషం. వేడుకల్లో చివరి రోజైన ఆదివారం అందరూ ఆసక్తిగా ఎదురు చూసిన ఐఫా అవార్డుల విజేతలను ప్రకటించారు. ఆమిర్ ఖాన్ సతీమణి కిరణ్ రావు దర్శకత్వంలో తెరకెక్కిన 'లాపతా లేడీస్'ను అత్యధిక అవార్డుల వరించాయి. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకత్వం సహా మరో ఎనిమిది అవార్డులను దక్కించుకుంది. ఆ తర్వాతి స్థానాల్లో 'కిల్', 'భూల్ భూలయ్యా' చిత్రాలు నిలిచాయి. భారతీయ చలనచిత్రానికి అందించిన అత్యుత్తమ సేవలకు గాను, దర్శకుడు రాకేశ్ రోషన్‌కు 'అవుట్‌స్టాండింగ్ అచీవ్‌మెంట్ ఇన్ ఇండియన్ సినిమా' పేరిట పురస్కారం అందజేశారు. బాలీవుడ్‌కు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఈ వేడుకల్లో షారుక్ ఖాన్, షాహిద్ కపూర్, బాబీ డియోల్, మాధురీ దీక్షిత్, కరీనా కపూర్, కృతీ సనన్ వంటి తారలు ప్రధానాకర్షణగా నిలిచారు.


నితాన్షి గోయల్ | కిరణ్ రావు

విజేతల జాబితా

ఉత్తమ చిత్రం: లాపతా లేడీస్
ఉత్తమ నటుడు: కార్తీక్ ఆర్యన్ (భూల్ భూలయ్యా 3)
ఉత్తమ నటి: నితాన్షి గోయల్ (లాపతా లేడీస్)
ఉత్తమ దర్శకురాలు: కిరణ్ రావు (లాపతా లేడీస్)
ఉత్తమ దర్శకుడు (తొలి పరిచయం): కునాల్ కెమ్ము (మడగావ్ ఎక్స్‌ప్రెస్)
ఉత్తమ సహాయనటుడు: రవి కిషన్ (లాపతా లేడీస్)
ఉత్తమ సహాయనటి: జాకీ బోడీవాలా (షైతాన్)
ఉత్తమ నటుడు (తొలి పరిచయం): లక్ష్య లాల్వాని (కిల్)
ఉత్తమ నటి(తొలి పరిచయం): ప్రతిభ (లాపతా లేడీస్)
ఉత్తమ విలన్: రాఘవ్ జాయల్ (కిల్)
ఉత్తమ సంగీత దర్శకుడు: రామ్ సంపత్ (లాపతా లేడీస్)
ఉత్తమ గాయకుడు: జుబిన్ నౌటియల్ (ఆర్టికల్ 370)
ఉత్తమ గాయని: శ్రేయా ఘోషల్ (భూల్ భూలయ్యా 3)
ఉత్తమ కథ (ఒరిజినల్): బిప్లబ్ గోస్వామి (లాపతా లేడీస్)
ఉత్తమ ఎడిటింగ్: జాబిన్ మర్చంట్ (లాపతా లేడీస్)
ఉత్తమ స్క్రీన్‌ప్లే: స్నేహ దేశాయ్ (లాపతా లేడీస్)
ఉత్తమ సాహిత్యం: ప్రశాంత్ పాండే(లాపతా లేడీస్)

జోష్ నింపారు


కరీనా కపూర్

ప్రతీ ఏడాదీ ఐఫా వేడుకల్లో అత్యంత ఆకర్షణీయంగా నిలిచేవి వేదికపై బాలీవుడ్ స్టార్లు వేసే స్టెప్పులే. ఈ ఏడాదీ కనువిందైన స్టెప్పులతో సందడి చేశారు పలు తారలు. షారుఖ్, మాధురీ దీక్షిత్ కలసి 'దిల్‌తో పాగల్ హై' సినిమాలోని పాటలకు స్టెప్పులేసి.. ఆ చిత్రంలో వారు పోషించిన 'రాహుల్- పూజ' క్యారెక్టర్లను అభిమానులకు గుర్తుచేశారు. అలాగే, తన హిట్ సినిమాల్లోని పలు పాటలకూ హుషారెత్తించే డ్యాన్స్‌తో ఆకట్టుకున్నారు షారుఖ్. 'భూల్ భూలయ్యా 3'లోని హుక్ స్టెప్‌ను ఎలా వేయాలో కృతినాకు చూపించారు కార్తీక్ ఆర్యన్. ఆమె వెంటనే ఆ స్టెప్ వేసి అదరగొట్టారు. నటి నోరా ఫతేహి కూడా పలు పాటలకు డ్యాన్స్ చేశారు. ఈ వేడుకలో ఐకానిక్ దర్శకుడు, నటుడు రాజ్‌కపూర్‌కు ఆయన మనవరాలు కరీనా కపూర్ నివాళి అర్పించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. రాజ్‌కపూర్ నటించిన 'శ్రీ 420' సినిమాలోని ఓ పాటలో ఆయన ధరించిన కాస్ట్యూమ్స్‌నే వేసుకుని కరీనా డ్యాన్స్ చేశారు. అలాగే, ఆయన నటించిన మరికొన్ని చిత్రాల్లోని హిట్ సాంగ్స్‌కూ ఆమె కాలు కదిపారు.

షోలే సినిమా ప్రత్యేక ప్రదర్శన



ఐఫా వేడుకలో భాగంగా బాలీవుడ్ ఆల్‌టైమ్ క్లాసిక్ చిత్రం 'షోలే'ను ఆదివారం రాత్రి జైపూర్‌లోని రాజ్ మందిర్ సినిమా థియేటర్లో ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆ చిత్ర దర్శకుడు రమేశ్ సిప్పీ మాట్లాడుతూ "షోలే' సినిమాకు ఇంతటి ఆదరణ దక్కుతుందని కలలో కూడా ఊహించలేదు. ఐఫా సిల్వర్ జూబ్లీ వేడుకలు.. 'షోలే' సినిమా 50 ఏళ్లను పూర్తిచేసుకోవడం.. రెండూ ప్రత్యేక సందర్భాలే. మరో ప్రత్యేకమైన విషయం ఏమిటంటే, జైపూర్‌లోని రాజ్ మందిర్ సినిమా థియేటర్ కూడా 50 ఏళ్లు పూర్తి చేసుకుంది. జైపూర్‌కు ఎవరు వచ్చినా ఈ థియేటర్‌ను ఓ టూరిస్ట్ స్పాట్‌లా సందర్శించడం మర్చిపోరు" అని చెప్పారు.

ఐపీఎల్‌లో ఆ ప్రకటనలొద్దు

కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశం

న్యూఢిల్లీ: ఐపీఎల్‌లో మద్యం, పొగాకు ఉత్పత్తులకు సంబంధించిన ప్రకటనలను నిషేధించాలని నిర్వాహకులను కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆదేశించింది. అంతేకాదు..ఆ రెండు ఉత్పత్తులను తయారు చేసే సంస్థల ఇతర ప్రకటనలకూ చోటివ్వరాదని సూచించింది. ఈమేరకు ఐపీఎల్ ఛైర్మన్ అరుణ్ ధూమల్‌కు ఆరోగ్య శాఖ డైరెక్టర్ జనరల్ అతుల్ గోయెల్ లేఖ రాశారు. క్రికెటర్లు.. దేశ యువతకు మార్గదర్శకులని, అలాంటి ఆటగాళ్లకు మద్యం, పొగాకు ఉత్పత్తుల ప్రకటనలతో ప్రత్యక్షంగా, పరోక్షంగా సంబంధం ఉండకూడదని అన్నారు. 'ఈ నిబంధనలను ఐపీఎల్‌లో తప్పకుండా పాటించాలి. మ్యాచ్‌లు జరిగే స్టేడియాల లోపల, అలాగే ప్రత్యక్ష ప్రసారాలు, ఐపీఎల్‌తో ముడిపడిన ఇతర కార్యక్రమాల సందర్భంగా జాతీయ టెలివిజన్‌లలో మద్యం, పొగాకు ఉత్పత్తుల ప్రకటనలు కనిపించకూడదు' అని గోయెల్ స్పష్టంజేశారు.

బ్రూక్‌పై నిషేధం తప్పదా?

ఐపీఎల్‌నుంచి వైదొలగిన స్టార్

న్యూఢిల్లీ: ఈనెల 22 నుంచి జరిగే ఐపీఎల్ నుంచి ఇంగ్లండ్ బ్యాటర్ హ్యారీ బ్రూక్ వైదొలిగాడు. గతేడాది వేలంలో ఢిల్లీ క్యాపిటల్స్ అతడిని రూ.6.25 కోట్లకు కొనుగోలు చేసింది. జాతీయ జట్టు తరఫున ఆడేందుకే తాను ప్రాధాన్యమిస్తానని బ్రూక్ సోషల్ మీడియాలో పేర్కొన్నాడు. కానీ ఈ నిర్ణయంతో అతడు రాబోయే రెండు సీజన్ల పాటు నిషేధం ఎదుర్కొనే చాన్సుంది. ఎందుకంటే ఐపీఎల్ నిబంధన ప్రకారం..వేలంలో అమ్ముడైన విదేశీ ప్లేయర్ ఎవరైనా లీగ్ ఆరంభానికి ముందే తప్పుకొంటే అతడిపై రెండు సీజన్లు నిషేధం విధిస్తారు. గాయం విషయంలో మాత్రమే మినహాయింపు ఉంటుంది.

నాపై రూమర్స్ వద్దు: జడేజా



దుబాయ్: వన్డే ఫార్మాట్ నుంచి తప్పుకొంటున్నట్టు వస్తున్న కథనాలపై ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా స్పందించాడు. 'అనవసర రూమర్స్ వద్దు.. థ్యాంక్స్' అంటూ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో జడ్డూ పోస్ట్ చేశాడు. దీంతో ఇప్పట్లో వన్డేలకు గుడ్‌బై చెప్పడం లేదని అతడు స్పష్టం చేసినట్టయ్యింది. న్యూజిలాండ్‌తో ఫైనల్లో జడేజా కోటా ఓవర్లు పూర్తయ్యాక విరాట్ పరుగున వెళ్లి అతడిని కౌగిలించుకున్నాడు. దీంతో అతడికిదే చివరి మ్యాచ్ అంటూ సోషల్ మీడియాలో ఊహాగానాలు చెలరేగాయి. మరోవైపు ఫైనల్లో కివీస్‌పై ఫోర్‌తో విన్నింగ్ షాట్ బాదిన జడేజా పుష్ప-2 స్టయిల్లో సంబరాలు చేసుకున్నాడు. తన బ్యాట్‌ను వీపు వెనకాల ఉంచి 'నేషనల్ ఖిలాడీ అనుకున్నావా?' అనే కామెంట్‌తో ఇన్‌స్టాలో పోస్ట్ చేయడం వైరల్‌గా మారింది.

నో విక్టరీ పరేడ్!

న్యూఢిల్లీ: గతేడాది టీ20 వరల్డ్‌కప్ నెగ్గిన తర్వాత ముంబైలో టీమిండియా విక్టరీ పరేడ్ చేసింది. ఓపెన్ టాప్ బస్సులో వరల్డ్‌కప్ ట్రోఫీతో క్రికెటర్లు సందడి చేశారు. ఇప్పుడు చాంపియన్స్ ట్రోఫీ గెలవడంతో మరోసారి బస్సు యాత్ర నిర్వహిస్తారని అభిమానులు ఆశించారు. కానీ, ఈసారి అలాంటి పరేడ్‌లాంటివి ఏమీ జరపడం లేదు. ఈ నెల 22 నుంచి ఐపీఎల్ జరగనున్న నేపథ్యంలో ఆటగాళ్లు స్వల్ప విరామాన్ని కోరుకొంటున్నారు. ఈ నేపథ్యంలో దుబాయ్ నుంచి భారత ఆటగాళ్లు విడివిడిగా స్వస్థలాలకు చేరుకోనున్నారు.

తెల్ల బ్లేజర్లు ఎందుకు?

భారత్ గెలిచిన తర్వాత ఆటగాళ్లంతా తెల్లటి బ్లేజర్లు వేసుకొని బహుమతి ప్రదాన కార్యక్రమానికి రావడం అందరి దృష్టినీ ఆకర్షించింది. అయితే, ఈ సంప్రదాయం ఒక్క చాంపియన్స్ ట్రోఫీలోనే ఉంది. వైట్ సూట్ ఆటగాళ్ల గౌరవం, దృఢ సంకల్పానికి నిదర్శనమని ఐసీసీ తెలిపింది. ట్రోఫీ విజేతలకు ఇలా వైట్ బ్లేజర్లు ఇచ్చే సంప్రదాయాన్ని 2009లో ఐసీసీ ప్రవేశపెట్టింది.



వన్డేలకే పరిమితమా?

గతేడాది టీ20 వరల్డ్‌కప్ గెలవగానే భారత జట్టు కెప్టెన్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజా ముగ్గురూ పొట్టి ఫార్మాట్‌కు బైబై చెప్పారు. ఈసారి కూడా చాంపియన్స్ ట్రోఫీ నెగ్గగానే.. ముఖ్యంగా రోహిత్ తప్పుకొంటాడంటూ కథనాలు వెలువడ్డాయి. కానీ అలా ఏమీ జరగలేదు. రిటైర్మెంట్‌పై తానే నేరుగా తేల్చి చెప్పాడు. 'భవిష్యత్ ప్రణాళికలంటూ ఏమీ లేవు. కాలం ఎలా సాగనిస్తే అలా ముందుకెళ్తా. ప్రస్తుతానికైతే వన్డేలకు గుడ్‌బై చెప్పడం లేదు. ఎలాంటి వదంతులు వ్యాప్తిచేయకండి' అంటూ ఫైనల్ గెలిచాక హిట్‌మ్యాన్ సూచించాడు. ఇక ఇప్పుడు అందరి దృష్టి 2027 వన్డే వరల్డ్‌కప్‌పై ఉంది. అప్పటి వరకు అతను జట్టులో కొనసాగుతాడా? లేదా? అనే సందేహం వ్యక్తమవుతోంది. వాస్తవానికి ఆ మెగా టోర్నీకి ఎక్కువ సమయమే ఉంది. అప్పటికి రోహిత్ వయస్సు 40 దరిదాపుల్లో ఉంటుంది. ఆ టోర్నీలో ఆడే విషయమై ఇప్పటికైతే తానేమీ చెప్పలేనని స్పష్టం చేశాడు. అటు న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలతో టెస్టు సిరీస్‌లను ఘోరంగా ఓడడంతో రోహిత్ కెప్టెన్సీపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. బ్యాటర్‌గానూ విఫలం కావడంతో ఇక అతను సుదీర్ఘ ఫార్మాట్‌లో కొనసాగేది కష్టమేనని అంతా భావించారు. కానీ టెస్టుల విషయమై ఇప్పటి వరకూ అతడు ఏ నిర్ణయమూ తీసుకోలేదు. వచ్చే జూన్ 20 నుంచి ఇంగ్లండ్‌తో సిరీస్ ద్వారా డబ్ల్యూటీసీ కొత్త సీజన్ ఆరంభం కానుంది. అలాగాకుండా ఒకవేళ వన్డేలకే పరిమితమవుతాడనుకుంటే.. వచ్చే వరల్డ్‌కప్ నాటికి భారత జట్టు 27 మ్యాచ్‌లాడుతుంది. ఇందులో మూడు వన్డేల చొప్పున తొమ్మిది ద్వైపాక్షిక సిరీస్‌లుంటాయి. వీటికి తోడు పరిమిత ఓవర్లలో అదనపు మ్యాచ్ సమయం కావాలనుకుంటే ఐపీఎల్, విజయ్ హజారే ట్రోఫీలోనూ ఆడే చాన్సుంది. రిటైర్మెంట్ అనేది ఆటగాళ్ల వ్యక్తిగత నిర్ణయమైనప్పటికీ విరాట్, రోహిత్‌లాంటి ఆటగాళ్ల విషయంలో చాలా సమీకరణాలుంటాయి. వన్డే వరల్డ్‌కప్‌నకు అనుభవజ్ఞులైన ఆటగాళ్లతో వెళ్లాలని చీఫ్ సెలెక్టర్, కోచ్ భావిస్తే రోహిత్ సేవలు జట్టుకు కీలకమవుతాయి.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

రోహిత్ వల్లే ట్రోఫీ దూరం



కివీస్ కెప్టెన్ శాంట్నర్

దుబాయ్: రోహిత్ శర్మ అసాధారణ ఆటతీరే రెండు జట్ల మధ్య తేడా అని న్యూజిలాండ్ సారథి శాంట్నర్ విశ్లేషించాడు. చాంపియన్స్ ట్రోఫీ ఫైనల్లో ఓటమిని చేదు ముగింపుగా అభివర్ణించాడు. అయితే, బలమైన టీమ్ చేతిలోనే ఓడామన్నాడు. 'రోహిత్ ఆటతీరే.. మాకు మ్యాచ్‌ను దూరం చేసింది. దుబాయ్ పరిస్థితులను చక్కగా అర్థం చేసుకొన్న భారత్.. గొప్పగా ఆడింది. ఒకరకంగా ఇది మాకు మిశ్రమ ఫలితమే' అని శాంట్నర్ చెప్పాడు.



రోహిత్‌కు దక్కని చోటు

ఐసీసీ డ్రీమ్ టీమ్‌లో
కోహ్లీ సహా ఆరుగురు

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ ఐసీసీ 'టీమ్ ఆఫ్ ద టోర్నమెంట్'లో విరాట్ కోహ్లీ సహా ఆరుగురు భారత ఆటగాళ్లకు చోటుదక్కింది. శాంట్నర్ (న్యూజిలాండ్) సారథ్యంలో మొత్తం 12 సభ్యుల డ్రీమ్ టీమ్‌ను ఐసీసీ సోమవారం ప్రకటించింది. విరాట్, శ్రేయాస్ అయ్యర్, రాహుల్, వరుణ్ చక్రవర్తి, షమితోపాటు 12వ ఆటగాడిగా అక్షర్ పటేల్‌ను ఎంపిక చేశారు. అయితే, ట్రోఫీ గెలిచిన జట్టు సారథి రోహిత్ శర్మకు చోటు దక్కలేదు.

ఐసీసీ టీమ్: రచిన్ (న్యూజిలాండ్), జద్రాన్ (అఫ్ఘానిస్థాన్), కోహ్లీ, శ్రేయాస్, రాహుల్ (వికెట్ కీపర్), ఫిలిప్స్ (న్యూజిలాండ్), అజ్మతుల్లా (అఫ్ఘానిస్థాన్), శాంట్నర్ (కెప్టెన్), హెన్రీ (న్యూజిలాండ్), షమి, వరుణ్, అక్షర్.

'టాప్' దిశగా ముంబై

ఉత్కంఠ పోరులో గుజరాత్‌పై గెలుపు

ముంబై: సొంత మైదానంలో ముంబై ఇండియన్స్ చెలరేగింది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంపై కన్నేసిన ముంబై ఆ దిశగా అడుగేసింది. సోమవారం జరిగిన ఉత్కంఠ పోరులో 9 పరుగులతో గుజరాత్ జెయింట్స్‌ను ఓడించింది. తొలుత ముంబై 20 ఓవర్లలో 179/6 స్కోరు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (54) హాఫ్ సెంచరీ చేయగా, నాట్ సివర్ బ్రంట్ (38) సత్తా చాటింది. ఛేదనలో గుజరాత్ 20 ఓవర్లలో 170 రన్స్‌కు ఆలౌటైంది. భారతీ ఫుల్‌మాలీ (61) అర్ధ శతకంతో పోరాడింది. హర్మన్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది. ఈ విజయంతో ముంబై (10 పాయింట్లు) రెండో స్థానానికి దూసుకొచ్చింది. మంగళవారం జరిగే ఆఖరి లీగ్ మ్యాచ్‌లో బెంగళూరుతో ముంబై తలపడనుంది. ఈ మ్యాచ్‌లోనూ ముంబై గెలిస్తే టేబుల్ టాపర్‌గా నేరుగా ఫైనల్లో ప్రవేశిస్తుంది. కాగా..ఢిల్లీ, ముంబై, గుజరాత్ ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు చేరిన సంగతి తెలిసిందే.

డబ్ల్యూపీఎల్‌లో నేడు
ముంబై x బెంగళూరు



హర్మన్‌ప్రీత్ (54)

సంక్షిప్తస్కోర్లు

ముంబై: 20 ఓవర్లలో 179/6 (హర్మన్ 54, నాట్ సివర్ 38, అమన్‌జోత్ 27, హేలీ మాథ్యూస్ 27, ప్రియా మిశ్రా 1/23); **గుజరాత్:** 20 ఓవర్లలో 170 ఆలౌట్ (ఫుల్ మాలీ 61, హర్లీన్ 24, కెర్ 3/34, హేలీ మాథ్యూస్ 3/38, షబ్నిమ్ 2/17).

భారత షట్లర్లకు విషమ పరీక్ష!



గాయత్రి



సాత్విక్

- నేటి నుంచి ఆల్ ఇంగ్లండ్ ఓపెన్
- బరిలో సింధు, ప్రణయ్, సేన్
- డబుల్స్‌లో సాత్విక్, గాయత్రి జోడీలు

బర్మింగ్‌హామ్: పేలవ ఫామ్, గాయాలతో ఇబ్బందులు పడుతున్న భారత షట్లర్లకు ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో విషమ పరీక్ష ఎదురుకానుంది. మంగళవారం నుంచి జరిగే మెగా టోర్నీలో డబుల్స్ టాప్ జోడీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ షెట్టి మినహా మిగతా ప్లేయర్లు అన్‌సీడెడ్‌గా బరిలోకి దిగడమే అందుకు కారణం. ఈ ఏడాది టోర్నీలో మనోళ్ల ప్రదర్శనపై అంతగా అంచనాలు లేవు. గాయం నుంచి కోలుకొన్న సింధుతోపాటు హెచ్‌ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్ కూడా ఆకట్టుకోలేక పోతున్నారు. ఇక, సాత్విక్ తన తండ్రిని కోల్పోయిన బాధలో ఉన్నాడు. తొలి రౌండ్‌లో కిమ్ గా ఉన్ (కొరియా)తో సింధు, రెండో సీడ్ మిన్ యో (సింగపూర్)తో మాళవిక బన్సోడ్ తలపడనున్నారు. పురుషుల సింగిల్స్ మొదటి రౌండ్‌లో కోకి వతనబె (జపాన్)తో లక్ష్య ఆడనున్నాడు. ఒకవేళ సేన్ నెగ్గితే.. ప్రీ క్వార్టర్స్‌లో మూడో సీడ్ జొనాథన్ క్రిస్టీతో తలపడాల్సి ఉంటుంది. టోమా జూనియర్ పొపోవ్ (ఫ్రాన్స్)తో ప్రణయ్ ఆడనున్నాడు. డబుల్స్‌లో డెన్మార్క్‌కు చెందిన డేనియల్-మ్యాడ్స్ వెస్టర్‌గార్డ్స్‌తో ఏడో సీడ్ సాత్విక్-చిరాగ్ జంట, చైనీస్ తైపీ జోడీతో వరల్డ్ నెం. 9 ట్రీసా జాలీ-గాయత్రి జంటలు తలపడనున్నాయి. అశ్విని పొన్నప్ప-తనీషా క్యాస్ట్రో, ప్రియాంక-శ్రుతి మిశ్రా.. మిక్స్‌డ్‌లో రోహన్ కపూర్-రుత్విక శివాని, ధ్రువ్ కపిల-తనీషా, సతీష్-ఆద్య జోడీలు కూడా బరిలో నిలవనున్నాయి.



సేన్



ప్రణయ్



ప్రైవేట్ జెట్‌లో ఇంగ్లండ్‌కు సింధు

పీవీ సింధు ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ టోర్నమెంట్‌లో ఆడేందుకు ప్రైవేట్ జెట్‌లో అక్కడికి చేరుకుంది. సింధు తన సహాయ సిబ్బందితో కలిసి ఈ జెట్‌లో ఇంగ్లండ్‌కు వెళ్లింది. ఈ విషయాన్ని సింధునే స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో తెలియజేసింది. సింధు జెట్‌లో ఎక్కుతున్న వీడియోను తన సోషల్ మీడియా ఖాతాల్లో పెట్టడంతో వైరల్‌గా మారింది.

వేదికపై మాకేదీ ఆహ్వానం?

ఐసీసీపై పీసీబీ గరం గరం

దుబాయ్: చాంపియన్స్ ట్రోఫీ ప్రదానోత్సవంలో తమ ప్రతినిధిని వేదికపైకి ఆహ్వానించకపోవడంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) ఆగ్రహం వ్యక్తంజేసింది. దీనిపై ఐసీసీకి తన నిరసన తెలియజేయాలని నిర్ణయించింది. చాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్య దేశం పాకిస్థాన్ కావడంతో..ముగింపు కార్యక్రమానికి టోర్నీ డైరెక్టర్, పీసీబీ సీఈవో సుమైర్ అహ్మద్‌ను ఆహ్వానిస్తారని భావించింది. వాస్తవానికి పీసీబీ ఛైర్మన్ మొహసిన్ నక్వీని ట్రోఫీ ప్రదానోత్సవ సభా వేదికపైకి ఆహ్వానించాలని ఐసీసీ భావించింది. కానీ ముందస్తు కార్యక్రమాల రీత్యా ఆయన ఫైనల్‌కు హాజరు కాలేదు. ఈనేపథ్యంలో ఫైనల్ ప్రదానోత్సవ వేడుక ప్రణాళికలో మార్పు చేసినట్టు పీసీబీకి ఐసీసీ వివరించింది. కానీ ఐసీసీ వివరణను పాకిస్థాన్ తిరస్కరించింది. తమ సీఈవో సుమైర్ ఫైనల్‌కు హాజరయ్యారని, ప్రొటోకాల్ రీత్యా పీసీబీ చీఫ్‌కు బదులు ఆయనను వేదికపైకి ఆహ్వానించాలన్న విషయాన్ని గుర్తు చేసింది.

రియల్ మనీ గేమింగ్ కంపెనీలకు
ప్రవర్తనా నియమావళి



న్యూఢిల్లీ: రియల్ మనీ గేమింగ్ (ఆర్‌ఎంజీ) కంపెనీలకు ప్రవర్తనా నియమావళిని నిర్దేశించేందుకు దోహదపడే ఒప్పందంపై ఆ కంపెనీలకు ప్రాతినిథ్యం వహించే ఏఐజీఎఫ్, ఈజీఎఫ్, ఎఫ్ఐఎఫ్ఎస్ సంతకాలు చేశాయి. యూజర్ల భద్రతకు, బాధ్యతాయుతమైన గేమింగ్ విధానాలకు ఈ చర్య దోహదపడుతుంది. ఇందులో భాగంగా ఈ సంస్థల భాగస్వామ్యంలోని కంపెనీలు కేవైసీ పరిశీలన, ఆన్‌లైన్‌పై గడిపే కాలపరిమితి నియంత్రణకు చర్యలు తీసుకుంటాయి. ఇది 50 కోట్ల మంది పైగా ఆన్‌లైన్ గేమర్ల ప్రయోజనాలు పరిరక్షిస్తుందని పరిశ్రమ వర్గాలంటున్నాయి. ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ ఆన్‌లైన్ గేమింగ్ నిబంధనలు 2023 ఏప్రిల్‌లోనే రూపొందించినప్పటికీ వాటిని ఇంకా అమలు చేయలేదు. ఇదిలా ఉండగా ఈ సంస్థల భాగస్వామ్య కంపెనీల్లో డ్రీమ్ 11, మై 11 సర్కిల్, ఖేలో ఫ్యాంటసీ లైవ్, ఎస్‌జీ11 ఫ్యాంటసీ, వింజో, గేమ్స్ 24గ7, జంగ్లీ గేమ్స్ ఉన్నాయి.

ఆర్‌ఎంజీ నియంత్రణకు తమిళనాడు కఠిన నిబంధనలు

రియల్ మనీ గేమ్స్‌ను గతంలో నిషేధించిన తమిళనాడు తాజాగా వాటికి కఠిన నిబంధనలు రూపొందించింది. వీటి ప్రకారం ఈ వేదికలపై మైనర్లు ఆడడాన్ని నిషేధించింది. గేమర్లకు వ్యయ నియంత్రణలు విధించింది. అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు బ్లాంక్ అవర్‌గా ప్రకటించింది. దీని వల్ల ఈ మధ్య కాలంలో ఎవరూ లాగిన్ అయ్యే అవకాశం కూడా ఉండదు.

హైదరాబాద్, చెన్నైల్లో రెండు కొత్త ప్లాంట్లు

ఆశీర్వాద్ పైప్స్

కోల్‌కతా: ఆశీర్వాద్ పైప్స్‌లో వంద శాతం వాటా కలిగిన బెల్జియంకు చెందిన ఫ్లూయిడ్ మేనేజ్‌మెంట్ సంస్థ అలియాక్సిస్ వచ్చే రెండేళ్లలో భారత్‌లో కార్యకలాపాలను విస్తరించనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా హైదరాబాద్, చెన్నైల్లో రెండు కొత్త ప్లాంట్లు ఏర్పాటు చేయనుంది. ఆశీర్వాద్ పైప్స్ సీఈఓ పార్థ సారథి బసు ఈ విషయం వెల్లడించారు. ఈ రెండు కొత్త ప్లాంట్ల ఏర్పాటు కోసం కంపెనీ వచ్చే రెండేళ్లలో రూ.400 కోట్లు ఖర్చు చేయనుంది. కొత్త ప్లాంట్ల ఏర్పాటుతో కంపెనీ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 3 లక్షల టన్నుల నుంచి 4 లక్షల టన్నులకు, మార్కెట్ వాటా ప్రస్తుత 12 శాతం నుంచి 18 శాతానికి పెరుగుతుందని బసు చెప్పారు. దేశ పైపులు, ఫిట్టింగ్స్ మార్కెట్లో అద్భుత అవకాశాలు ఉన్నట్టు తెలిపారు. ఈ కొత్త ప్లాంట్లతో పాటు కటక్, దుర్గాపూర్‌లోని రెండు ప్లాంట్ల ఉత్పత్తి సామర్థ్యాలను విస్తరించబోతున్నట్లు బసు చెప్పారు.

బిజినెస్

ఎస్ఎంఈ ఐపీఓ నిబంధనలు కఠినతరం



మూడేళ్లలో రెండు సార్లు కనీసం రూ.కోటి వార్షిక లాభం ఆర్జించాలి..

- ఆఫర్ ఫర్ సేల్‌పై 20% పరిమితి
- నోటిఫికేషన్ విడుదల చేసిన సెబీ

న్యూఢిల్లీ: చిన్న, మధ్య తరహా సంస్థ (ఎస్ఎంఈ)ల పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ మార్కెట్ నియంత్రణాధికార సంస్థ సెబీ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎస్ఎంఈ ఐపీఓలకు కొత్తగా లాభాల నిబంధనను ప్రవేశపెట్టడంతో పాటు పబ్లిక్ ఇష్యూ ద్వారా సంస్థ ప్రమోటర్లు, వాటాదారులు విక్రయించగలిగే వాటా షేర్లను ఇష్యూ సైజులో 20 శాతానికి పరిమితం చేసింది. అంతేకాదు, కంపెనీలోని వారి వాటాలో 50 శాతానికి మించి విక్రయించడానికి వీల్లేదు. గడిచిన కొంత కాలంలో ఎస్ఎంఈలు ఐపీఓలకు రావడం, ఆ ఇష్యూల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఇన్వెస్టర్లు ఎగబడటం చూశాం. ఈ నేపథ్యంలో ఐపీఓ ఇన్వెస్టర్ల ప్రయోజనాలను రక్షించడంతో పాటు మెరుగైన ఆర్థిక పనితీరు కలిగిన ఎస్ఎంఈలు మాత్రమే పబ్లిక్ ఇష్యూ ద్వారా నిధులు సేకరించేందుకు అనుమతించడమే సెబీ తాజా సంస్కరణల ప్రధానోద్దేశం. లాభదాయకత విషయానికొస్తే, ఐపీఓకు రావాలనుకుంటున్న ఎస్ఎంఈలు అంతక్రితం మూడు ఆర్థిక సంవత్సరాల్లో కనీసం రెండు సార్లు కనిష్ఠంగా రూ.కోటి నిర్వహణ లాభాన్ని ఆర్జించి ఉండాలి. సెబీ నోటిఫికేషన్‌లోని మరిన్ని నిబంధనలు..

- కనీస ప్రమోటర్ కాంట్రిబ్యూషన్ (ఎంపీసీ)పై ప్రమోటర్ల వాటా దశల వారీ లాకిన్ గడువుకు లోబడి ఉంటుంది. అదనపు వాటాలో సగం లాకిన్ గడువు ఏడాది తర్వాత ముగుస్తుంది. మిగతా 50 శాతం లాకిన్ గడువు రెండేళ్ల తర్వాత ముగుస్తుంది.
- ఇకపై ఎస్ఎంఈ ఐపీఓల్లోనూ సంస్థాగతేతర ఇన్వెస్టర్లకు షేర్ల కేటాయింపు కోసం ప్రధాన ఐపీఓల్లో పాటించే విధానాన్నే అనుసరించాల్సి ఉంటుంది.
- భారీ రిటర్నుల ఆశలతో ఈ విభాగ పబ్లిక్ ఆఫరింగ్స్‌లో పెట్టుబడులు పెట్టేందుకు చిన్న మదుపరులు సైతం ఎగబడుతున్నారు. ఈ నేపథ్యంలో ఎస్ఎంఈ ఐపీఓకు పెట్టుబడి పెట్టాలనుకునే ఇన్వెస్టర్ ఇకపై 2 లాట్స్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.
- ఎస్ఎంఈలు ఐపీఓ ద్వారా సేకరించే నిధుల్లో సాధారణ కార్పొరేట్ అవసరాల కోసం కేటాయించగలిగే వాటాను ఇష్యూ సైజులో 15 శాతం లేదా రూ.10 కోట్లకు (ఏది తక్కువైతే అది) పరిమితం చేసింది.
- ఎస్ఎంఈలు ఐపీఓ ద్వారా సమీకరించిన నిధులతో ప్రమోటర్లు, ప్రమోటర్ గ్రూప్స్ లేదా సంబంధిత వర్గాల నుంచి సేకరించిన రుణాలను ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా తిరిగి చెల్లించేందుకు అనుమతి లేదు.
- ఎస్ఎంఈల ఐపీఓ పత్రాలు (డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్-డీఆర్‌హెచ్‌పీ) ప్రజాభిప్రాయాల కోసం 21 రోజుల పాటు అందుబాటులో ఉండాలి. ఐపీఓకు వచ్చే ఎస్ఎంఈలు వార్తా పత్రికల్లో ప్రకటనలు జారీ చేయడంతో పాటు డీఆర్‌హెచ్‌పీని యాక్సెస్ చేసేందుకు ఆ ప్రకటనల్లో క్యూఆర్ కోడ్‌ను సైతం చేర్చాలి.
- ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌లో లిస్టయిన కంపెనీలు మెయిన్ ప్లాట్‌ఫామ్‌కు అప్‌గ్రేడ్ కాకుండానే మరిన్ని ఇష్యూల ద్వారా నిధులు సమీకరించవచ్చు. అయితే, మెయిన్ ప్లాట్‌ఫామ్‌లో నమోదైన కంపెనీలకు వర్తించే ఎల్‌ఓడీఆర్ నిబంధనలకు లోబడి ఉండాలి.
- ఇకపై ఎస్ఎంఈ లిస్టెడ్ కంపెనీలూ మెయిన్ ప్లాట్‌ఫామ్‌లో నమోదైన ప్రధాన కంపెనీలకు వర్తించే రిలేటెడ్ పార్టీ ట్రాన్సాక్షన్స్ (ఆర్‌పీటీ) నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. ఇందుకోసం ఇష్యూ ఆఫ్ క్యాపిటల్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్ (ఐసీడీఆర్) నిబంధనలను సెబీ నోటిఫై చేసింది.

హైదరాబాద్‌లో ఎఫ్‌టీజీ ఏరోస్పేస్ యూనిట్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): హైదరాబాద్‌లో మరో అంతర్జాతీయ సంస్థ కొలువు తీరుతోంది. కెనడా కేంద్రంగా పనిచేసే ప్రముఖ ఏరోస్పేస్ కంపెనీ ఫిరన్ టెక్నాలజీ గ్రూప్ (ఎఫ్‌టీజీ) హైదరాబాద్‌లో తన తయారీ యనిట్‌ను ఏర్పాటు చేస్తోంది. జీఎంఆర్ ఏరోస్పేస్ సెజ్‌లో 28,000 చదరపు అడుగుల (ఎస్‌ఎఫ్‌టీ) విస్తీర్ణంలో ఈ యూనిట్ ఏర్పాటు కానుంది. ఈ ఏడాది చివరికల్లా ఈ యూనిట్‌లో విమానాల కాక్‌పిట్‌లో ఉపయోగించే పరికరాలు, బ్యాక్‌లైట్ ప్యానల్స్ ఇతర అధునాతన పరికరాల ఉత్పత్తి ప్రారంభమవుతుంది. భవిష్యత్‌లో ఈ యూనిట్‌ను మరింత విస్తరించాలని కంపెనీ భావిస్తోంది. హైదరాబాద్ ఏరోస్పేస్ రంగంలోకి కెనడా నుంచి వచ్చిన తొలి పెట్టుబడి ఇదే కావటం విశేషం.

భారత్‌లో ఏఐ నిపుణులకు భారీ కొరత

2027 నాటికి 10 లక్షలకు పెరగవచ్చు.. బెయిన్ అండ్ కంపెనీ అంచనా



న్యూఢిల్లీ: ప్రపంచ కృత్రిమ మేధ (ఏఐ) నిపుణుల హబ్‌గా ఎదిగేందుకు భారత్ సిద్ధంగా ఉందని బెయిన్ అండ్ కంపెనీ తాజా నివేదిక పేర్కొంది. కానీ, దేశంలో ఏఐ నిపుణుల కొరత పెరుగుతోందని, ఈ రంగంలో భారత పురోగతికి ఇది అవరోధంగా మారవచ్చని అభిప్రాయపడింది. 2027 నాటికి భారత ఏఐ రంగం 10 లక్షలకు పైగా నిపుణుల కొరతను ఎదుర్కొనవచ్చని అంచనా వేసింది. ఏఐ నిపుణులకు గిరాకీ పెరుగుతున్న నేపథ్యంలో భారత్ తన కార్మిక శక్తికి ఈ నైపుణ్యంలో శిక్షణ అందించాల్సిన తక్షణావసరాన్ని బెయిన్ అండ్ కంపెనీ నివేదిక నొక్కి చెప్పింది. మరో రెండేళ్లలో ఏఐ ఉద్యోగావకాశాలు నిపుణుల లభ్యతతో పోలిస్తే 1.5-2 రెట్ల స్థాయిలో ఉండవచ్చని అంటోంది. ఇది సవాలుతో పాటు అవకాశం కూడా. ప్రస్తుత సాంకేతిక నిపుణులకు ఏఐలో శిక్షణ ఇవ్వడం ద్వారా ఈ లోటును భర్తీ చేసుకోవచ్చని బెయిన్ అండ్ కంపెనీ భారత పార్ట్‌నర్ సైకత్ బెనర్జీ అన్నారు. 2027 నాటికి భారత ఏఐ రంగంలో ఉద్యోగావకాశాలు 23 లక్షలు దాటవచ్చని.. అప్పటికి ఏఐ నిపుణుల లభ్యత మాత్రం 12 లక్షలకు పెరగవచ్చని, ఈ నేపథ్యంలో మరో 10 లక్షల మందికి ఈ ఆధునిక సాంకేతికతలో శిక్షణ ఇప్పించవచ్చని నివేదిక పేర్కొంది. 2019 నుంచే ఏఐ ఉద్యోగావకాశాలు వెల్లువెత్తాయి. ఏటా 21 శాతం పెరుగుతూ వచ్చాయని, ఈ రంగంలో నిపుణులకు పారితోషికం ఏటా 11 శాతం పెరుగుతూ వచ్చింది. అయినప్పటికీ, ఈ రంగంలో నిపుణుల లభ్యత మాత్రం అంతగా పెరగలేదు.

● జీఎంఆర్ హైదరాబాద్ విమానాశ్రయానికి అవార్డు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (జీహెచ్ఐఏఎల్)కు మరో ప్రతిష్ఠాత్మక అవార్డు లభించింది. గత ఏడాదికి గాను ఆసియా, పసిఫిక్ ప్రాంతంలో ఏఎస్‌క్యూ బెస్ట్ ఎయిర్‌పోర్టు అవార్డుకు ఎంపికైంది. ఈ ప్రాంతంలో ఏటా కోటిన్నర నుంచి 2.5 కోట్ల మంది ప్రయాణించే విమానాశ్రయాల విభాగంలో జీహెచ్ఐఏఎల్‌కు ఏసీఐ నుంచి ఈ అవార్డు లభించింది.

సన్ ఫార్మా చేతికి చెక్‌పాయింట్ ..

న్యూఢిల్లీ: క్యాన్సర్ చికిత్స ఇమ్యునోథెరపీ ఔషధాల తయారీలో ప్రసిద్ధ కంపెనీగా పేరెన్నిక గన్న చెక్‌పాయింట్ థెరప్యూటిక్స్‌ను సన్ ఫార్మా కొనుగోలు చేస్తోంది. ఈ డీల్ విలువ 35.5 కోట్ల డాలర్లు (రూ.3,088.5 కోట్లు). ఉభయ సంస్థలు ఈ మేరకు ఒక ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఆ ఒప్పందం ప్రకారం చెక్‌పాయింట్ షేర్‌హోల్డర్లకు వారి వద్ద ఉన్న ప్రతి ఒక్క షేరుకు సన్ ఫార్మా 4.10 డాలర్లు (రూ.356.7) నగదు రూపంలో నేరుగా చెల్లిస్తుంది.

ఆఖరి గంటలో అమ్మకాలు

■ సెన్సెక్స్ 217 పాయింట్లు డౌన్

ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు సోమవారం నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 217.41 పాయింట్లు కోల్పోయి 74,115.17 వద్దకు జారుకుంది. ఇంట్రాడే గరిష్ఠ స్థాయితో పోలిస్తే, సూచీ ఒక దశలో 700 పాయింట్లకు పైగా క్షీణించింది. నిఫ్టీ విషయానికొస్తే, 92.20 పాయింట్ల నష్టంతో 22,460.30 వద్ద క్లోజైంది. ఆరంభం నుంచి సూచీలు పాజిటివ్‌గానే ట్రేడవుతూ వచ్చినప్పటికీ, ఆఖరి గంటలో ఇన్వెస్టర్లు ఇండస్ట్రియల్స్, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లలో భారీగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 8 రాణించగా.. 22 నష్టపోయాయి. కాగా బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.43 లక్షల కోట్లకు పైగా తగ్గి రూ.393.86 లక్షల కోట్లకు (4.51 లక్షల కోట్ల డాలర్లు) పడిపోయింది.

అమెరికాలో మాంద్యం భయాలు.. భారీ నష్టాల్లో సూచీలు

అమెరికా మార్కెట్లను మళ్లీ ఆర్థిక మాంద్యం భయాలు కమ్ముకున్నాయి. డొనాల్డ్ ట్రంప్ సుంకాల మోతతో దేశ ఆర్థిక ప్రగతి మందగించవచ్చన్న భయాల నేపథ్యంలో యూఎస్ స్టాక్ సూచీలు సోమవారం భారీ నష్టాల్లో ట్రేడయ్యాయి. ప్రారంభ ట్రేడింగ్‌లో డౌజోన్స్ 325 పాయింట్లు (0.8 శాతం) క్షీణించగా.. ఎస్ అండ్ పీ 500 ఇండెక్స్ 1.9 శాతం, నాస్‌డాక్ 3.5 శాతం పతనమయ్యాయి. దాంతో ఎస్ అండ్ పీ, నాస్‌డాక్ 2024 సెప్టెంబరు నాటికి కనిష్ఠ స్థాయికి జారుకున్నాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



11వ తేదీ			
హైదరాబాద్	410	విజయవాడ	420
వరంగల్	412	గోదావరి	410
చిత్తూరు	443	విశాఖపట్నం	415
		డజను గుడ్లు రూ. 66	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	68	విజయవాడ	90
వరంగల్	68	గుంటూరు	85
కరీంనగర్	68	ఒంగోలు	85
మహబూబ్‌నగర్	68	చిత్తూరు	72
కర్నూలు	68	నెల్లూరు	77
విశాఖపట్నం	89	అనంతపురం	77
గోదావరి	90		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	87,820 ▲	80,500 ▲	1,08,000 ▼
విజయవాడ	88,500 ▼	83,500 ▼	99,500 ▲
విశాఖపట్నం	86,220 ▲	79,040 ▲	97,840 ▲
రాజమండ్రి	87,820 ▲	80,500 ▲	99,400 ▼
ప్రొద్దుటూరు	87,800 ▼	81,300 ▼	98,200 ▼
ముంబై	85,932 ▼	78,714 ▲	96,634 ▼

అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ హరీశ్‌రావు

» మహిళల పట్ల ఆయనది మొసలి కన్నీరు: మంత్రి సీతక్క

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా మాజీ మంత్రి హరీశ్ రావు వ్యవహరిస్తున్నారని మంత్రి సీతక్క విమర్శించారు. గత ప్రభుత్వంలో ఆర్థిక శాఖ మంత్రిగా ఉన్న ఆయన మహిళా సంఘాలకు చేసిందేమీ లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన మహిళా సభ విజయవంతం కావడంతో కళ్లల్లో నిప్పులు పోసుకుని అబద్ధాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ వేదికగా వారి బండారాన్ని బయటపెడతామన్నారు. మహిళా సంఘాల బ్యాంకు రుణాలకు కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీలు చెల్లించడం లేదన్న హరీశ్ రావు వ్యాఖ్యలపై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మహిళలకు చేసిందేమీ లేదని, ఇప్పుడు మాత్రం మహిళలు అప్పుల పాలవుతున్నారు, ఆగమవుతున్నారని హరీశ్ రావు మొసలి కన్నీరు కారుస్తున్నారని ఆమె విమర్శించారు. బీఆర్ఎస్ సర్కార్ ఐదు సంవత్సరాల్లో మహిళా సంఘాలకు రూ. 3485 కోట్లు చెల్లించాల్సి ఉండగా కేవలం రూ. 409 కోట్లు చెల్లించారన్నారు.

సామాజిక న్యాయానికి సర్కారు రోల్ మోడల్

» కాంగ్రెస్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రముఖ స్థానం: మహేశ్



హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సామాజిక న్యాయం పాటించడంలో కేరాఫ్ అడ్రస్‌గా కాంగ్రెస్ పార్టీ నిలిచిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి నాలుగు ఎమ్మెల్సీ స్థానాలకు అవకాశం వస్తే ఒక సీటు పొత్తులో భాగంగా సీపీఐకి ఇచ్చామన్నారు. తమ పార్టీ నుంచి ముగ్గురిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మహిళకు అవకాశం ఇచ్చామని, సీపీఐ నుంచి కూడా బీసీ అభ్యర్థికి ఇవ్వడం హర్షణీయమని పేర్కొన్నారు. పార్టీలో ఏ అవకాశం వచ్చినా బీసీ, ఎస్సీ, ఎస్టీలకే ప్రముఖ స్థానం కల్పిస్తామన్నారు. కులగణన, ఎస్సీ వర్గీకరణ, పార్టీ, ప్రభుత్వ, చట్ట సభల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు పదవులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. కాంగ్రెస్ పార్టీ మూల సిద్ధాంతంలోనే సామాజిక న్యాయం ఉంటుందని, ఇందులో రాష్ట్ర ప్రభుత్వం రోల్ మోడల్ అని సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కాగా, కాంగ్రెస్ పార్టీ అంటేనే సామాజిక న్యాయానికి ప్రతీక అని, పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ గౌరవం దక్కుతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ గౌడ్ అన్నారు.

15 నెలల్లో 1.5 లక్షల కోట్ల అప్పు

» మహిళలకు రూ.2500 మాత్రం ఇయ్యలె: కవిత

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేసి బడా కాంట్రాక్టర్లకు దోచిపెడుతోందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ధ్వజమెత్తారు. 15 నెలల పాలనలో రేవంత్ రెడ్డి సర్కారు రూ.1.50 లక్షల కోట్ల అప్పు చేసిందని ఆరోపించారు. "రాష్ట్ర ప్రభుత్వం నగటున ప్రతినెలా రూ. 10వేల కోట్ల అప్పు తెస్తోంది. మహిళలకు ప్రతినెలా ఇస్తామన్న రూ.2500 ఇవ్వలేదు. రుణమాఫీ, రైతుభరోసా సంపూర్ణంగా అమలు కాలేదు. వరికి బోనస్ బోగస్ అయ్యింది. వృద్ధులకు ప్రతినెలా రూ. 4వేల పింఛన్ ఇయ్యలె. మరి ఈ డబ్బులు ఎక్కడికి పోతున్నయి?" అని ఆమె నిలదీశారు. అప్పులు, ఖర్చులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. "కేసీఆర్ లక్షల కోట్లు అప్పు తీసుకొచ్చారని బద్నాం చేశారు. కేసీఆర్ చేసిన అప్పులకు సంబంధించి ప్రతి పైసాకు లెక్క చెప్తాం. మరి 1.50 లక్షల కోట్ల అప్పుకి లెక్క చెప్తారా?" అని కవిత కాంగ్రెస్ ప్రభుత్వానికి సవాలు విసిరారు.

ఓ కార్పొరేట్ విద్యాసంస్థపై ఐటీ దాడులు

హైదరాబాద్ కేంద్రంగా నడుస్తున్న ఓ ప్రముఖ కార్పొరేట్ విద్యాసంస్థపై సోమవారం ఐటీ అధికారులు దాడులు నిర్వహించారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై ప్రాంతాల్లో ఆ సంస్థకు చెందిన బ్రాంచీలలోనూ సోదాలు చేశారు. విద్యార్థుల కోసం ఒకటి, ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నుల కోసం మరొక ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేసుకుని సదరు సంస్థ యాజమాన్యం లావాదేవీలు జరిపినట్లు ఐటీ అధికారులు గుర్తించారు. విద్యార్థుల నుంచి నగదు రూపంలో తీసుకున్న డబ్బులకు పన్ను చెల్లించకుండా ఎగ్గొట్టారనే విషయం కూడా సోదాల్లో బయటపడింది.

డిజిటల్ అరెస్టు పేరుతో.. రూ.43 లక్షల లూటీ

» రూ.36.5 లక్షలను వెనక్కి తెప్పించిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డిజిటల్ అరెస్ట్ పేరుతో ఓ విశ్రాంత ఉద్యోగి నుంచి సైబర్ నేరగాళ్లు లూటీ చేసిన డబ్బులో సింహభాగాన్ని సైబర్ క్రైమ్స్ పోలీసులు వెనక్కి రప్పించిన ఉదంతమిది..! సైబర్ క్రైమ్స్ డీసీపీ దార కవిత కథనం ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ విశ్రాంత ప్రభుత్వోద్యోగికి ఫెడెక్స్ కొరియర్ సంస్థ ప్రతినిధులమని పేర్కొంటూ సైబర్ నేరగాళ్లు ఫోన్ చేశారు. "మీ పేరుతో ఉన్న పార్శిల్‌లో.. డ్రగ్స్, బ్యాంకు పాస్‌పుస్తకాలున్నాయి" అని పేర్కొన్నారు. ఆ వెంటనే సీబీఐ పేరుతో వీడియోకాల్ చేసిన సైబర్ కేటుగాళ్లు.. మనీల్యాండరింగ్, ఎన్‌డీపీఎస్ కింద కేసులు నమోదైనట్లు పేర్కొన్నారు. అరెస్టు చేయకుండా ఉండాలంటే.. అడిగినంత డబ్బులు ఇవ్వాలని చెబుతూ.. రూ.43 లక్షలను కొల్లగొట్టారు. ఆ తర్వాత తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు.. సైబర్ క్రైమ్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రావు బృందం.. సైబర్ కేటుగాళ్ల బ్యాంకు ఖాతాను ఫ్రీజ్ చేయించారు. కోర్టు ఆదేశాలతో ఆ ఖాతాలో ఉన్న రూ.36.5 లక్షలను డీడీ రూపంలో సోమవారం బాధితుడికి అందజేశారు.

సీపీఐ నేతలపై కేసు నమోదు

» శివాజీ చరిత్రను వక్రీకరించారంటూ వానరసేన ఫిర్యాదు

హిమాయత్ నగర్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జీవిత చరిత్రపై సీపీఐ నేతలు అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్న ఆరోపణలపై నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇటీవల హిమాయత్‌నగర్‌లోని సీపీఐ కార్యాలయం సహా పలు చోట్ల ఏర్పాటు చేసిన బ్యానర్లు, ఫ్లెక్సీలలో శివాజీ గురించి పూర్తిగా తప్పుడు సమాచారం ముద్రించారని పోలీసులకు రాష్ట్రీయ వానరసేన ప్రతినిధులు గత నెల 24న ఫిర్యాదు చేశారు. ఈ విషయమై ఉన్నతాధికారులను సంప్రదించిన తర్వాత.. సోమవారం నారాయణగూడ పోలీసులు కేసు నమోదు చేశారు.

రాధాకిషన్ ముందస్తు బెయిల్‌పై తీర్పు వాయిదా

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్ ఫోన్ ట్యాపింగ్, చిత్రహింసలకు గురిచేసిన కేసులో ఏ-2గా ఉన్న మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. చక్రధర్‌గౌడ్ పెట్టిన ఫోన్‌ట్యాపింగ్ (రెండో ఎఫ్ఐఆర్)లో పోలీసులు అరెస్ట్ చేసే అవకాశం ఉన్నందున ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ ఆయన పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ లక్ష్మణ్ ధర్మాసనం సోమవారం మరోసారి విచారణ చేపట్టింది. రాధాకిషన్‌రావు తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. కస్టడీలో ఉన్నప్పుడు, విచారణకు హాజరైనప్పుడు అవసరం లేని కస్టోడియల్ ఇంటరాగేషన్ ఇప్పుడు ఎందుకు అవసరమవుతోందని ప్రశ్నించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్‌రావు వాదిస్తూ.. కేసు తీవ్రత దృష్ట్యా రాధాకిషన్‌రావుకు ముందస్తు బెయిల్ ఇవ్వరాదని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. తీర్పును వాయిదా వేసింది.

కేటీఆర్ నోరు అదుపులో పెట్టుకో..

» మీ నోటి దూలతోనే బీఆర్ఎస్‌కు ఓటమి: బుద్దా వెంకన్న

విజయవాడ (వన్‌టౌన్), మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌పై నోరు పారేసుకుంటున్న కేటీఆర్ తన నోరు అదుపులో పెట్టుకోవాలని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి బుద్దా వెంకన్న హెచ్చరించారు. సోమవారం విజయవాడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలు బుద్ధి చెప్పినా కేటీఆర్‌కు వెకిలి మాటలు, చేష్టలు పోలేదని అన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు అరెస్టయినప్పుడు హైదరాబాద్‌లో నిరసనలు తెలుపుతుంటే, ఇలాంటివి ఏవైనా చేసుకోవాలంటే పక్క రాష్ట్రంలో చేసుకోండని కేటీఆర్ వెకిలిగా మాట్లాడారని, ఆయన నోటి దూల వల్లే తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ కుప్పకూలిపోయిందని విమర్శించారు. తెలంగాణలో బీఆర్ఎస్‌కు దిక్కులేదని, అందుకే కేటీఆర్ ఏపీ గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేటీఆర్ ఇలాగే ఉంటే వచ్చే ఎన్నికల్లో సిరిసిల్లలో కూడా గెలవరని బుద్దా వెంకన్న జోస్యం చెప్పారు.




నామినేషన్ దాఖలు చేస్తున్న శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, చిత్రంలో సీఎం రేవంత్, మంత్రులు కోమటిరెడ్డి, దామోదర తదితరులు

5 సీట్లకు ఐదుగురు

ఏకగ్రీవం కావడం లాంఛనమే.. కాంగ్రెస్‌కు సంఘీభావం తెలిపిన మజ్లిస్ ఎమ్మెల్యేలు

» కాంగ్రెస్, సీపీఐ అభ్యర్థుల నామినేషన్ల దాఖలుకు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు

» కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ అభ్యర్థి నామినేషన్

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా పరిధిలోని ఐదు ఎమ్మెల్సీ సీట్లకు కాంగ్రెస్ తరఫున ముగ్గురు, సీపీఐ, బీఆర్ఎస్ తరఫున ఒక్కొక్కరు నామినేషన్లు దాఖలు చేశారు. ఎమ్మెల్యేల సంఖ్యాబలాన్ని బట్టి ఐదు సీట్లకుగాను నాలుగింటిలో పోటీ చేయాలని నిర్ణయించిన కాంగ్రెస్.. అందులో ఒకటి మిత్రపక్షం సీపీఐకి కేటాయించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో కాంగ్రెస్ తరఫున అద్దంకి దయాకర్, శంకర్‌నాయక్, విజయశాంతి, సీపీఐ తరఫున నెల్లికంటి సత్యం అసెంబ్లీలో ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డికి సోమవారం తమ నామినేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, మంత్రులు, పార్టీ ఎమ్మెల్యేలు, సీపీఐ నేత కె.నారాయణ, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. మజ్లిస్ ఎమ్మెల్యేలు జాఫర్ హుసేన్, ఖాజా మొయినుద్దీన్ సైతం పాల్గొనడం ద్వారా.. అధికార కాంగ్రెస్‌కే తమ మద్దతు ఉంటుందని స్పష్టత ఇచ్చినట్లయింది. తొలుత కాంగ్రెస్, సీపీఐ అభ్యర్థులతోపాటు సీఎల్పీ కార్యాలయానికి చేరుకున్న సీఎం రేవంత్.. అక్కడి నుంచి అసెంబ్లీలోకి వెళ్లి అభ్యర్థులతో నామినేషన్ వేయించారు. నిర్ణీత సమయానికి సీఎల్పీ కార్యాలయానికి రాలేకపోయిన విజయశాంతి.. నేరుగా ఎన్నికల అధికారి కార్యాలయానికి వెళ్లి నామినేషన్ వేశారు. అలాగే, బీఆర్ఎస్ అభ్యర్థి దాసోజు శ్రవణ్.. ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సమక్షంలో నామినేషన్ సమర్పించారు. కాగా, నిబంధనల ప్రకారం పది మంది ఎమ్మెల్యేల సంతకాలతో మూడు పార్టీలకు చెందిన ఐదుగురు మాత్రమే నామినేషన్లు వేయడంతో.. వారి ఎన్నిక ఏకగ్రీవం కావడం లాంఛనమే. అయితే, ఈ ఐదుగురే కాకుండా మరో ఆరుగురు ఇండిపెండెంట్లూ నామినేషన్లు దాఖలు చేశారు. అయితే, ప్రతిపాదిత ఎమ్మెల్యేల సంతకాలు లేకుండా దాఖలైన ఆ నామినేషన్లు మంగళవారం నాటి పరిశీలనలో తిరస్కరణకు గురికానున్నాయి. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 13న సాయంత్రం 3 గంటల వరకూ గడువు ఉంది. ఆ వెంటనే ఐదుగురు అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించనున్నారు.

రేవంత్‌ను కలిసిన అద్దంకి, విజయశాంతి

కాంగ్రెస్ తరఫున ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఉన్న అద్దంకి దయాకర్ జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు అవకాశం కల్పించినందుకు సీఎం రేవంత్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, కాంగ్రెస్ నాయకురాలు విజయశాంతి సైతం సీఎం నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ఇంకో ఎమ్మెల్సీ సీటూ వస్తుంది: కూనంనేని

ఎన్నికల ముందు కాంగ్రెస్ అధిష్ఠానం ఇచ్చిన హామీ మేరకు భవిష్యత్తులో మరో ఎమ్మెల్సీ సీటు తమకు రానుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. అసెంబ్లీ ఆవరణలో ఆయన చిట్‌చాట్‌గా మాట్లాడుతూ పొత్తులో భాగంగా తమకు ఒక అసెంబ్లీ సీటు ఇచ్చి, అధికారంలోకి వస్తే మంత్రి పదవి ఇస్తామని ఆఫర్ చేశారని తెలిపారు. కానీ.. మంత్రి పదవికి బదులు రెండు ఎమ్మెల్సీ సీట్లు ఇవ్వాలని తాము కోరినట్లు చెప్పారు. తద్వారా చట్టసభల్లో తమ పార్టీ ప్రాతినిధ్యం ఏడెనిమిదేళ్ల పాటు కొనసాగుతుందన్నారు.



సీఎం రేవంత్ సమక్షంలో నామినేషన్ వేస్తున్న సీపీఐ అభ్యర్థి సత్యం



దాసోజు శ్రవణ్ నామినేషన్ దాఖలులో కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని

నేడు ఢిల్లీకి మంత్రి కోమటి రెడ్డి

» ఆర్ఆర్ఆర్ విషయమై కేంద్ర మంత్రి గడ్కరీతో భేటీ

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణకు మంజూరు చేసిన రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) పనుల్లో వేగం పెంచాలని కేంద్రాన్ని రాష్ట్ర ప్రభుత్వం కోరనుంది. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీతో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి భేటీ కానున్నారు. ఈ సందర్భంగా ఆర్ఆర్ఆర్‌కు సంబంధించిన పలు అంశాలపై చర్చించనున్నారు. ఉత్తరభాగం నిర్మాణం కోసం టెండర్లను ఆహ్వానించినప్పటికీ కేంద్ర క్యాబినెట్‌లో ప్రాజెక్టు ఆమోదం పొందలేదని, త్వరితగతిన ఆమోదం తెలిపి, రహదారి నిర్మాణ పనులను ప్రారంభించాలని కోరనున్నారు. అదే విధంగా హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి ఆరు వరుసల విస్తరణకు సంబంధించిన పనులను వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేయనున్నారు. ఇప్పటికే విస్తరణపై అధ్యయనం చేసేందుకు కేంద్రం డీపీఆర్ కన్సల్టెన్సీని నియమించిన నేపథ్యంలో ఆ రిపోర్టును త్వరితగతిన ఇచ్చేలా సంస్థకు సూచించే అంశంపై కేంద్రమంత్రితో చర్చించనున్నారు.

ఒకే విధమైన సంస్థలు ఒక గొడుగు కిందకు

» రైతులకు సేవలందించడమే సంస్థల పని: మంత్రి తుమ్మల

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఒకే విధమైన కార్యకలాపాలను నిర్వహించే వివిధ కార్పొరేషన్లను ఒకే గొడుగు కిందకు తీసుకురావాల్సి ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సోమవారం సచివాలయంలో హాకా, ఆగ్రోస్, తెలంగాణ కో-ఆపరేటివ్ యూనియన్, గోదాముల కార్పొరేషన్లపై శాఖ సెక్రటరీ రఘునందన్‌రావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంస్థల అధికారులు పలు అంశాలు, సంస్థల ప్రగతిని మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా గ్రామీణ నీటిపారుదల సహకార సంఘంలో దశాబ్ద కాలంగా ఆడిట్ జరగలేదనే విషయాన్ని కూడా సంబంధిత అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. నీటిపారుదల సహకార సంఘంలో 15 రోజుల్లో ఆడిట్ చేయించాలని అధికారులను ఆదేశించారు. ఇక రైతు ఉత్పత్తి సంఘాల పటిష్ఠత కోసం శిక్షణా కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు. ఆగ్రోస్ ద్వారా వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని ముందుకు తీసుకెళ్లే అవకాశాలను పరిశీలించాలని సంస్థ ఎండీ కె.రాములుకు సూచించారు. వ్యవసాయ శాఖ పరిధిలోని కార్పొరేషన్ల కార్యకలాపాలు, సంస్థల ఆర్థిక పరిస్థితిపై నివేదిక ఇవ్వాలని అధికారులకు మంత్రి సూచించారు.

'పాలమూరు'కు జాతీయ హోదా ఇవ్వలేం: కేంద్రం

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు - రంగారెడ్డి నీటిపారుదల ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించే విషయం కేంద్రం పరిశీలనలో లేదని కేంద్ర జల శక్తి శాఖ సహాయమంత్రి రాజ్ భూషణ్ చౌదరి తెలిపారు. రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ సోమవారం అడిగిన ఓ ప్రశ్నకు సమాధానమిస్తూ ఈ ఎత్తిపోతల పథకంలో భాగంగా కృష్ణానది జలాలను ఉపయోగించుకోవాల్సి వస్తుందని, కృష్ణానది వివాదాల ట్రైబ్యునల్-2 ప్రకారం ఇది అంతర్ రాష్ట్ర అంశమైనందువల్ల న్యాయ పరిధిలోకి వస్తుందని ఆయన చెప్పారు. అందువల్ల తెలంగాణ ప్రభుత్వం 2022లోనే సాంకేతిక, ఆర్థిక విశ్లేషణ కోసం ఈ ప్రాజెక్టు డీపీఆర్‌ను సమర్పించినా తాము దాన్ని పరిశీలించలేకపోయామని, 2024 డిసెంబరులో ఆ ప్రతిపాదనలను తెలంగాణ ప్రభుత్వానికి తిప్పి పంపామని కేంద్రమంత్రి తెలిపారు.

ముంబై-హైదరాబాద్ మధ్య హై స్పీడ్ రైల్వే కారిడార్

న్యూఢిల్లీ, మార్చి10(ఆంధ్రజ్యోతి): ముంబై-హైదరాబాద్ మధ్య హై స్పీడ్ రైల్వే కారిడార్‌ను నిర్మించే విషయంపై జాతీయ హై స్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ సర్వే, డీపీఆర్‌లను రూపొందిస్తోందని రైల్వే మంత్రిత్వ శాఖ తెలిపింది. అలాగే ఖరగ్‌పూర్ నుంచి విజయవాడ వరకు డెడికేటెడ్ ఈస్ట్ కోస్ట్ ఫ్రైట్ కారిడార్‌ను, విజయవాడ-నాగపూర్-ఇటార్సీ మధ్య నార్త్- సౌత్ సబ్ కారిడార్‌ను నిర్మించేందుకు సర్వే, డీపీఆర్‌లు పూర్తి చేశామని, వాటిని అమలు చేసే విషయం పరిశీలిస్తున్నట్లు తెలిపింది.

జగ్గారెడ్డి... ఎ వార్ ఆఫ్ లవ్!



» పాన్ ఇండియా స్థాయిలో సినిమా నిర్మాణం

» అందులో నా నిజ జీవిత పాత్రనే పోషిస్తున్నా

» వచ్చే ఏడాది ఉగాదికి సినిమా విడుదల: తూర్పు జగ్గారెడ్డి

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాజకీయ రంగంలో రాణించిన తూర్పు జగ్గారెడ్డి.. సినీ రంగంలోనూ ఆరంగేట్రం చేస్తున్నారు. 'జగ్గారెడ్డి.. ఎ వార్ ఆఫ్ లవ్' అనే సినిమాలో.. తన నిజ జీవిత పాత్రనే పోషించనున్నారు. జగ్గారెడ్డి తొలి సినిమానే పాన్ ఇండియా రేంజ్‌లో నిర్మాణం కాబోతోంది. తెలుగు, హిందీ భాషల్లో రూపొందనున్న సినిమాకు సంబంధించి కథను ఈ ఉగాది పర్వదినం రోజున వింటానని, వచ్చే ఏడాది ఉగాది కల్లా సినిమాను పూర్తి చేసి విడుదల చేస్తామని చెప్పారు. ఈ మేరకు సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి ఆయన వివరాలను వెల్లడించారు. ఈ సినిమాను ప్రేమకథగా తీస్తున్నామని, ఆ కథలో ఒక ప్రత్యేక పాత్రను తాను పోషించనున్నానని తెలిపారు. సినిమాలోని ఈ పాత్ర.. నిజ జీవితంలో తన క్యారెక్టర్‌కు అద్దం పట్టనుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ అనుమతితోనే సినిమాలో నటిస్తానని చెప్పారు. ఓ వ్యక్తి కలిసి తన ఒరిజినల్ క్యారెక్టర్‌కు తగ్గట్టుగా ఈ సినిమా ఉంటుందని చెప్పారని, ఆ పాత్రలో తానే నటించాలని కోరారని వెల్లడించారు. మధ్యలో విరామానికి ముందు మొదలయ్యే తన పాత్ర.. సినిమా చివరి దాకా ఉంటుందన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన తర్వాత షాకయ్యా

» కుసుమ్‌కు అవకాశం వస్తుందని భావించా: జగ్గారెడ్డి

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన తర్వాత రాజకీయంగా షాక్‌కు గురయ్యానని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి అన్నారు. తాను ఎందుకు షాక్‌కు గురైందీ త్వరలోనే చెబుతానని పేర్కొన్నారు. ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడుతూ కాంగ్రెస్ నేత జెట్టి కుసుమ్‌కుమార్‌కు ఎమ్మెల్సీగా అవకాశం వస్తే పార్టీకి, కమ్మ సామాజిక వర్గానికి అనుసంధానకర్తగా ఉంటాడని అనుకున్నానన్నారు. 2017లో సంగారెడ్డిలో రాహుల్‌గాంధీ సభ కోసం తాను పడిన కష్టాలను ఆయన దృష్టికి తీసుకెళ్లేందుకే ఢిల్లీకి వచ్చినట్లు తెలిపారు. రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ అడిగానని, ఎప్పుడు సమయం ఇచ్చేదీ చెబుతామని ఆయన కార్యాలయం తెలిపిందన్నారు. కాగా.. జగ్గారెడ్డి సానుభూతితో నాయకుడు కావాలని కోరుకోడని, ఫైట్ చేసి రాజకీయాలు చేస్తాడని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.



కొనసాగుతున్న అన్వేషణ!

» సహాయక బృందాలు గుర్తించిన డీ1, డీ2 ప్రాంతాల్లో తవ్వకాలు

» డీ2 ప్రాంతానికి చేరుకున్న ఎర్త్ మూవర్

» డీ1 షీర్ జోన్ కావడంతో ఆచితూచి తవ్వకాలు

మహబూబ్‌నగర్, దోమలపెంట, మార్చి 10 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్ఎల్‌బీసీ సొరంగం ప్రమాదంలో చిక్కుకున్న వారి జాడ కోసం అన్వేషణ కొనసాగుతోంది. ఆదివారం ఒక మృతదేహాన్ని వెలికితీయగా.. సోమవారం కూడా 12 ఏజెన్సీల ఆధ్వర్యంలో సహాయక బృందాలు తవ్వకాలు కొనసాగిస్తున్నాయి. దాదాపు 15 అడుగుల మేర మట్టి పేరుకుని ఉండటం.. తవ్వుతున్న కొద్దీ నీరు రావడం, వచ్చిన నీటిని పంపింగ్ చేసిన తర్వాతే మళ్లీ తవ్వకాలు చేపట్టాల్సి రావడం, మరోవైపు తవ్విన మట్టిని బయటకు తరలించే అవకాశం లేకపోవడంతో ఈ ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది. ఎన్‌డీఆర్ఎఫ్, క్యాడవర్ డాగ్స్, జీపీఆర్ గుర్తించిన కామన్ ప్రాంతాలకు డీ1, డీ2గా నెంబరింగ్ ఇవ్వగా.. డీ1 మొత్తం షీర్ జోన్ పరిధిలో ఉండడంతో అక్కడ తవ్వకాలను ఆచితూచి చేపడుతున్నారు. డీ1 నుంచి డీ2 మధ్య 20 మీటర్ల దూరం ఉంది. డీ2 ప్రాంతంలో ఆదివారం ఒక మృతదేహం లభ్యం కాగా.. ఆ ప్రాంతంలో ఇంకా మట్టి తవ్వకం జరుగుతోంది. డీ1 నుంచి డీ2 వరకు సింగరేణి ఆధ్వర్యంలో ట్రెంచ్ కట్ చేస్తున్నారు. టీబీఎం భాగాలను కట్ చేస్తూ ఒక పక్కకు వేస్తుండటంతో.. డీ2 ప్రాంతం వరకు సోమవారం సాయంత్రం ఒక జేసీబీ ఎర్త్ మూవర్ వెళ్లింది. దీంతో ఆ ప్రాంతంలో తవ్వకాలు వేగంగా జరిగే అవకాశం ఉంది. మంగళవారం లేదా బుధవారం మరో రెండు మృతదేహాలు లభ్యమయ్యే అవకాశం ఉన్నట్లు సహాయక బృందాలు చెబుతున్నాయి. క్యాడవర్ డాగ్స్ సోమవారం కూడా లోపలకు వెళ్లాయి.. కానీ మరే ఇతర ప్రాంతాలను గుర్తించలేదు. కాగా కన్వేయర్ బెల్టు పనిచేస్తున్న ప్రాంతం వరకు మట్టిని తరలించే వీలు లేకపోవడం, తవ్వుతున్న మట్టిని అక్కడే వేస్తుండడంతో ఆలస్యమవుతోంది. ఆదివారం లభ్యమైన గుర్‌ప్రీత్ సింగ్ మృతదేహాన్ని పంజాబ్‌లోని చీమాకలాన్‌కు తరలించారు.

కేటీఆర్ మతి భ్రమించి మాట్లాడుతున్నారు!

సీఎంపై వ్యాఖ్యలు ఆయన మానసిక స్థితికి నిదర్శనం

» ఇకనైనా మారకపోతే ప్రజలు తరిమికొడతారు

» రాష్ట్ర పెండింగ్ ప్రాజెక్టులపై అన్ని పార్టీల ఎంపీలతో వెళ్లి కేంద్ర మంత్రులు, ప్రధానమంత్రిని కలుస్తాం

» ఫిరాయింపులపై సుప్రీం ఇచ్చింది నోటీసులే.. తీర్పు కాదు

» ఢిల్లీలో మీడియాతో తెలంగాణ కాంగ్రెస్ ఎంపీలు

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజలు రేవంత్‌రెడ్డికి ఒక స్థాయి ఇచ్చారని, ఆ విషయాన్ని విస్మరించి కేటీఆర్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని కాంగ్రెస్ ఎంపీలు మండిపడ్డారు. సీఎం రేవంత్‌పై కేటీఆర్ వ్యాఖ్యలు ఆయన మానసిక స్థితికి, రాజకీయ అవగాహనా రాహిత్యానికి నిదర్శనమని చెప్పారు. సోమవారం ఇక్కడి తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ఎంపీలు మల్లు రవి, ఎంపీలు కందుల రఘువీర్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, కడియం కావ్య, గడ్డం వంశీకృష్ణ, ఆర్.రఘురామ్‌రెడ్డి, సురేష్ షట్కార్ మీడియాతో మాట్లాడారు. గతంలో కేటీఆర్ మాటల వల్లే రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్‌కు ఓట్లతో బుద్ధి చెప్పారని.. ఇకనైనా మారకపోతే తరిమికొడతారని మల్లు రవి హెచ్చరించారు. తెలంగాణ పెండింగ్ ప్రాజెక్టులను సాధించేందుకు అన్ని పార్టీల ఎంపీలతో వెళ్లి ప్రధాని, కేంద్రమంత్రులను కలుస్తామని చెప్పారు. తెలంగాణలో 55 సమీకృత గురుకులాల నిర్మాణానికి రూ.11 వేల కోట్లు కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. మామునూరు విమానాశ్రయానికి ఇటీవలే నిరంభ్యంతర పత్రం వచ్చిందన్నారు. 253 ఎకరాల భూసేకరణను త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు అనుకూల నిర్ణయం తీసుకున్న మొదటి సీఎంగా రేవంత్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. తెలంగాణలో ఉప ఎన్నికలు వస్తే ఎదుర్కొనేందుకు తాము సిద్ధంగానే ఉన్నామని కాంగ్రెస్ ఎంపీ రఘువీర్‌రెడ్డి చెప్పారు. రాజకీయ పార్టీగా ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్ధంగానే ఉంటామన్నారు. ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో సుప్రీంకోర్టు నోటీసులు మాత్రమే ఇచ్చిందన్నారు. తుదితీర్పు ఇవ్వాల్సి ఉందని, దాన్ని బట్టి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో పని చేసే వారికే పదవులు దక్కుతాయని మరోసారి తేలిందన్నారు. నల్లగొండ జిల్లాకు నాలుగు ఎమ్మెల్సీ సీట్లు యాదృచ్ఛికంగానే వచ్చాయని, అది తమ జిల్లా అదృష్టమని చెప్పారు. విజయశాంతి తెలంగాణ కోసం కష్ట పడ్డారని తెలిపారు.

'ఫోన్ ట్యాపింగ్' పేటెంట్ బీఆర్ఎస్‌దే..

తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ పేటెంట్ హక్కులు బీఆర్ఎస్‌వేనని కిరణ్ కుమార్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఫోన్ ట్యాపింగ్ చేస్తుందని బీఆర్ఎస్ నేతలు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందని చెప్పారు. తామెప్పుడూ ఈ-కార్ రేసును తప్పు పట్టలేదని, అందులో జరిగిన అవినీతిని మాత్రమే ప్రశ్నించామని గుర్తుచేశారు. ఎన్నికల వరకే రాజకీయాలు పరిమితం కావాలని, ఆ విషయాన్ని కేటీఆర్, కిషన్‌రెడ్డి గ్రహించాలని హితవు పలికారు. భారత జట్టు చాంపియన్స్ ట్రోఫీ గెలిస్తే, సంబరాలను ఎవరైనా అడ్డుకుంటారా? అని ప్రశ్నించారు. ఇక రాజకీయ అజెండాతోనే రామగుండం విమానాశ్రయాన్ని అడ్డుకుంటున్నారని ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆరోపించారు. హైదరాబాద్ తర్వాత రెండో పారిశ్రామిక నగరమైన కొత్తగూడెంలో విమానాశ్రయం ఎంతో అవసరమని ఎంపీ రఘురామ్‌రెడ్డి అన్నారు. త్వరలోనే విమానాశ్రయానికి అనుమతులు వస్తాయన్నారు.

నేను మీ మంత్రి సీతక్కను.. మీ సమస్య ఏంటి.!

» డయల్ 181కు మహిళ ఫోన్.. మాట్లాడిన మినిస్టర్

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): 'నేను మీ మంత్రి సీతక్కను మాట్లాడుతున్నా.. మీ సమస్య ఏంటి..' అంటూ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సోమవారం డయల్ 181కు ఫోన్ చేసిన ఓ బాధితురాలితో మాట్లాడారు. సమస్యను విన్న వెంటనే పరిష్కరించాలంటూ అధికారులను ఆదేశించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మధురానగర్‌లో ఏర్పాటు చేసిన ఉమెన్ హెల్ప్‌లైన్ కాల్ సెంటర్‌ను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అదే సమయంలో డయల్ 181కు ఫోన్ రాగానే.. ఆ ఫోన్‌ను స్వయంగా మంత్రి సీతక్క ఎత్తారు. సమస్య ఏంటి, ఎక్కడి నుంచి ఫోన్ చేస్తున్నారని అడగ్గా.. దేవరకొండ నుంచి ఫోన్ చేస్తున్నానని, తన పేరు లలిత అని.. అదనపు కట్నం కోసం తన భర్త వేధిస్తున్నాడని తెలిపింది. తనను, తన ఇద్దరు పిల్లలను ఇంటి నుంచి బయటకు పంపించారని, దేవరకొండ బస్‌స్టేషన్‌లో ఉన్నానని మంత్రికి వివరించింది. స్పందించిన మంత్రి వెంటనే.. సమస్యను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సీఎం, మంత్రుల ఐటీ చెల్లింపు వివరాలివ్వండి

» సీఎస్‌కు ఎఫ్‌జీజీ లేఖ

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి, మంత్రుల జీతభత్యాలపై ప్రభుత్వ ఖజానా నుంచి ఎంత ఆదాయ పన్ను చెల్లించారో వెల్లడించాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) డిమాండ్ చేసింది. ఈమేరకు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. ఐటీ చెల్లింపు వివరాలను ప్రభుత్వ వెబ్‌సైట్‌లో పెట్టాలని, వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి ప్రభుత్వం చెల్లించబోదంటూ ఉత్తర్వులు జారీ చేయాలని ఎఫ్‌జీజీ కోరింది. సీఎం, మంత్రుల జీతభత్యాల చట్టం-1953లోని సెక్షన్ 3 ప్రకారం సీఎం, ఉప ముఖ్యమంత్రి, మంత్రులు, క్యాబినెట్ హోదా ఉన్న కార్పొరేషన్ల చైర్మన్లు, ప్రభుత్వ సలహాదారుల ఆదాయ పన్నును ప్రభుత్వమే చెల్లించడం సరికాదని, ఇది రాజ్యాంగ విరుద్ధమంటూ సీఎస్‌కు లేఖలు రాసినా ఫలితం కనిపించలేదని ఎఫ్‌జీజీ ఆరోపించింది. 2014-15 ప్రకారం అప్పటి సీఎంకు సంబంధించి 15,39,111 ఆదాయ పన్నును చెల్లించారని, ఇందుకు సంబంధించిన ఆదాయం ఎంత ఉందో బయటపెట్టాలని డిమాండ్ చేసింది.

ల్యాబ్ టెక్నీషియన్ పరీక్ష కీ విడుదల

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2 పోస్టుల భర్తీ కోసం నిర్వహించిన రాత పరీక్ష కీ ని మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు సోమవారం విడుదల చేసింది. కీ పై అభ్యంతరాలుంటే 14వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు తెలపాలని మెడికల్ బోర్డు కార్యదర్శి గోపీకాంత్‌రెడ్డి తెలిపారు. గత ఏడాది సెప్టెంబరులో 1284 ఎల్టీ పోస్టులకు నోటిఫికేషన్ జారీ కాగా, నవంబరు 10న కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర్వహించారు. కాంట్రాక్టు పద్ధతిలో పనిజేస్తున్న ఎల్టీలకు ఇచ్చే వెయిటేజీ ధ్రువపత్రాలను బోర్డు పరిశీలిస్తోంది. అనంతరం ప్రొవిజనల్ మెరిట్ జాబితాను విడుదల చేయనుంది.

గద్దర్ అవార్డుల విధివిధానాలకు సీఎం ఆమోదం

» త్వరలో నోటిఫికేషన్ : దిల్‌రాజు

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): గద్దర్ తెలంగాణ చలన చిత్ర పురస్కారాలకు సంబంధించిన విధివిధానాలు ఖరారు అయ్యాయని, వాటిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆమోదించారని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్‌రాజు తెలిపారు. అవార్డుల అందజేతకు సంబంధించిన నోటిఫికేషన్‌ను త్వరలో విడుదల చేయనున్నట్టు సోమవారం మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

థాయ్ సైబర్ నేరగాళ్ల వలలో భారత యువత

» కేంద్రమంత్రి బండి సంజయ్ చొరవతో స్వదేశానికి..

» మొత్తం 540 మందికి విముక్తి

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగాల కోసం వెళ్లి థాయ్‌లాండ్ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కిన మన దేశానికి చెందిన వందలాది మంది యువతకు విముక్తి లభించింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చొరవతో వీరందరినీ స్వదేశానికి రప్పించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. మొత్తం 540 మందికి విముక్తి లభించగా, వీరిలో ఏపీ, తెలంగాణలకు చెందినవారు 42 మంది ఉన్నారు. కరీంనగర్ జిల్లా మానకొండూరుకు చెందిన మధుకర్‌రెడ్డి అనే యువకుడు ఉద్యోగం కోసం థాయ్‌లాండ్ వెళ్లి అక్కడ సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకున్నట్లు మీడియాలో వచ్చింది. దీనిపై వెంటనే స్పందించిన కేంద్రమంత్రి బండి సంజయ్ విదేశాంగ శాఖకు లేఖ రాశారు. అలాగే మయన్మార్, థాయ్‌లాండ్ దౌత్య కార్యాలయాలను అప్రమత్తం చేశారు. దీంతో మయన్మార్ ప్రభుత్వం తన సైన్యాన్ని పంపి సైబర్ మోసాల కేఫ్‌లలో బందీలుగా ఉన్న భారతీయులను రక్షించింది. వీరంతా మయన్మార్‌లోని మేవాడి జిల్లాలో మయన్మార్ సైన్యం పరిరక్షణలో ఉన్నారు. వీరిలో 270 మందితో కూడిన తొలి విమానం థాయ్‌లాండ్‌లోని మై సోట్ పట్టణం నుంచి సోమవారం బయలుదేరింది. మంగళవారం ఉదయం ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకుంటుంది. బుధవారం మరో 270 మందితో కూడిన విమానం రానుంది. థాయ్‌లాండ్ కేంద్రంగా వీరందరికీ ఉద్యోగాలిప్పిస్తామని సైబర్ నేరగాళ్లు స్థానిక ఏజెంట్ల ద్వారా ఆశ చూపారు. అనంతరం వారికి ఉద్యోగాలు ఖరారయ్యాయని నమ్మబలికిన ఏజెంట్లు బాధితులను థాయ్‌లాండ్‌తో పాటు కంబోడియా, లావోస్, మయన్మార్‌లలోని పలు సైబర్ మోసాల కేఫ్‌లలో విక్రయించారు. సైబర్ నేరగాళ్లు అక్కడ వారి చేత బలవంతంగా ఆన్‌లైన్ నేరాలు చేయిస్తున్నారు. ఒకవేళ వారు చెప్పినట్లు చేయకపోతే కరెంట్ షాక్ ఇచ్చి హింసిస్తారని కేంద్రమంత్రి కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఆంగ్ల ప్రశ్నపత్రంలో అస్పష్ట ముద్రణ

7వ ప్రశ్న రాసిన ప్రతీ విద్యార్థికి మార్కులు: ఇంటరు బోర్డు

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. సోమవారం జరిగిన ద్వితీయ సంవత్సరం ఆంగ్ల పరీక్షకు 4,46,992 మంది విద్యార్థులకుగాను 4,33,963 మంది హాజరయ్యారు. పరీక్ష ముగిసిన తర్వాత ఓ విద్యార్థి ప్రశ్నపత్రంలోని 7వ ప్రశ్న ముద్రణ అస్పష్టంగా ఉందని హెల్ప్‌లైన్ ద్వారా ఇంటర్ బోర్డుకు ఫిర్యాదు చేశాడు. విషయాన్ని తెలుసుకున్న ఇంటర్ విద్యా కార్యదర్శి కృష్ణ ఆదిత్య.. వెంటనే దీనిపై అన్ని జిల్లాల ఇంటర్ బోర్డు అధికారులతో సమీక్షించారు. ఇదే అంశంపై ఆంగ్ల భాష నిపుణులతోనూ చర్చించి, 7వ ప్రశ్నకు ప్రయత్నించిన ప్రతీ విద్యార్థికి పూర్తి మార్కులు కేటాయించాలని కృష్ణ ఆదిత్య అధికారులను ఆదేశించారు.



● ప్రధాని మోదీని కలిసిన ఎంపీ ఈటల

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ తన కుటుంబసభ్యులతో సహా వెళ్లి కలిశారు. పార్లమెంటులో సోమవారం ప్రధానిని కలిసి కొంతసేపు ముచ్చటించారు. కుటుంబసభ్యులను ఆయనకు పరిచయం చేశారు. ప్రధానిని కలిసిన వారిలో రాజేందర్ సతీమణి జమున, కుమారుడు నితిన్, కుమార్తె నీత, అల్లుడు అనూప్, మేనల్లుడు రాహుల్, మనవళ్లు రుషాంగ్, హృద్యాంష్ ఉన్నారు. ఆ తర్వాత ఈటల కుటుంబసభ్యులతో పాటు స్పీకర్ ఓం బిర్లాను కలిశారు.

రేపటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

» సమావేశాల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమీక్ష

» అసెంబ్లీ ఆవరణలో నిరసనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశాలు

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): శాసన సభ సమావేశాలు జరిగినన్ని రోజులు అసెంబ్లీ ఆవరణలో ఎలాంటి ఆందోళనలు, నిరసనలు జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో సభ నిర్వహణ, భద్రతా ఏర్పాట్లపై సోమవారం తన చాంబర్‌లో పోలీసు, ఇంటెలిజెన్స్ అధికారులతో స్పీకర్ ప్రసాద్‌కుమార్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, వైస్‌చైర్మన్ బండా ప్రకాశ్, సీఎస్ శాంతికుమారి,ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈసందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలు జరిగినన్ని రోజులు సభ లోపల, వెలుపల శాంతియుత వాతావరణం ఉండాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు శాసనసభకు సకాలంలో చేరుకొనేలా ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. బడ్జెట్ సమావేశాలు ఎక్కువ రోజులు జరుగుతాయని, గతంలో మాదిరిగానే ఈ సమావేశాలకు ప్రభుత్వం, అధికారులు సహకరించాలని కోరారు. సభ్యులు అడిగిన సమాచారాన్ని సాధ్యమైనంత త్వరగా అందించాలని, సమాచారాన్ని తెలుగు, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో ముద్రించాలని అధికారులకు సూచించారు. శాసన మండలి చైర్మన్ సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ... సమావేశాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమష్టిగా పని చేయాలన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశాలకు క్రమం తప్పకుండా హాజరుకావాలని సూచించారు. సభ సజావుగా జరగడానికి ప్రభుత్వం నుంచి పూర్తి సహకారాన్ని అందిస్తామని శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు.



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎస్ శాంతికుమారి

తీసుకున్నది ఎంత.. ఇచ్చింది ఎంత ?

(మొదటిపేజీ తరువాయి)

స్పందించారు. సోమవారం సీఎల్పీ కార్యాలయంలోని ముఖ్యమంత్రి చాంబర్‌లో రేవంత్ మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడారు. రాష్ట్రాలు చెల్లించిన పన్నుల్లో 42 శాతం నిధులను తిరిగి రాష్ట్రాలకు ఇస్తున్నట్లు చెబుతున్నారని, కానీ.. తిరిగి ఇస్తున్నది కేవలం 30 శాతమేనని చెప్పారు. విద్యా సెస్సు 4 నుంచి 5 శాతం వసూలు చేస్తున్న కేంద్రం.. అందులో నుంచి ఒక్క రూపాయి కూడా రాష్ట్రానికి ఇవ్వడంలేదని తెలిపారు. వాస్తవాలు ప్రజలకు తెలియాల్సి ఉందని, దీనిపై చర్చించేందుకు కిషన్‌రెడ్డి రావాలని అన్నారు.

ధర్నా చేయాల్సింది మోదీ ఇంటిముందు కదా!

రీజినల్ రింగ్ రోడ్డును తామే ఇచ్చామంటూ ప్రధాని మోదీ పరేడ్ గ్రౌండ్‌లో ప్రకటించారని, అలాంటప్పుడు ఈ ప్రాజెక్టుకు భూ సేకరణ జరగొద్దంటూ బీజేపీ ఎంపీలు ఈటల, కె.లక్ష్మణ్ ధర్నా చేయాల్సింది ప్రధాని ఇంటి ముందు కదా! అని సీఎం రేవంత్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టు అన్నప్పుడు పద్ధతిగా భూ సేకరణ జరిపించాల్సిన బాధ్యత కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, లక్ష్మణ్‌పై ఉందన్నారు. హైదరాబాద్‌లో జైపాల్‌రెడ్డి తెచ్చిన మెట్రో కనిపిస్తుందే తప్ప.. కిషన్‌రెడ్డి తెచ్చిన మెట్రో కనిపించడంలేదని ఎద్దేవా చేశారు. మెట్రో, మూసీ ప్రక్షాళన, రీజినల్ రింగ్‌రోడ్డు, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు కేంద్రం నుంచి మెజారిటీ నిధులు తెస్తే కిషన్‌రెడ్డికి నెక్లెస్ రోడ్డులో సన్మానం చేసి.. చేతికి గండపెండేరం తొడుగుతానన్నారు. భూసేకరణ రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోనిది అయినప్పుడు కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులపై భట్టివిక్రమార్క నేతృత్వంలో జరిగిన సమావేశంలో చర్చించేందుకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ హైదరాబాద్‌కు వచ్చి సమీక్ష నిర్వహించినప్పుడు సికింద్రాబాద్‌లోనే ఉన్న కిషన్‌రెడ్డి.. ఆ సమావేశానికి వెళితే కేసీఆర్ బాధపడతారని హాజరు కాలేదా?అని నిలదీశారు. రాష్ట్ర అభివృద్ధిపై కిషన్‌రెడ్డికి ఉన్న చిత్తశుద్ధి ఇదీ అని ఎద్దేవా చేశారు.



కులగణన వల్లే బడుగులకు ఎమ్మెల్సీలు..

కాంగ్రెస్, బీఆర్‌ఎస్, సీపీఐ పార్టీలు ఐదు ఎమ్మెల్సీ సీట్లను బీసీ, ఎస్సీ, ఎస్టీలకే కేటాయించడం సమాజంలో వచ్చిన విప్లవాత్మక మార్పునకు నిదర్శనమని సీఎం రేవంత్ అన్నారు. కులగణన సర్వేలో తాము కులాల వారీ లెక్కలు తీసినందునే ఆయా వర్గాలకు న్యాయం చేయాల్సిన పరిస్థితి అందరికీ వచ్చిందన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక పార్టీ నిర్ణయమే తప్ప.. ప్రభుత్వ నిర్ణయం కాదని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో హరీశ్‌రావు బీజేపీకి లొంగిపోయి.. బీఆర్‌ఎస్ ఓట్లను ఆ పార్టీకి మళ్లించారని రేవంత్ ఆరోపించారు. ఆయన దొంగ దెబ్బ తీయడం వల్లే తమ అభ్యర్థి ఓటమిపాలయ్యారని తెలిపారు. కానీ, మోసం తాత్కాలిక విజయాన్నే అందిస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులందరూ సమన్వయంతోనే పని చేశారని తెలిపారు. ఇక రాష్ట్ర ప్రయోజనాల కోసం 99 సార్లయినా ఢిల్లీకి వెళతానన్నారు. గడిచిన 30 ఏళ్లలో సాధించుకురాలేని పనులను తాము ఈ 15 నెలల్లోనే సాధించుకొచ్చామన్నారు. కంటోన్మెంట్, రీజినల్ రింగ్‌రోడ్డు, రైల్వేకోచ్ ఫ్యాక్టరీ వంటివి తెచ్చామన్నారు. ప్రధాని మోదీ తనకు సూచించినవన్నీ పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న అంశాలేనని, వాటిని కచ్చితంగా పరిష్కరిస్తామని చెప్పారు.

నేను సీఎంను.. కేసీఆర్ మాజీ సీఎం!

కేసీఆర్ స్టేచర్ ఏంటి, రేవంత్ స్టేచర్ ఏంటంటూ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై సీఎం స్పందిస్తూ, "నేను ఈ రాష్ట్రానికి సీఎంను. కేసీఆర్ మాజీ సీఎం. అసెంబ్లీ ఎన్నికల్లో ఆయనొక పార్టీకి, నేనొక పార్టీకి అధ్యక్షులుగా ఉన్నాం. ఆ ఎన్నికల్లో కేసీఆర్‌ను అధికారం నుంచి దించాను. లోక్‌సభ ఎన్నికల్లో గుండు సున్న చేశాను. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు వచ్చేసరికి అభ్యర్థిని కూడా పెట్టలేకపోయారు. కేసీఆర్, కేటీఆర్‌కు బలుపు తప్ప ఏముంది? రోజూ ఇంత మందు తాగితే.. డ్రగ్స్ పార్టీల్లో పాల్గొంటే స్టేచర్ వస్తదా?"అని ఫైర్ అయ్యారు. అడ్డగోలుగా మాట్లాడటంలో కేసీఆర్‌ను మించినోడు దేశంలోనే లేడన్నారు. ఇప్పటిదాకా అసెంబ్లీలో తాను అన్‌పార్లమెంటరీ వ్యాఖ్యలు చేసినట్లుగా రికార్డుల్లోనే లేదని తెలిపారు. ప్రతిపక్షం లేని రాజకీయం చేయాలని తాము కోరుకోవడంలేదని స్పష్టం చేశారు. ప్రజల నుంచి జీతభత్యాలు తీసుకుంటూ పనిచేయనివారు దేశంలో కేసీఆర్ ఒక్కరేనని వ్యాఖ్యానించారు. కేసీఆర్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రం అప్పులు రూ.3.75 లక్షల కోట్లేనని అబద్ధాలు చెప్పారని, తాము అధికారంలోకి వచ్చాక లెక్కలు చూస్తే రూ.7.11 లక్షల కోట్ల మేరకు అప్పులు ఉన్నాయని తెలిపారు. పదేళ్లలో అప్పులు, తప్పులు తప్ప కేసీఆర్, కేటీఆర్ చేసిందేమీ లేదని, వాటిని సరిదిద్దే ప్రయత్నం తాము చేస్తున్నామని చెప్పారు.

కేంద్రం స్పందన చూశాక నిర్ణయం

స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు సంబంధించి అసెంబ్లీ తీర్మానంపై కేంద్ర ప్రభుత్వం స్పందన చూశాక ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని రేవంత్ చెప్పారు. స్థానిక ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్న ప్రశ్నకు ఈ మేరకు స్పందించారు. కాగా, ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వకముందు విడుదలైన ఉద్యోగ నోటిఫికేషన్లకు.. ఆయా నోటిఫికేషన్లలో పేర్కొన్న రూల్ ఆఫ్ రిజర్వేషనే వర్తిస్తుందని సీఎం స్పష్టం చేశారు. అప్పటి నోటిఫికేషన్లలో కొత్త రిజర్వేషన్లు అమలు చేయాలంటే కోర్టు కొట్టేస్తుందన్నారు. ఇప్పుడు ఇచ్చే రిజర్వేషన్లు అప్పటి నోటిఫికేషన్లకు వర్తించవన్నారు.

55 లక్షల ఎకరాల్లో యాసంగి సాగు..

తెలంగాణలో ఏటా యాసంగిలో 30-35 లక్షల ఎకరాల మేర సాగవుతుందని, కానీ.. ఈ ఏడాది రైతులు 55 లక్షల ఎకరాలు సాగు చేశారని సీఎం రేవంత్ తెలిపారు. ప్రాజెక్టుల్లో ఉన్న నీళ్లను సర్దుబాటు చేసి.. ఏ ప్రాజెక్టు కింద ఏ మేరకు నీళ్లు యాసంగికి ఇస్తామన్న దానిపై సాగునీటి శాఖ ముందే షెడ్యూల్ విడుదల చేసిందని, కానీ అందుబాటులో ఉన్న నీటి కంటే ఎక్కువ పంటను రైతులు వేశారని పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో పంటలకు నీళ్లు అందకపోవడంపై ఈ మేరకు స్పందించారు. రాష్ట్రంలో రైతులు బాధపడుతుంటే, శవాలు లేస్తుంటే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు తీన్మార్ డాన్సులు వేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ వస్తే కరువు వస్తదంటూ ఆ పార్టీ నేతలు మాట్లాడుతున్నారని, కరువొస్తే రికార్డు స్థాయిలో 1.56కోట్ల టన్నుల ధాన్యం ఎలా పండిందని ప్రశ్నించారు. గతంలో నాటి ఏపీ సీఎం జగన్‌రెడ్డిని ప్రగతి భవన్‌కు పిలిచి పంచభక్ష పరమాన్నాలు పెట్టి.. రాయలసీమ లిఫ్టుకు తెరలేపింది కేసీఆర్ కాదా? అని రేవంత్ ప్రశ్నించారు. పదేళ్లలో కృష్ణా ప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే ఆంధ్రావాళ్లతో ఇప్పుడు మనకు ఈ తలనొప్పి ఉండేది కాదన్నారు.



బడ్జెట్ కేటాయింపులపై జరిగిన సమావేశంలో భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

ప్రాధాన్య ప్రాజెక్టులకే నిధులివ్వాలి

» ఆర్థికశాఖను కోరిన మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రాధాన్య ప్రాజెక్టులకే నిధులు కేటాయించాలని, బిల్లుల చెల్లింపుల్లోనూ ఈ ప్రాజెక్టులకే ప్రాధాన్యం ఇవ్వాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కోరారు. ప్రాజెక్టుల నిర్మాణాలకు రూ.13 వేల కోట్లు, రుణాలకు రూ.13 వేల కోట్లు కలిపి... రూ.26 వేల కోట్లను రానున్న బడ్జెట్‌లో కేటాయించాలని ప్రతిపాదించారు. నీటిపారుదలశాఖ, పౌరసరఫరాల శాఖలకు బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో సోమవారం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ప్రాజెక్టులకు నిధుల కేటాయింపుపై మంత్రి ఉత్తమ్ ప్రతిపాదనలు అందించారు. శ్రీశైలం లెఫ్ట్ బ్యాంకు కెనాల్(టన్నెల్)తో పాటు ఏకే బీఆర్, సీతారామ, మల్లన్నసాగర్ నుంచి బస్వాపూర్, సింగూరులకు నీటి తరలింపు ప్యాకేజీలతో పాటు పాలమూరు-రంగారెడ్డిలో నార్లాపూర్-ఏదుల రిజర్వాయర్‌కు కాలువ పనులతో సీతారామ ప్రాజెక్టుతో పాటు ఏదుల నుంచి డిండి ఎత్తిపోతల పథకం ప్యాకేజీకి నిధులు కేటాయించాలని కోరారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నిధులన్నీ ఒక్క కాళేశ్వరం ప్రాజెక్టుకే వెచ్చించడంతో పాటు ఇతర ప్రాజెక్టులు పూర్తికాకపోవడం, పాత ప్రాజెక్టుల నిర్వహణనూ గాలికి వదిలేశారని డిప్యూటీ సీఎం భట్టి మండిపడ్డారు.

పాలమూరు ప్యాకేజీ-3 పూర్తి చేస్తే 60 టీఎంసీల నిల్వ: ఈఎన్‌సీ(జనరల్)

పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో ప్యాకేజీ-3 పనులు పూర్తిచేస్తే కరివెన రిజర్వాయర్ దాకా 60 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉంటుందని, మరికొన్ని పనులు పూర్తయితే ఉద్దండపూర్ దాకా నీటిని తరలించి, 90 టీఎంసీల నీటి నిల్వకు అవకాశం ఉంటుందని ఈఎన్‌సీ(జనరల్) జి.అనిల్‌కుమార్ గుర్తు చేశారు. జూరాల దిగువ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో గూడెందొడ్డి రిజర్వాయర్ సామర్థ్యం 15 టీఎంసీలకు పెంచుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. మున్నేరు-పాలేరు లింక్ పనులతో కాళేశ్వరంలోని ప్యాకేజీ-20, 21, 21ఏ, 22లను పూర్తి చేసుకోవడానికి నిధులు ఇవ్వాలని కోరారు.

మేడమ్ సార్.. మేడమ్ అంతే!

» ఆంధ్రప్రదేశ్‌లో అవినీతి కొత్తపుంతలు

» కొందరు ఉన్నతాధికారుల అక్రమాలకు తోడుగా భార్యలు

» పనిని బట్టి రేటు నిర్ణయం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



ఆంధ్రప్రదేశ్‌లో మాజీ సీఎం వైఎస్ జగన్ జమానాలో.. కొందరు ఉన్నతాధికారులు అడ్డగోలుగా సంపాదించారు. నిబంధనలకు పాతరేసి సొంత ప్రయోజనాలే పరమావధిగా పనిచేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ తరహా అవినీతి తగ్గిపోతుందనుకున్నారు. కానీ, అది మరో రూపంలో పుంతలు తొక్కుతోంది. సాధారణంగా ఉన్నతస్థాయిలో ఉన్న అధికారుల్లో కొందరు సొంతంగా, మరి కొందరు ఏజెంట్లను పెట్టుకుని 'డీల్' చేస్తుంటారు. సెటిల్‌మెంట్లకు వాళ్లు, వీళ్లు ఎందుకనుకున్నారో ఏమో గానీ.. కొందరు ఉన్నతాధికారుల భార్యలే రంగంలోకి దిగారు. అధికారులు కాస్త మెతకగా, మొహమాటం చూపించినా.. వారి భార్యలు మాత్రం లెక్క లెక్కే అంటూ కౌంటర్లు తెరిచారు. సిఫారసు లేఖలు, బదిలీలు, పోస్టింగ్‌లు, ఇతర ముఖ్యమైన పనులు చేయించడానికి భారీగా వసూలు చేస్తున్నారు. కొందరు మేడమ్‌లు స్టార్ హోటల్‌లో రూమ్‌లు తీసుకొని అక్కడే సెటిల్‌మెంట్లు, పనులు చేయించి పెడుతున్నారు. తమ భర్తల పేషీల్లోని ఈ-ఆఫీసుకు వచ్చే ఫైళ్ల మూవ్‌మెంట్‌ను కూడా పర్యవేక్షించే స్థాయికి కౌంటర్ వ్యవస్థ వెళ్లిపోయింది.

భార్యలదే పెత్తనం..

కొందరు అధికారులు.. తమ భార్యలకు ఆఫీసుపై పెత్తనం అప్పగించి వారి చేతిలో కీ లుబొమ్మల్లా మారారనే ఆరోపణలున్నాయి. కనక వర్షం కురిపించే ఫైళ్ల పరిష్కారానికే తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. అంతా మేడమ్ గారే చూసుకుంటారని బాహాటంగా సిగ్నల్ ఇస్తున్నారు. మొదట ఆమె దర్శనం చేసుకోవాలని, ఆమె చెబితేనే అపాయింట్‌మెంట్ ఉంటుందని బహిరంగానే చెబుతున్నారు. మేడమ్ గారిని దర్శించుకోవాలంటే ప్రైవేటు వ్యక్తి ద్వారా అపాయింట్‌మెంట్ తీసుకోవాలి. తమ సార్ వద్దే పని ఉందని నిర్ధారిస్తూ, అది ఎన్ని కోట్ల రూపాయలతో ముడిపడిన పనో స్పష్టత ఇవ్వాలి. ఆ ఫైలును సెటిల్ చేయడంలో సారు పాత్ర ఏమిటో తేలాలి. అప్పుడు మేడమ్ అపాయింట్‌మెంట్.. తర్వాత చెల్లింపులు ఖరారవుతాయి. అనంతరం సంబంధిత ఫైలుపై సారు సంతకం ఉంటుంది. ఇలా దాదాపు 16 మంది అధికారులు మేడమ్ ద్వారా కౌంటర్ తెరిపించి పనులు చేయిస్తున్నారని 'ఆంధ్రజ్యోతి'కి పక్కా సమాచారం అందింది. ఆరా తీస్తే 10 మంది అధికారులు ఈ విద్యలో ఆరితేరినట్లు సాక్ష్యాధారాలతో తేలింది.

మచ్చుకు కొందరు అధికారుల లీలలు..

ఓ అధికారి గత జగన్ ప్రభుత్వంతో సన్నిహితంగా ఇమడలేకపోయారు. వైద్య, ఆరోగ్య శాఖతో పాటు పలు శాఖల్లో చేసిన అవినీతి పనులే కారణం. కూటమి ప్రభుత్వం రాగానే ఆయన దశ మారింది. ప్రభుత్వాన్ని నడిపించే కీలక వ్యవస్థలో ముఖ్య అధికారిగా చేరిపోయారు. ఆ రోజు నుంచే ఆయన భార్య రంగంలోకి దిగారు. తొలుత ఇంటి నుంచే పనులన్నీ చేసేవారు. సారు రేంజ్ సచివాలయంలోని ఏ-బ్లాక్‌కు మారిన తర్వాత సెటిల్‌మెంట్ల స్థాయి కూడా పెరిగింది. విజయవాడ ఎంజీ రోడ్డులోని ఫైవ్ స్టార్ హోటల్‌లో పర్మినెంట్‌గా ఓ రూమ్ తీశారు. అక్కడ మేడమ్ ఉదయం 11:30 గంటల నుంచే అందుబాటులో ఉంటారు. దైవదర్శనం లేఖలు, స్వామివారి కల్యాణంతో పాటు కీలకమైన ఆర్జిత సేవల టికెట్లు, డిప్యూటీ కలెక్టర్ పోస్టింగ్‌ల వ్యవహారాలన్నీ ఆమె కనుసన్నల్లోనే జరుగుతాయి. చివరకు టీటీడీ బోర్డు సభ్యుడిగా పోస్టింగ్ ఇప్పిస్తామని కూడా పైరవీలు చేశారు. ఇద్దరు సభ్యుల నుంచి రూ.10 కోట్లు వసూలు చేశారన్న ఫిర్యాదులున్నాయి. ప్రభుత్వంలో అత్యంత కీలకమైన వ్యక్తి అపాయింట్‌మెంట్లను కూడా ఈ అధికారి అమ్మకానికి పెట్టినట్లు తెలిసింది. 10 నిమిషాల అపాయింట్‌మెంట్ కావాలంటే కనీసం 25 లక్షలు ముట్టచెప్పాల్సిందేనట! .

ఈ అధికారుల రూటే వేరు..

ఇంకో అధికారికి ఎవరు అధికారంలో ఉంటే వారే ముఖ్యం. ప్రభుత్వంతో ఎవరికి పడదో ఏరి కోరి వారితోనే గొడవకు దిగుతారు. ప్రభుత్వం దృష్టిలో సూపర్ హీరోగా నిలుస్తారు. జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ఆయనతో ఈ అధికారి గొడవ పడ్డారు. వైసీపీ ప్రభుత్వం రాగానే సర్దుకుపోయారు. కీలకమైన పదవులు సంపాదించారు. ఏకంగా రెవెన్యూలో నంబర్ 3 పొజిషన్‌లో కూర్చోబెట్టేంతగా జగన్‌ను ప్రసన్నం చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం రాగానే కీలకమైన ఆదాయం తీసుకొచ్చే పనిని సారుకు అప్పగించారు. అంతే.. మేడమ్ మంగళగిరిలో ఓ ఆఫీసు తెరిచారు. అక్కడ వద్దనుకుంటే విజయవాడ ఎంజీ రోడ్డులోని ఓ ప్రముఖ హోటల్‌లో లంచ్ మీటింగ్‌లు పెడతారు. సారుతో పనిపడిన వ్యాపారవేత్తలంతా అక్కడ లంచ్ మీటింగ్‌లకు హాజరవ్వాలి. వారికోసం ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారని తెలిసింది. ఇలా వచ్చిన సొమ్మును సారు ఓ ప్రైవేటు డెయిరీలో పెట్టుబడిగా పెట్టినట్లు తెలిసింది. మరో ఉన్నతాధికారి గుంటూరు జిల్లాలో కీలక పోస్టులో పని చేస్తున్నప్పటి నుంచే మేడమ్ బ్యాక్ ఆఫీసు నడిపేవారు. తర్వాత గృహ నిర్మాణ శాఖలో ఉన్నప్పుడు ఆ వ్యవహారాలు పరాకాష్ఠకు వెళ్లాయి. ఇప్పుడు పనిచేస్తున్న శాఖలోనూ అంతే.

బొటిక్ బొనాంజా..

ఈ ఉన్నతాధికారి తనకు ఫలానా పోస్టు కావాలని నేరుగా ప్రభుత్వాన్ని అడగరు. సంబంధిత మంత్రులే సీఎం దగ్గరకు వెళ్లి ఆ అధికారికి తమ శాఖలో పోస్టింగ్ ఇవ్వాలని కోరతారు. ఇదీ ఆయన రేంజ్. ఏ పని చేస్తే డబ్బులు వస్తాయి.. ఆ డబ్బును ఎలా దారి మళ్లించవచ్చో ఆయన చక్కని దారులు చూపించగలరు. అలాంటి అధికారి వెనుక ఉండి నడిపించేది ఆయన భార్యే. ఆమెకు మల్టీలెవల్ బొటిక్‌లు ఉన్నాయి. సారు కష్టపడి అక్రమ మార్గంలో సంపాదించే సొమ్మును మేడంగారు బొటిక్ వ్యాపారంలో వైట్‌గా చూపిస్తారు. తర్వాత అదే డబ్బును విశాఖ, హైదరాబాద్, బెంగళూరుల్లో రియల్ ఎస్టేట్ పెట్టుబడిగా పెడతారు. ప్రకాశం జిల్లాలో కీలక పోస్టులో ఉన్న ఓ అధికారికి మామ మాటే వేద వాక్కు. ఏ పని చేయాలో, ఏ ఫైలుపై సంతకం పెట్టాలో ఆయనే నిర్ణయిస్తారు. శ్రీకాకుళం నుంచి మామ ఓ స్లిప్ పంపిస్తారు. అంతే.. ఆ అధికారి ఎలాంటి పనైనా చేసి పెడతారు.

గేట్లు ఎత్తేశారు..

ఆయన.. కీలకమైన శాఖలో ఉన్నతాధికారి. సబ్జెక్టు మీద ఎంతటి పట్టు ఉంటుందో, అందులోని లొసుగులు కనిపెట్టడంలోనూ అంతటి దిట్ట. ప్రతీ వారం ఆయన కౌంటర్ నింపుకొన్నారని జగన్ జమానాలో అధికారవర్గాలు తెగ చర్చించుకున్నాయి. విశాఖ కేంద్రంగా భారీ స్థాయిలో ఆయన భూచక్రం తిప్పారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలోనూ మరో కీలక శాఖలో ప్రధాన బాధ్యతల్లో ఉన్నారు. ఈ సారి సారు భార్య రంగంలోకి దిగారు. కాంట్రాక్టర్లు, ఇంజనీర్లు, ఇతర వ్యవహారాల సెటిల్‌మెంట్లకు స్వయంగా ఆఫ్‌లైన్‌లో వర్క్ చేస్తున్నారు. సారు బావమరిది నెల్లూరు కేంద్రంగా హోటళ్లు, రెస్టారెంట్లు నడుపుతున్నారు. హైదరాబాద్‌లో ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ పరిధిలోని ఖరీదైన ఏరియాలో రెండు భారీ అపార్ట్‌మెంట్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిసింది.



పెళ్లిలో ఫోన్‌పే స్కానర్ ద్వారా కట్నాల చదివింపులు చేస్తున్న దృశ్యం

పెళ్లిలో క్యూఆర్ కోడ్‌తో కట్నాల చదివింపులు

వర్గల్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సాంకేతికత అత్యున్నత దశలో ఉన్న నేటి కాలంలో ప్రతీదీ డిజిటలైజేషన్ అయిపోతోంది. ఇంతకాలం పెళ్లికి వచ్చిన బంధువులు పెళ్లికొడుకు, పెళ్లికూతురును ఆశీర్వదించడంతో పాటు రాతపూర్వకంగా కట్నాలు సమర్పించడం మామూలే. ప్రస్తుతం ట్రెండు మారింది. సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం గౌరారంలో ఆదివారం జరిగిన ఓ పెళ్లి వేడుకలో పెళ్లికొడుకు, పెళ్లి కూతురు తరఫున కట్నాల చదివింపులను ఆన్‌లైన్‌లో స్వీకరించారు. క్యూఆర్ కోడ్ ద్వారా చదివింపులు తీసుకున్నారు. ఇది కాస్తా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

ఎవరినీ గుర్తు పట్టలేకపోతున్న శ్రీతేజ్

- 3 నెలలుగా చికిత్స అందిస్తున్నా బాలుడి నరాల పని తీరులో కనిపించని పురోగతి

హైదరాబాద్ సిటీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): సంధ్య థియేటర్‌లో గతేడాది పుష్ప-2 సినిమా బెనిఫిట్ షో సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో తీవ్రంగా గాయపడ్డ శ్రీతేజ్ ఇంకా ఎవరినీ గుర్తు పట్టడం లేదు. కళ్లు మాత్రమే తెరుస్తున్నాడు. మిగతా శరీరం అచేతనంగా ఉంది. అతని నరాల పనితీరులో ఎలాంటి పురోగతి లేదని వైద్యులు తెలిపారు. శ్రీతేజ్‌కు ప్రస్తుతం కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఇటీవల ఆ బాలుడికి ఎండోస్కోపిక్ గ్యాస్ట్రోస్టమీ ప్రక్రియ నిర్వహించినట్లు వైద్యులు చేతన్, డాక్టర్ విష్ణుతేజ్ సోమవారం వెల్లడించారు. గొట్టం ద్వారా కడుపులోకి ఆహారాన్ని అందిస్తున్నట్లు వివరించారు. గాయాలకు సంబంధించి వైద్యపరంగా శ్రీతేజ్‌కు అందించాల్సిన చికిత్సలు పూర్తయ్యాయని, ఇక కేవలం రీహాబిలిటేషన్ వైద్యం అందిస్తే సరిపోతుందని వైద్యులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. కాగా, తొక్కిసలాట ఘటనలో శ్రీతేజ్ తల్లి రేవతి చనిపోయిన సంగతి తెలిసిందే.

మెదక్ జిల్లాలో వింతవ్యాధితో 5వేల కోళ్ల మృతి

కౌడిపల్లి, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): వింతవ్యాధితో 5వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మెదక్ జిల్లా కౌడిపల్లి మండల పరిధిలోని కంచన్‌పల్లిలో సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రామకృష్ణగౌడ్‌కు 6 వేల కోళ్ల సామర్థ్యం కలిగిన కోళ్ల ఫామ్ ఉంది. 31 రోజుల క్రితం కోడిపిల్లలను తీసుకువచ్చి పెంచుతున్నారు. శనివారం వరకు ఎలాంటి ఇబ్బంది లేకపోయినా రెండ్రోజుల్లో వింతరోగంతో 5వేల కోళ్లు మృతి చెందాయని రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు.

గ్రూప్-1 ఫలితాలు విడుదల

హైదరాబాద్, మార్చి 10(ఆంధ్రజ్యోతి): ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష ఫలితాలు వెలువడ్డాయి. వివిధ ప్రభుత్వ శాఖల్లో 563 పోస్టుల భర్తీకి గత ఏడాది అక్టోబరు 21 నుంచి 27 వరకు నిర్వహించిన పరీక్షలకు సంబంధించి ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సోమవారం ప్రకటించింది. ఫలితాలను అభ్యర్థులు టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో తమ వ్యక్తిగత లాగిన్‌లో చూసుకోవచ్చు. ఈనెల 16 సాయంత్రం 5గంటల వరకు అభ్యర్థులు మార్కులను చూసుకోవచ్చని, డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కమిషన్ తెలిపింది. రీకౌంటింగ్‌కు 15 రోజుల గడువు ఇచ్చారు. దీనికోసం ప్రతి పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. సోమవారం ప్రకటించిన ఫలితాల్లో పలువురికి 60% మార్కులు దాటి వచ్చాయని తెలిసింది. సోమవారం సాయంత్రం వరకు అందించిన సమాచారం మేరకు హన్మకొండ విద్యానగర్‌కు చెందిన జిన్న తేజస్విని 532.5 మార్కులు సాధించారు. జనరల్ ఎస్సేలో 79.5, హిస్టరీ, కల్చర్, జాగ్రఫీలో 102, ఇండియన్ సొసైటీ, కానిస్టిట్యూషన్ అండ్ గవర్నెన్స్‌లో 89.5, ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్‌లో 113.5, సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ డేటా ఇంటర్‌ప్రెటేషన్‌లో 68, తెలంగాణ మూమెంట్ అండ్ స్టేట్ ఫార్మేషన్‌లో 80 మార్కులు సాధించారు. అర్హత పరీక్ష జనరల్ ఇంగ్లి‌ష్‌లో తేజస్విని 150కి 121 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించినవారి వివరాలపై రీకౌంటింగ్ గడువు ముగిశాక 15 రోజుల తర్వాత స్పష్టత రానుంది. టీజీపీఎస్సీ ముందుగా ప్రకటించిన ప్రకారం గ్రూప్-2 పరీక్ష జనరల్ ర్యాంకింగ్ జాబితాను నేడు విడుదల చేయనుంది. అలాగే గ్రూప్-3 జనరల్ ర్యాంకింగ్ జాబితాను మార్చి 14న విడుదల చేయనున్నారు.

టీడీఆర్ స్కామ్‌కు రేవంత్ కుట్ర

- అయన చుట్టూ నలుగురు రియల్‌ఎస్టేట్ బ్రోకర్లు
- టీడీఆర్‌లపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- కేసీఆర్ స్థాయికి రేవంత్ సరిపోరు
- చిట్‌చాట్‌లో మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో అభివృద్ధి బదలాయింపు హక్కులు(టీడీఆర్), ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్(ఎఫ్ఎస్ఐ)లతో సీఎం రేవంత్‌రెడ్డి వందలు, వేల కోట్ల రూపాయల భారీ కుంభకోణానికి కుట్ర పన్నుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సోమవారం కేటీఆర్ మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. రేవంత్ చుట్టూ ఉన్న నలుగురు రియల్ ఎస్టేట్ బ్రోకర్లు టీడీఆర్‌ల సమాచారాన్ని సేకరిస్తున్నారని తెలిపారు. హైదరాబాద్‌లో రేవంత్‌రెడ్డి ఎఫ్ఎస్ఐ పరిమితులను విధించబోతున్నారని, దీనిపై త్వరలో ప్రకటన రాబోతోందన్నారు. రేవంత్ ముఠా టీడీఆర్‌లను తక్కువ రేట్లకు కొనుగోలు చేస్తుందని, ఎఫ్ఎస్ఐ పరిమితులను విధించాక టీడీఆర్‌ల డిమాండ్‌ను పెంచి అత్యధిక రేట్లకు అమ్మబోతున్నారని ఆరోపించారు. హైదరాబాద్‌లో భవనాలు ఎక్కువగా వస్తుండడంతో నగరాభివృద్ధికి ఇబ్బందులేర్పడుతున్నాయన్న సాకు చూపి టీడీఆర్‌లను ఎక్కువ రేట్లకు అమ్మే కుట్ర చేస్తున్నారని తెలిపారు. ఇది ముమ్మాటికి ఇన్‌సైడర్ ట్రేడింగేనని.. సీబీఐ, ఈడీ దర్యాప్తు చేయదగ్గ స్కామ్ అని ఆరోపించారు. తన ఆరోపణల్లో నిజంలేకుంటే హైదరాబాద్‌లో టీడీఆర్‌లపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎఫ్ఎస్ఐపై పరిమితులు విధించరాదని గతంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుందని, తాము దాన్నే కొనసాగించామన్నారు. టీడీఆర్‌ల పద్ధతిలో జీహెచ్ఎంసీ ఇప్పటికే ప్రజల వద్ద నుంచి 400 ఎకరాల భూమిని సేకరించిదన్నారు. ప్రభుత్వ ఖజానాపై భారం పడకుండా, ప్రజలకు ఉపయోగపడే ఈ విధానాన్ని రేవంత్ తన అక్రమ సంపాదనకు మార్గంగా మార్చుకుంటున్నాడని చెప్పారు. ఇక బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై రేవంత్‌కు చిత్తశుద్ధి ఉంటే.. చనిపోయేదాకా అయన ఢిల్లీలో ఆమరణ నిరాహార దీక్ష చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి బీజేపీకి కోవర్టుగా పని చేస్తున్నాడని, రాహుల్ గాంధీ రాజస్థాన్‌లో మాట్లాడుతూ కాంగ్రెస్‌లో



బీజేపీ కోవర్టులున్నారంటూ చేసిన వ్యాఖ్యలు రేవంత్‌ను ఉద్దేశించినవేనని ఆరోపించారు. ఢిల్లీలో రేవంత్ మాట నడవడం లేదని, అందుకే ఆయన చెప్పిన వారిని ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించలేదన్నారు. బీజేపీతో లోపాయికారి ఒప్పందాల కోసమే ఢిల్లీ వెళ్తున్నాడని ఆరోపించారు. 11 అంశాలతో ప్రధానిని కలిశానంటున్న రేవంత్ అసలు ఎజెండా వేరుగా ఉందని, మంత్రి శ్రీధర్‌బాబును బయటకు పంపి మోదీతో రేవంత్ ఏం మాట్లాడారో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి, కిషన్‌రెడ్డి దొంగాట ఆడుతున్నారని ఆరోపించారు. గవర్నర్ ప్రసంగం రోజు కేసీఆర్ అసెంబ్లీకివస్తారని చెప్పారు. కేసీఆర్ స్థాయికి రేవంత్ ఆవ గింజంత కూడా సరిపోడన్నారు. మరోసారి ఫార్ములా-ఈ రేసు కేసును ముందుకుతెస్తారని, 16న బడ్జెట్ పెట్టి 17న నోటీసులు ఇచ్చి మళ్లీ తనను పిలుస్తారని చెప్పారు. గతంలో 46 కోట్లతో ఫార్ములా-ఈ రేసు నిర్వహిస్తే అవినీతి, కేసులు అంటూ మాట్లాడిన రేవంత్ 200 కోట్లు పెట్టి ప్రపంచ సుందరి పోటీల నిర్వహణ వల్ల ఉద్యోగాలు వస్తాయా అన్నది చెప్పాలన్నారు.

ప్రాథమిక విద్య..
నాణ్యత మిథ్య



(మొదటిపేజీ తరువాయి)

ఇటీవలే సీఎం రేవంత్‌ను కలిసి విద్యావ్యవస్థలో చేపట్టాల్సిన సంస్కరణలపై కీలక సిఫారసులు చేశారు. సీఎం ఆదేశాలతో ఉన్నతాధికారులు ఈ సిఫారసులను పరిశీలిస్తున్నట్లు తెలిసింది.

36 రాష్ట్రాల్లో 32వ స్థానం

ప్రాథమిక పాఠశాలల్లో నాణ్యత దారుణంగా ఉండటంతో దీనిప్రభావం మాధ్యమిక, ఉన్నత, ఇంటర్మీడియట్ విద్యపైనా పడుతోందని విద్యా కమిషన్ తెలిపింది. రాష్ట్రం మొత్తంలో ఇంటర్ చదువుతున్న విద్యార్థుల్లో కేవలం 23% మాత్రమే ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్నారని పేర్కొంది. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 18,259 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలుండగా, 13,930 (76%) పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య 50లోపు ఉంది. అలాగే 4235 (23%) బడుల్లో ఒక్కరే ఉపాధ్యాయుడు ఉన్నారు. మొత్తం 18,259 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 12,760 (70%) బడుల్లో తరగతి గదులు 3 లోపే ఉన్నాయని తెలిపింది. ప్రభుత్వ బడుల వసతుల కల్పనలో జాతీయస్థాయిలో 36 రాష్ట్రాల్లో తెలంగాణ 32వ స్థానంలో ఉండగా.. నాణ్యమైన విద్య, సమర్థంగా బడుల నిర్వహణలో 27వ స్థానంలో ఉందని తెలంగాణ విద్యా కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో తెలిపింది. అలాగే ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో అందించే విద్యపై 99% తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని తెలిపింది.

నర్సరీ టు ఇంటర్ 'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్'

'తెలంగాణ పబ్లిక్ స్కూల్స్' (టీపీఎస్) పేరుతో ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలలతోపాటు ప్రభుత్వ జూనియర్ కాలేజీలూ ఒకేచోట ఏర్పాటు చేయాలని కమిషన్ కీలక సిఫారసులు చేసింది. 1500 మంది విద్యార్థులకు ఒకటి చొప్పున ప్రతీ మండలంలో 3 టీపీఎస్‌లు ఏర్పాటు చేయాలని కోరింది. అన్ని వసతులతో ఒక టీపీఎస్ ఏర్పాటు చేయాలంటే రూ.12 కోట్లు అవసరం అవుతాయి. రాష్ట్రంలోని అన్ని 632 మండలాల్లో ఏర్పాటుకు ప్రభుత్వ రూ. 22,752 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. నర్సరీ నుంచి 2వ తరగతి వరకు ప్రత్యేకంగా తెలంగాణ ఫౌండేషనల్ స్కూల్స్ (టిఎఫ్ఎస్) ఏర్పాటు చేయాలని కమిషన్ సూచించింది. వీటిని మండలానికి 4 చొప్పున నెలకొల్పాలని సూచించింది. అన్ని వసతులతో ఒక ఫౌండేషనల్ స్కూల్ ఏర్పాటు చేయాలంటే రూ. 3.5 కోట్లు ఖర్చవుతుంది. రాష్ట్రంలోని అన్ని 632 మండలాల్లో ఏర్పాటుకు రూ. 8,848 కోట్లు అవసరం అవుతాయని తెలంగాణ విద్యా కమిషన్ అంచనా వేసింది.

మినీ బస్సులతో యువతకు ఉపాధి

డ్రాపౌట్ల సంఖ్య అరికట్టేందుకు ప్రభుత్వ బడులకు ప్రత్యేకంగా మినీ బస్సులు నడపాలని, దీంతో విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు వెళ్తారని కమిషన్ సూచించింది. మినీ బస్సుల ఏర్పాటుకు స్థానిక యువతకు 50% సబ్సిడీ ప్రభుత్వం ఇవ్వాలని సూచించింది. దీంతో స్థానిక యువతకు ఉపాధి కూడా లభిస్తుందని సూచించింది. 632 మండలాల్లో మినీ బస్సుల పథకానికి ప్రభుత్వం దాదాపు రూ. 1,990 కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని కమిషన్ అంచనా వేసింది.

బడిలో విద్యార్థిని అనుమానాస్పద మృతి

- రాత్రి భోజనం చేశాక నిద్ర.. తెల్లారేసరికే మృతి
- ఇచ్చోడ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విషాదం



చిత్ర లాలిత్య (ఫైల్)

ఇచ్చోడ/బోథ్, మార్చి, 10 (ఆంధ్రజ్యోతి) : అప్పటి వరకు హాస్టల్‌లోని తోటి విద్యార్థినులతో సరదాగా గడిపిన బాలిక.. కొద్ది సేపటికే విగత జీవిగా మారింది. రాత్రి భోజనం చేసిన అనంతరం నిద్రపోయిన ఆ విద్యార్థిని.. తెల్లారేసరికే అనంతలోకాలకు వెళ్లిపోయింది. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలోని ఆశ్రమ పాఠశాలలో ఈ దారుణం జరిగింది. జిల్లాలోని బజార్‌హత్నూర్ మండలం మోర్కండి గ్రామానికి చెందిన లాలిత్య(14) ఇచ్చోడలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఆదివారం రాత్రి భోజనం చేసిన అనంతరం నిద్రపోయిన లాలిత్య.. సోమవారం ఉదయం ఎంతకూ లేవకపోవడంతో.. తోటి విద్యార్థినులు విషయాన్ని పాఠశాల సిబ్బందికి తెలియజేశారు. దీంతో ఉపాధ్యాయులు వచ్చి చూసేసరికి బాలిక అచేతనంగా ఉంది. వెంటనే పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, వైద్యులు బాలికను పరిశీలించారు. ఆమె చనిపోయిందని నిర్ధారించిన వైద్యులు.. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బోథ్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేశారు. ఐటీడీఏ అధికారులు పాఠశాలలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. మృతురాలి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు నమోదు చేశారు.

దయనీయంగా ప్రభుత్వ హాస్టళ్లు : బోథ్ ఎమ్మెల్యే

బోథ్ నియోజకవర్గంలోని ప్రభుత్వ హాస్టళ్ల పరిస్థితి దయనీయంగా మారిందని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ విమర్శించారు. హాస్టళ్లలో భోజనం, నీరు, మరుగుదొడ్లు తదితర వసతుల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉందన్నారు. బోథ్ ఆస్పత్రిలో బాలిక మృతదేహాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం అనిల్ విలేకరులతో మాట్లాడారు. బాలిక తండ్రికి ప్రభుత్వ ఉద్యోగంతో పాటు రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.